సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 6

శుక్రవారం 29-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. 13లో

హైదరాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ కేథడ్రల్ చర్చి వద్ద గురువారం ప్రార్థనలు



'ఆప్'ను అంతం చేసే కుట్ర

ఈడీ దోపిడీ రాకెట్ నడుపుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆప్‌ను అంతమొందించడం ఈడీ లక్ష్యాల్లో ఒకటన్నారు.

- వివరాలు 6లో



జస్టిస్ మౌషుమి ప్రమాణం

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌమిమి బాధ్యతలు చేపట్టారు. సీజే జస్టిస్ అరాధే ఆమెతో ప్రమాణం చేయించారు.

- వివరాలు 5లో



'న్యాయ' ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర

న్యాయ వ్యవస్థను అప్రతిష్టపాల్జేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ 600 మందికిపైగా సీనియర్ న్యాయవాదులు సీజేఐకి లేఖ రాశారు.

- వివరాలు 6లో



గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ మృతి

జైలుశిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు ముక్తార్ అన్సారీ గుండెపోటుకు గురై ఆస్పత్రిలో మృతి చెందాడు.

- వివరాలు 6లో

'కారు'లో కలకలం

బీఆర్‌ఎస్‌కు సీనియర్ నేత కె.కేశవరావు గుడ్‌బై

సోనియా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం

రేపు కాంగ్రెస్‌లోకి కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి

హఠాత్తుగా వరంగల్ లోక్‌సభ బరి నుంచి తప్పుకున్న కడియం కావ్య

- కడియం శ్రీహరి, కావ్య కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం.. శ్రీహరి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసే చాన్స్!
- వరుస నిష్క్రమణలతో గులాబీ దళంలో కలవరం



కాంగ్రెస్ సొంత ఇల్లులాంటిది..

53 ఏళ్లు అందులో పనిచేశా: కేకే

- నేను ఆ పార్టీలోనే చనిపోవాలనుకుంటున్నా..
- త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వెల్లడించిన కె.కేశవరావు
- అంతకుముందు కేసీఆర్‌తో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- ఇటీవల కేకే వెల్లడించిన అభిప్రాయాలపై బీఆర్‌ఎస్ అధినేత తీవ్ర అసంతృప్తి

2లో

పోటీ నుంచి తప్పుకుంటున్నా..

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కడియం కావ్య లేఖ

2లో

భారత్ రాష్ట్ర సమితి పార్టీలో గురువారం రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ఆ పార్టీ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు ప్రకటించారు. ఎప్పుడు చేరేది మూడు నాలుగురోజుల్లో వెల్లడిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ ఖరారైన తర్వాత ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాలని కేశవరావు భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసేందుకు టికెట్ దక్కించుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య హఠాత్తుగా బరి నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు ఆమె బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు గురువారం రాత్రి లేఖ రాశారు. కాగా కడియం శ్రీహరి, కావ్య కూడా త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు సమాచారం. కడియం శ్రీహరి వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కీలక నేతలు వరుసగా పార్టీకి గుడ్‌బై చెబుతుండటం, చివరకు టికెట్ దక్కించుకున్న వారు సైతం వేరే పార్టీలోకి వెళుతుండటం బీఆర్‌ఎస్‌లో కలకలం సృష్టిస్తోంది. కేకే కుమార్తె గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరడం ఇప్పటికే ఖాయం కాగా.. ఇలా ఇద్దరు నేతలు దాదాపుగా ఒకే సమయంలో తమ కుమార్తెలతో సహా బీఆర్‌ఎస్‌ను వీడనుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది.

భారీగా 'బ్యాక్‌లాగ్'!

ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మిగిలిపోతున్న పోస్టులు

ఒకే అర్హతలున్న కొలువులన్నింటికీ దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

రెండు, అంతకంటే ఎక్కువ జాబ్‌లకు ఎంపికవుతున్న కొందరు.. అందులో పైస్థాయి కొలువుల ఎంపికతో మిగతావి ఖాళీ

- ఇలా ప్రతి కేటగిరీలోనూ సగటున 10% దాకా మిగులు
- ఒక్క గురుకుల పోస్టులకు సంబంధించే 1,810 ఖాళీలు
- కానిస్టేబుల్ కేటగిరీలో మరో 2 వేల పోస్టులు మిగులు
- వైద్యారోగ్య శాఖలోనూ దాదాపు 780 పోస్టులు ఖాళీ
- వీటి భర్తీకి కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేయాల్సిన పరిస్థితి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్న నియామక సంస్థలకు బ్యాక్‌లాగ్ తిప్పలు పట్టుకున్నాయి. ఒకే సమయంలో భారీగా ఉద్యోగ ఖాళీలకు నోటిఫికేషన్లు, భర్తీ ప్రక్రియలు చేపడుతుండటంతో.. గణనీయ సంఖ్యలో ఉద్యోగాలు భర్తీకాకుండా మిగిలిపోతున్నాయి. పోటీ పరీక్షల కోసం పకడ్బందీగా సిద్ధమవుతున్న చాలా మంది అభ్యర్థులు.. ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. వాటిలో ఒక దానిని ఎంచుకోవడంతో మిగతా ఉద్యోగాలు ఖాళీగా మిగిలిపోతున్నాయి. ఉద్యోగ నియామక సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, వివిధ కేటగిరీల్లో ఉద్యోగాల కౌన్సెలింగ్‌ను ఒకే సమయంలో నిర్వహించడం వంటివి దీనికి కారణమవుతున్నాయి. ఉద్యోగాలకు ఎంపికైనవారు వాటిని వదులుకుంటే.. తర్వాతి మెరిట్ అభ్యర్థులకు కేటాయించే పరిస్థితి (రిలిక్విష్‌మెంట్) లేకపోవడం కూడా సమస్యకు దారితీస్తోంది. ఇలా మిగిలిపోయిన ఉద్యోగాలకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, భర్తీ ప్రక్రియ చేపట్టాల్సి వస్తోంది. ఇటీవల భర్తీ చేసిన గురుకుల కొలువులు, పోలీస్ కానిస్టేబుల్, స్టాఫ్ నర్స్, మెడికల్ ఆఫీసర్ తదితర కేటగిరీ

మిగతా 5వ పేజీలో ▶

మిగిలిన గురుకుల పోస్టులను మెరిట్‌తో భర్తీ చేయండి

రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల బోర్డులకు హైకోర్టు ఆదేశం 5లో



సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించాలని సూచన

న్యూస్‌రీల్

రైతులకు విత్తన సబ్సిడీ



వచ్చే వానాకాలం నుంచి రైతులకు సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. వరి, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్, మినుములు, జీలుగ, జనపనార, పిల్లి పెసర తదితర విత్తనాలను సబ్సిడీపై అందజేసేందుకు కసరత్తు చేస్తోంది.

- వివరాలు 5లో

నిరుద్యోగ 'యువ భారత్'



తెలంగాణలో 15–29 ఏళ్ల మధ్య వయస్కుల్లో 48.6 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. మనోళ్ల నైపుణ్యాలు కూడా అంతంతే.. 90 శాతం మందికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం తెలియదు. ఐఎల్‌ఓ, ఐహెచ్‌డీ సంయుక్త నివేదికలో ఇంకా అనేక అంశాలు వెల్లడయ్యాయి.

- వివరాలు 8లో

జాతరలు, యాత్రలేనా.. రైతుల బాధలు పట్టవా?



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు, నాలుగు నెలలుగా ఎక్కే విమానం.. దిగే విమానం అంటూ.. ఢిల్లీకి జాతరలు, యాత్రలు చేస్తున్నాడే తప్ప రైతుల బాధలు చూడట్లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే.. సీఎం కానీ, మంత్రులు కానీ పొలాల దిక్కు చూసిన పాపాన పోలేదన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని అన్నారు. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని, పంటలు ఎండిన రైతులను, కౌలు రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇచ్చిందని, ఇప్పుడు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా సారంపల్లిలో నీరు లేక ఎండిన పొలాలను పరిశీలించారు.

- వివరాలు 2లో

చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందాం

- పొత్తులు, జిత్తులు, ఎత్తులతో మళ్లీ మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు
- సెల్‌ఫోన్ ఉన్న ప్రతి కార్యకర్త ఓ ఎడిటర్, ఓ చానల్ ఓనర్
- సోషల్ మీడియా ద్వారా ఎల్లో మీడియాను ఏకేద్దాం
- నంద్యాల బహిరంగ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర రూపు రేఖలు మార్చేందుకు మనమంతా సిద్ధమవుదామని పిలుపు

7లో





నంద్యాలలో జరిగిన మేమంతా సిద్ధం సభలో పాల్గొన్న అశేష జనసందోహంలో ఓ భాగం • సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

మేడిగడ్డ డిజైన్లలో వైరుధ్యాలెందుకు?

అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పోల్చితే తేడాలెందుకు?

సీడీవోకు ప్రశ్నలు సంధించిన అయ్యర్ కమిటీ

కాఫర్ డ్యామ్ షీట్‌పైల్స్ తొలగించక పోవడంతోనే ఏడో బ్లాక్ కుంగిందా?

డిజైన్లను ఆమోదించాలని సీడీవోపై ఒత్తిళ్లు వచ్చాయా అని ప్రశ్నలు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పోల్చితే మేడిగడ్డ బ్యారేజీ నిర్మిత స్థలంతోపాటు ర్యాఫ్ట్–ఎగువ/దిగువ కాటాఫ్ వాల్స్ మధ్య జాయింట్లకు సంబంధించిన డిజైన్లలో వైరుధ్యాలు ఎందుకు ఉన్నాయని నీటిపారుదల శాఖలో కీలకమైన సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో)ను చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రశ్నించింది. ఈ విషయంలో సీడీవో తీసుకున్న అంతర్గత నిర్ణయాలకు సంబంధించిన నోట్స్‌ను అందించాలని

మిగతా 7వ పేజీలో ▶

జీవితాంతం కొడంగల్‌కు రుణపడి ఉంటా..

ఏ స్థాయిలో ఉన్నా ఈ ప్రాంత బిడ్డనే: సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్‌లో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటేసిన సీఎం

ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు.. నేను ఏ స్థాయిలో ఉన్నా ఈ ప్రాంతం బిడ్డనే. నా ప్రతి కష్టంలోనూ కొడంగల్ ప్రజలు అండగా నిలిచారు. గుండెల్లో పెట్టుకొన్నారు. మీకు జీవితాంతం రుణపడి ఉంటా.. 8న మళ్లీ కొడంగల్ వస్తా. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి. - సీఎం రేవంత్‌రెడ్డి

2లో


నువ్వా.. నేనా..!

- హోరాహోరీగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- 99.86 శాతం పోలింగ్ నమోదు.. క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ

వివరాలు 2లో



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీజేఐకి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



ఎండల మంటలే!

సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు అదనంగా నమోదు

ఎల్‌నినో ప్రభావం జూన్ వరకు ఉంటుందని వాతావరణశాఖ అంచనాలు

అంటే వచ్చే రెండు నెలల పాటు 'వేడి సెగలు' తప్పవంటున్న నిపుణులు

రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 20 జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఏప్రిల్ నుంచి ఎండలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అంచనా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యుల సూచనలు

ఇప్పటికే దేశవ్యాప్తంగా చాలా చోట్ల 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. సాధారణంతో పోలిస్తే 2–3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో వేడి సెగలు రేగుతున్నాయి. గత రెండు నెలలకు సంబంధించి ఈ రాష్ట్రాల్లో అత్యంత లోటు వర్షపాతం కొనసాగుతున్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తీవ్ర వర్షాభావం,

మిగతా 8వ పేజీలో ▶



టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు అరెస్టు

సిట్ అదుపులో రాచకొండ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు

ట్యాపింగ్, బెదిరింపులతో వసూళ్ల కోణంలో విచారణ

టాస్క్‌ఫోర్స్‌కు చెందిన నలుగురిని ప్రశ్నించిన సిట్

పోలీసు కస్టడీకి తిరుపతన్న, భుజంగరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ముఖ్య అనుమానితుడిగా ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) పి.రాధాకిషన్‌రావును సిట్ అధికారులు అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకుని 10 గంటలు విచారించిన తర్వాత ఆయన్ను అరెస్టు చేసినట్లు పంజగుట్ట పోలీసులు తెలిపారు. శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని చెప్పారు. మరోవైపు గతంలో టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఐబీల్లో పని చేసిన రాచకొండ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ బి.గట్టు మల్లును అదుపులోకి తీసుకున్నారు. ట్యాపింగ్‌తో పాటు బలవంతపు వసూళ్లలో వీరి పాత్రపై ఆరా తీస్తున్నారు.

తొలుత డీసీపీగా, తర్వాత ఓఎస్డీగా..

గతంలో ముఖ్యమంత్రి భద్రత విభాగంలో అదనపు ఎస్పీగా పని చేసిన రాధాకిషన్‌రావు నాన్‌–క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొంది, 2017 నవంబర్ 3న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



సభ కొనసాగించాలనుకుంటున్నాం సార్ అందుకే మీ స్పీచ్ తీసేశాం!!

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలి

బీజేపీ నేత కె.లక్ష్మణ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అవినీతి పరులను జైల్లో వేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాటలకే పరిమితం అయ్యారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తాను లీక్ వీరుడు కాదు.. గ్రీక్ వీరుడు అని నిరూపించుకోవాలనుకుంటే ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్యాపింగ్ వ్యవహారంలో సూత్రధారులను కూడా బయటపెట్టాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరపకుండా వెనకేసుకొస్తోందని లక్ష్మణ్ విమర్శించారు. డ్రగ్స్, మియాపూర్ భూ కుంభకోణం, ధరణితో అక్రమాలు.. కొత్తగా ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెర మీదకి వచ్చిందన్నారు. 'పోలీసులేమో నేతలు చెప్తే ఫోన్ ట్యాపింగ్ చేశామని అంటున్నారు.. కేటీఆర్ ఒక్కరిద్దరి ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని మాట్లాడుతున్నారన్నారు. మరి పోలీసులు చట్టాన్ని అతిక్రమిస్తే మీ ప్రభుత్వం గుడ్డి గాడిద పళ్లు తోమిందా?' అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ సంపదను దోచుకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారని.. అయినా సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గట్టి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.



భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా ఖరారైన అనంతరం ఢిల్లీ నుంచి నేరుగా వచ్చి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించండి

బీజేపీ మేనిఫెస్టో కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 5వ తేదీలోగా 17 ఎంపీ సీట్ల పరిధిలో సమావేశాలు నిర్వహించి.. మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని బీజేపీ మేనిఫెస్టో కమిటీ నిర్ణయించింది. జాతీయస్థాయిలో పార్టీ రూపొందించే ఎన్నికల ప్రణాళికలో ఏయే అంశాలు చేర్చాలన్న దానిపై కసరత్తు చేసి 'పీపుల్స్ మేనిఫెస్టో'ను రూపొందించే కృషిని కొనసాగించాలని తీర్మానించింది. రాష్ట్ర పార్టీ మేనిఫెస్టో కమిటీలోని సభ్యులు ఒక్కొక్కరు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, యువత ఇతర వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఏయే అంశాలు పొందుపరిచారు.. ఈసారి కేంద్రప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి ఏయే రూపాల్లో అందించాల్సిన సహాయం, జిల్లాలు, పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా చేయగలిగింది ఏమైనా ఉందా అన్న అంశాలను కూడా గుర్తించాలని తీర్మానించింది. గురువారం పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన మేనిఫెస్టో కమిటీ భేటీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ, కమిటీ సభ్యులు ఎస్.రామచందర్‌రావు, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, ఎస్.కుమార్, వైఎల్.శ్రీనివాస్, కరుణాగోపాల్, కొల్లి మాధవి పాల్గొన్నారు.



రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును గురువారం కలిసిన తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి

బీజేపీలోకి మాజీ ఏడీసీపీ చేరిక

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ అడిషనల్ డీసీపీ అత్తలూరి సుభాష్ చంద్రబోస్ పార్టీలో చేరారు. గురువారం బీజేపీ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కిషన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కారు దిగనున్న కేకే

త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వెల్లడించిన బీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్

- కాంగ్రెస్ పార్టీ నాకు సొంత ఇల్లు లాంటిది.. 53 ఏళ్లు అందులో పనిచేశా
- తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరతారు
- నేను కాంగ్రెస్ పార్టీలోనే చనిపోవాలనుకుంటున్నా



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ నుంచి పలువురు కీలక నేతల నిష్క్రమణలు కొనసాగుతుండగా.. తాజాగా పార్టీ సెక్రెటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు (కేకే) కూడా అదే బాట పట్టారు. 'కాంగ్రెస్ పార్టీ నాకు సొంత ఇల్లు లాంటిది. నేను పుట్టింది, పెరిగింది కాంగ్రెస్‌లోనే. 53 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలోనే పని చేశా. ఆ పార్టీలోనే చనిపోవాలనుకుంటున్నా. తీర్థయాత్రలకు వెళ్లినవారు ఎప్పటికైనా ఇంటికే చేరతారు. 84 ఏళ్ల వయసులో నేను కూడా నా సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరతా..' అని కేకే గురువారం నాడిక్కడ మీడియాకు చెప్పారు. అంతకుముందు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో కేకే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అర్ధాంతరంగా ముగిసినట్లు సమాచారం కాగా..ఆ తర్వాత బంజారాహిల్స్ నివాసంలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

తెలంగాణ కోసం బీఆర్ఎస్‌లో చేరా

'బీఆర్ఎస్‌లో నేను పని చేసింది పదేళ్లు మాత్రమే. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరా. కానీ కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చింది. నేను మొదటి సారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యా. ప్రస్తుతం నేను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదు. నా కూతురు చేరిన రోజే నేను కాంగ్రెస్‌లో చేరబోవడం లేదు. ఏ రోజు చేరేదీ తేదీ ఖరారు అయిన తర్వాత చెబుతా..' అని కేకే చెప్పారు.

నేను బీఆర్ఎస్‌లో ఉండి చేసేదేమీ లేదు

'కేసీఆర్ నాకు చాలా గౌరవం ఇచ్చారు. నాకు కూడా ఆయనపై గౌరవం ఉంది. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బాగా సహకరించారు. కానీ సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో పనిచేశా. పీసీసీ అధ్యక్ష పదవి మొదలుకొని రాజ్యసభ వరకు నాకు కాంగ్రెస్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. ప్రస్తుతం రాజకీయ చరమాంకంలో ఉన్న నేను బీఆర్ఎస్ పార్టీలో ఉండి కూడా చేసేదేమీ లేదు. కేసీఆర్‌కు కూడా ఇదే చెప్పా. బీఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై కూడా ఆయనతో మాట్లాడా. కవిత అరెస్టుతో పాటు పార్టీ అంతర్గత అంశాలపైనా చర్చ జరిగింది. కవితను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని అనుకుంటున్న నా కుమారుడు విప్లవ్ నిర్ణయం మంచిదే..' అని కేశవరావు అన్నారు.

నేను మాత్రం పార్టీ మారను: విప్లవ్‌కుమార్

పార్టీ మారే విషయంలో తన తండ్రి కేశవరావు, సోదరి విజయలక్ష్మి తీసుకునే నిర్ణయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేకే కుమారుడు విప్లవ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరే విషయంపై వారు స్పష్టత ఇచ్చిన తర్వాతే, దానిపై తన అభిప్రాయం వెల్లడిస్తానని చెప్పారు. తాను మాత్రం పార్టీ మారే ప్రసక్తే లేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్‌కు గట్టి మద్దతుదారుడినని, కేసీఆర్ నాయకత్వంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. కేసీఆర్ ప్రభు త్వంలో విప్లవ్‌కుమార్ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేయడం తెలిసిందే.

కేకే నివాసానికి ఇంద్రకరణ్‌రెడ్డి

కేసీఆర్‌తో భేటీ తర్వాత కేకే బంజారాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి కేకేతో భేటీ అయ్యారు. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా ఇంద్రకరణ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డితో పాటు కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఈనెల 30న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

మీ కుటుంబానికి ఏం తక్కువ చేశా?: కేసీఆర్

విశ్వసనీయ సమాచారం మేరకు.. కేసీఆర్‌తో జరిగిన భేటీలో బీఆర్ఎస్‌లో పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలతో కూడిన ఓ నోట్‌ను కేకే అందజేశారు. ఈ సందర్భంగానే కేకేతో పాటు విజయలక్ష్మి పార్టీని వీడుతున్నారనే వార్తలు ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై కేకే వివరణ ఇస్తూ.. రాజకీయంగా ఇదే తన చివరి ప్రయాణం అని, కాంగ్రెస్‌లోనే చనిపోతానని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ యూ ట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో కేకే వెల్లడించిన అభిప్రాయాలపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పదేళ్లు అధికారం, పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారడాన్ని ప్రజలు గమనిస్తారు. మీ ఆలోచన మానుకోండి. మీ కుటుంబానికి పార్టీ తక్కువేమీ చేయలేదు. మీకున్న రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ సెక్రటరీ జనరల్ పదవితో పాటు రెండు పర్యాయాలు రాజ్యసభకు పంపించా. మీ కుమారుడికి కార్పొరేషన్ పదవి ఇచ్చా. మీరు కోరిన మీదటే పార్టీలో ఎంతోమంది నిబద్ధత కలిగిన వారిని పక్కన పెట్టి మరీ మీ కూతురు విజయలక్ష్మికి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పదవి ఇచ్చాం. పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న కీలక సమయంలో పెద్దరికంతో వ్యవహరించాల్సింది పోయి మీడియాలో నాపైనా, పార్టీ నాయకులపైనా విమర్శలు చేయడం సరికాదు..' అంటూ కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరి భేటీ అర్ధంతరంగా ముగిసిందని సమాచారం.

నువ్వా.. నేనా..!

హోరాహోరీగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్.. 99.86 శాతం నమోదు
- క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరిన ప్రజాప్రతినిధులు
- క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హోరాహోరీగా సాగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగియగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య నువ్వా, నేనా అన్నట్లు ఎన్నికల యుద్ధం నడిచింది. అయితే లెక్క ప్రకారం వెయ్యి మందికి పైగా ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు ఉండగా.. భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు పోలింగ్ సరళిని బట్టి రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏపీ, కర్ణాటక, గోవా, కొడైకెనాల్, ఊటీలోని క్యాంపుల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు ప్రత్యేక వాహనాల్లో వచ్చి ఆయా కేంద్రాల్లో ఓటు వేశారు. వీరితోపాటు ఎక్స్‌అఫీషియో హోదాలో ఉమ్మడి పాలమూరులోని 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఓటు వేశారు. ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా.. అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు.

99.86 శాతం పోలింగ్

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. వీరితోపాటు స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ పోటీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 99.86 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా.. 1,437 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, గద్వాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సీఐ భీం కుమార్ మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఎస్పీ గుణశేఖర్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా..

లోక్‌సభ ఎన్నికలకు ముందుగా జరుగుతున్న ఉపఎన్నిక కావడంతో ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. క్యాంపుల్లో భాగంగా ఆయా పార్టీలు పోటాపోటీగా ప్రజాప్రతినిధులకు భారీ ఎత్తున తాయిలాలు ముట్టజెప్పినట్లు సమాచారం. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బీజేపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వంద వరకు ఉన్నారు. వీరు కాంగ్రెస్ అభ్యర్థి వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. మొత్తంగా అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రాధాన్యత ఓట్ల ఆధారంగా విజేతను నిర్ణయించనుండడంతో ఆయా పార్టీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. క్రాస్‌ఓటింగ్ తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జీవితాంతం కొడంగల్‌కు రుణపడి ఉంటా

- నేను ఏ స్థాయిలో ఉన్నా ఈ ప్రాంత బిడ్డనే: సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలో కొడంగల్‌కు సిమెంట్ ఫ్యాక్టరీలు.. నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వెల్లడి
- కొడంగల్‌లో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటేసిన రేవంత్

కోస్గి/కొడంగల్: ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు.. తాను ఏ స్థాయిలో ఉన్నా ఈ ప్రాంతం బిడ్డనేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తన ప్రతి కష్టంలోనూ కొడంగల్ ప్రజలు అండగా నిలిచారని.. వారు తనను గుండెల్లో పెట్టుకొని చూసుకున్నారని పేర్కొన్నారు. కొడంగల్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంతో చెప్పారు. తన కోసం ఎంతో చేసిన ఈ ప్రాంతాన్ని ఎన్ని అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. రేవంత్‌రెడ్డి గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు వేయడానికి కొడంగల్‌కు వచ్చారు. ఎక్స్ అఫీషియో హోదాలో కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఓటు వేశారు. అనంతరం లాహోటీ కాలనీలోని తన నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... త్వరలో కొడంగల్‌కు సిమెంట్ పరిశ్రమలు రానున్నాయన్నారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపురాయి గనులు ఉన్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. 'కొడంగల్‌కు ఫార్మా కంపెనీలు వస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. భూసేకరణకు సహకరిస్తేనే పరిశ్రమలు ఏర్పాటు చేయడం సులభతరం అవుతుంది. భూములు కోల్పోతున్న వారికి న్యాయమైన ధరను ప్రభుత్వం చెల్లిస్తుంది. పట్టా భూములకు ఇచ్చే ధరను అస్సైన్‌మెంట్ భూములకూ ఇస్తాం' అని రేవంత్ పేర్కొన్నారు. ఏప్రిల్ 8న కొడంగల్‌కు మళ్లీ వస్తానన్నారు. కోస్గిలో పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కొడంగల్ మండలం అప్పాయిపల్లికి ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో 50 వేలకు పైగా మెజారిటీ రావాలన్నారు. బూత్, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో సమర శంఖారావం సభకు నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పీఈసీ సమావేశం

లోక్‌సభ ఎన్నికల వ్యూహాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గాంధీభవన్‌లో జరగనుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే ఏప్రిల్ 6న తుక్కుగూడలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే సభను విజయవంతం చేసే అంశంపై కూడా సమావేశంలో చర్చిస్తారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు, పీఈసీ సభ్యులు పాల్గొంటారు.

'జాతీయ మేనిఫెస్టో కమిటీ' ఏర్పాటు

పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా 'ప్రజల ముంగిట్లోకి జాతీయ మేనిఫెస్టో కమిటీ'ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. పార్టీ జాతీయ మేనిఫెస్టో ప్రజల చెంతకు చేరేలా ఏం చేయాలనే దానిపై ఈ కమిటీ 15 రోజుల్లో టీపీసీసీకి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కమిటీలో కన్వీనర్‌గా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పీసీసీ మేధావుల విభాగం చైర్మన్ శ్యాంమోహన్, మాజీ ఎమ్మెల్సీ కమలాకరరావు, ఎస్ఆర్ఐ సెల్ చైర్మన్ బీఎం వినోద్‌కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి మహ్మద్ రియాజ్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి జనక్ ప్రసాద్ ఉన్నట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని మార్చండి

ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం ముందు మాదిగ సంఘాల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని మార్చాలని మాదిగ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం 'చలో ఏఐసీసీ ఆఫీస్' పేరుతో మాదిగ దండోరా, మాదిగ జేఏసీ, మాదిగ శక్తి సంఘాలు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ముందు నిరసన తెలిపాయి. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఐసీసీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల నేతలు మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని మార్చి గజ్జెల కాంతంకు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని పిడమర్తి రవికి కేటాయించాలన్నారు. అలాగే వరంగల్ ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 18 లక్షలున్న మాలలకు ఎక్కువ సీట్లు ఇచ్చారని, 80 లక్షల మంది మాదిగలు ఉన్నా సీట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఊట్ల వరప్రసాద్, సన్ని, రాపోలు రాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'చెంగిచెర్ల' కారకులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

సాక్షి, హైదరాబాద్: చెంగిచెర్లలో గిరిజన మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. త్వరలోనే బీజేపీ శాసనసభాపక్షం తరపున బాధితులను పరామర్శిస్తామని తెలిపారు. హోలీ సందర్భంగా ఓ వర్గం వారిపై మూక దాడికి పాల్పడటం హేయ మైన చర్య అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితుల పరామర్శకు వెళ్లిన బీజేపీ ఎంపీ బండి సంజయ్, ఇతరులపై కేసులు పెట్టడం సరైంది కాదని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అక్కడకు వెళ్లకుండా గృహ నిర్బంధం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు.. బాధితులపై తిరిగి కేసులు పెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

పోటీ నుంచి తప్పుకుంటున్నా

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కడియం కావ్య లేఖ



కడియం కావ్య విడుదల చేసిన లేఖ

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్‌లో బీఆర్ఎస్ గట్టి షాక్ తగిలింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె, బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు ఆమె పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు గురువారం రాత్రి లేఖ రాశారు. పార్టీపై వచ్చిన అవినీతి, భూ కబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లోనే పోటీనుంచి విరమించుకుంటున్నానని తెలిపారు. కేసీఆర్, బీఆర్ఎస్ కార్యకర్తలు తనను మన్నించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లోకి కడియం శ్రీహరి, కావ్య?

కడియం శ్రీహరి, కడియం కావ్యలు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే కావ్య బీఆర్ఎస్ అభ్యర్థిగా తప్పుకున్నారని అంటున్నారు. ఇందుకోసమే ఇప్పటివరకు కాంగ్రెస్ కూడా తన అభ్యర్థిని ప్రకటించలేదని చెబుతున్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేయనున్న తండ్రీకూతుళ్లు ఈ నెల 30న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కడియం శ్రీహరి బరిలోకి దిగే అవకాశం ఉందని, కానిపక్షంలో కావ్య కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తారని అంటున్నారు. ఒకవేళ కడియం శ్రీహరిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటిస్తే... ఆయన ఎంపీగా గెలిచిన అనంతరం కావ్యను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ బరిలోకి దింపవచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఈ హామీల మేరకే శ్రీహరి, కావ్యలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పాలనే నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత కోసం శ్రీహరి, కావ్యలను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు. కావ్య ఎపిసోడ్‌లో ప్రభుత్వ సలహాదారు, కడియం శ్రీహరికి చిరకాల మిత్రుడు వేం నరేందర్‌రెడ్డి చక్రం తిప్పారన్న ప్రచారం కూడా జరుగుతోంది.



గురువారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు దంపతులు

ఏ పార్టీ ఉండకూడదన్నదే మోదీ కుట్ర

బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

సాక్షి, హైదరాబాద్: దేశంలో బీజేపీ మినహా ఇతర పార్టీలేవీ ఉండకూడదనే లక్ష్యంతో కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఏమీ చేయలేదనే అంశం లోక్‌సభ ఎన్నికల ప్రచార అంశంగా ఉండకూడదని భావిస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేసిన ఈడీ... కేరళ సీఎం విజయన్ కుమార్తెపైనా కేసు పెట్టిందని చెప్పారు. విపక్ష నేతలకు నోటీసులిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ బెదిరింపులకు లొంగి ఆ పార్టీలో చేరే వారిపై ఎలాంటి అరెస్టులు లేవని, లొంగకుండా పోరాటం చేస్తున్న వారిపైనే వేధింపులు, దాడులు, కేసుల నమోదు జరుగుతోందన్నారు. 400కు పైగా స్థానాల్లో గెలుస్తామంటున్న ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేతలను ఎందుకు జైల్లో పెడుతున్నారని క్రిశాంక్ ప్రశ్నించారు.

ఎన్ఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనులేఖ బూస



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ ఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణకు చెందిన అనులేఖ బూస నియమితులయ్యారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యవర్గం పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 8 మంది నూతన జాతీయ ప్రధాన కార్యదర్శులు, 48 మంది కార్యదర్శుల నియామకానికి ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కాగా నూతనంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అనులేఖ బూస గతంలో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌చార్జిగా పనిచేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలోనూ పూర్తిగా పాల్గొన్నారు.

ఎక్కే విమానం.. దిగే విమానం అంటూ.. ఢిల్లీకి జాతరలు

- రైతులను పట్టించుకోలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ధ్వజం
- మంత్రులు పొలాల దిక్కు చూడలేదు
- 15–20 లక్షల ఎకరాలు ఎండాయి
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సారంపల్లిలో ఎండిన పొలాలను పరిశీలించిన కేటీఆర్



సారంపల్లిలో కౌలు రైతు పర్శరాములుతో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు, నాలుగు నెలలుగా ఎక్కే విమానం.. దిగే విమానం అంటూ.. ఢిల్లీకి జాతరలు.. యాత్రలు చేస్తున్నాడే తప్ప రైతుల బాధలు చూడట్లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం ఆయన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో నీరు లేక ఎండిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 15 లక్షల నుంచి 20 లక్షల పొలాలు నీరు లేక ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే.. సీఎం కానీ, మంత్రులు కానీ పొలాల దిక్కు చూసిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలతో కాళేశ్వరంపై, కేసీఆర్‌పై కడుపు మంటతో మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేరు చేయకుండా.. కాఫర్ డ్యామ్ నిర్మించకుండా పొలాలను ఎండబెట్టారని ఆరోపించారు. గతంలో గోదావరి నీళ్లను ఎత్తిపోసి కాల్వల ద్వారా చెరువులు నింపి పొలాలు ఎండిపోకుండా కేసీఆర్ చూసుకున్నారని గుర్తు చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని అన్నారు. సారంపల్లిలో పొలాలను చూస్తుంటే.. మేతకు తప్ప కోతకు పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు రైతులకు లీగల్ నోటీసులు ఇచ్చి అప్పులు కడతారా.. చస్తారా.. అన్నట్లుగా వేధిస్తున్నారని ఆరోపించారు.

కాంట్రాక్టర్ల ఖజానా నింపుతున్నారు

యాసంగి సీజన్‌లో రైతుబంధుకు రూ.7వేల కోట్లు సిద్ధం చేస్తే.. రైతులకు ఇవ్వకుండా ఆ నిధులను కాంట్రాక్టర్లకు ఇస్తూ వాళ్ల ఖజానా నింపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రయోజనాల కోసం రైతులను గోసపెడుతోందన్నారు. రాష్ట్రంలో 200 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, రైతుల పరిస్థితి చూస్తుంటే జాలి వేస్తోందన్నారు. రూ.2లక్షల రుణం మాఫీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అడ్డుకాకుండా ఈసీకి లేఖ రాసి రుణమాఫీని ప్రకటించాలన్నారు. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని, పంటలు ఎండిన రైతులను, కౌలు రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు ఇచ్చిందని, ఇప్పుడు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల్లో ధైర్యం నింపి వారికి భరోసా ఇచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎండిన పొలాలను సందర్శించాలని కేసీఆర్ నిర్ణయించారని వివరించారు. నిరుడు చెరువుల్లోకి కాల్వనీరు వచ్చి పొలం పారిందని, ఈసారి పది ఎకరాల్లో వరి వేస్తే మొత్తం ఎండిపోయిందని కేటీఆర్‌కు పర్శరాములు అనే కౌలు రైతు చెప్పారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పాల్గొన్నారు.

31న జరగాల్సిన జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పరీక్షలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 31న జరగాల్సిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ను రద్దు చేసినట్టు సంస్థ సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ ప్రకటించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున పరీక్ష నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి కోరారు. ఎన్నికల సంఘం నుంచి ఇంకా స్పందన రాకపోవడంతో పరీక్షను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎత్తి వేసిన తర్వాత పరీక్షల నిర్వహణకు కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తామని రిజ్వీ తెలిపారు.

ఏప్రిల్ 4 నుంచి జేఈఈ మెయిన్స్‌-2



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్‌-2) తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. పేపర్‌-1 (బీఈ, బీటెక్) ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పేపర్‌-2 (బీఆర్క్, బీప్లానింగ్)ను ఏప్రిల్ 12న నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మళ్లీ రెండో పరీక్ష సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ ఉంటుందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 319 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది.

కేసీఆర్ హయాంలోనే నష్టాల్లోకి సింగరేణి

ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ హయాంలోనే సింగరేణి సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని, రూ.18 వేల కోట్ల సింగరేణి డబ్బును ఉపయోగించుకున్నారని ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు జనక్ ప్రసాద్ ఆరోపించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం సింగరేణిలో 20 వేల ఉద్యోగాలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయలేదని, కార్మికులకు జీతాలు పెంచలేదని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఎన్నికల ముందు సింగరేణిలో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కార్మికుల జీతాలు పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆయన తాను సృష్టించిన ప్రతి దానిని ఉత్తమరీతిలో చేశాడు.
మరియు మానవ సృష్టిని మట్టితో ప్రారంభించాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 29 మార్చి 2024

మంచు ఎడారిలో నిరసన మంట

ఆమిర్‌ఖాన్ '3 ఇడియట్స్' సినిమా చాలామందికి తెలుసు. కానీ, అందులో ఆమిర్ పోషించిన ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రకు స్ఫూర్తినిచ్చిన ఇంజనీర్, విద్యాసంస్కరణవేత్త సోనమ్ వాంగ్‌ఛుక్ గురించి బహుశా కొందరికే తెలుసుంటుంది. ఇటీవల చేసిన నిరవధిక నిరాహార దీక్ష పుణ్యమా అని ఆయన పేరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లోకెక్కింది. ప్రపంచమంతటా మారుమోగిపోయింది. హిమాలయ ప్రాంతంలోని లద్దాఖ్‌లో శరీరం గడ్డకట్టే మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆయన సాగించిన నిరశన ఉద్యమానికి మద్దతుగా వేలాది జనం ముందుకు రావడం విశేషం. 21 రోజుల అనంతరం మంగళవారం ఆయన నిరాహార దీక్ష ముగిసినప్పటికీ, లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి నుంచి అలవిమీరిన అభివృద్ధితో అపాయంలో పడుతున్న ఆ ప్రాంత జీవావరణం దాకా అనేక అంశాలు చర్చలోకి రాగలిగాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేకున్నా, ప్రస్తుతానికైతే లద్దాఖ్ ప్రజలు తమ డిమాండ్లను పాలకుల ముందు మరోసారి ఉంచి, ఒత్తిడి తేగలిగారు.

నిజానికి, దాదాపు 3 లక్షల జనాభా గల లద్దాఖ్‌లో మొత్తం 8 తెగల వాళ్ళుంటారు. 2019 ఆగస్ట్ 5న మునుపటి జమ్మూ – కశ్మీర్ నుంచి విడదీసి, కేంద్రపాలిత ప్రాంతం చేశారు. భారత ఈశాన్య సరిహద్దు కొసన ఉండే ఈ ప్రాంత ప్రజలు లద్దాఖ్‌కు పూర్తి రాష్ట్రప్రతిపత్తి ఇవ్వాలనీ, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనీ, స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రత్యేకంగా ఓ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలనీ, తమ ప్రాంతానికి ఇద్దరు ఎంపీలు ఉండాలనీ డిమాండ్ చేస్తున్నారు. 2020 నుంచి వారు చేస్తున్న నిరసనలకు పరాకాష్ఠ – తాజా ఉద్యమం. లద్దాఖ్ ప్రాంతపు ఉన్నత ప్రాతినిధ్య సంస్థ, అలాగే కార్గిల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్' (కేడీయే) మద్దతుతో నెలన్నర క్రితమే ఫిబ్రవరి మొదట్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో కూర్చొని లద్దాఖ్‌ను ఆడించాలనుకుంటే కుదరదంటూ ప్రజల్లోని అసమ్మతిని ఆ ప్రదర్శన తేటతెల్లం చేసింది. కీలకమైన విధాన నిర్ణయాలలో తమ స్థానిక స్వరాలకు చోటులేకపోవడమే ఈ నిరసనలకు ప్రధాన ప్రేరకమైంది.

ఒకప్పుడు నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జమ్మూ-కశ్మీర్ విధాన పరిషత్‌కు స్పీకర్, ఎంపీ... ఇంతమంది ప్రజా ప్రతినిధులు ఆ ప్రాంతానికి ఉండేవారు. అలాంటిది ప్రస్తుతం అక్కడంతా లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలోని ప్రభుత్వ అధికార గణపాలన. లద్దాఖ్‌కు మిగిలింది ఇప్పుడు పోర్ట్‌ఫోలియో లేని ఒకే ఒక్క ఎంపీ. జిల్లాకు ఒకటి వంతున రెండు స్వతంత్ర పర్వత ప్రాంత అభివృద్ధి మండళ్ళు ఉన్నప్పటికీ, అధికారాల పంపిణీపై స్పష్టత లేదు. ఇక, ఆర్టికల్ 370 రద్దు అనంతరం తీసుకున్న ప్రశ్నార్థమైన పాలనాపరమైన నిర్ణయాలు అనేకం. దానికి తోడు ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో జనం గగ్గోలు పెడుతున్నారు. భూ హక్కులలో మార్పులు, అలాగే స్థానిక ప్రయోజనాలకు విరుద్ధమైన పారిశ్రామిక విధాన రూపకల్పన లాంటివి ప్రజాగ్రహాన్ని పెంచాయి. లద్దాఖీ ఉద్యమకారుడు వాంగ్‌ఛుక్ దీక్షకు అంతటి స్పందన రావడానికి అదే కారణం.

సముద్ర మట్టానికి ఎంతో ఎత్తున దాదాపు మంచు ఎడారిలా జనావాసాలు తక్కువగా ఉండే లద్దాఖ్ పర్యావరణ రీత్యా సున్నిత ప్రాంతం. అక్కడ అభివృద్ధి పేరిట ప్రభుత్వం చేపట్టిన అజెండా పైనా విమర్శలున్నాయి. పర్యాటకం ఆ ప్రాంత ఆర్థికవ్యవస్థలో కీలకమే కానీ, దాన్ని అంతకు అంత పెంచాలని పర్యావరణానికి హాని కలిగిస్తే మొదటికే మోసం. లే ప్రాంతంలో మెగా ఎయిర్‌పోర్ట్, ఛంగ్‌థాంగ్ బయళ్ళలో 20 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సోలార్ పార్క్ లాంటి ప్రణాళికలపై ప్రభుత్వం పునరాలోచించాలని వాంగ్‌ఛుక్ లాంటివారు కోరుతున్నది అందుకే. పర్యావరణానికీ, స్థానికుల ప్రయోజనాలకూ అనుగుణంగానే అభివృద్ధి ఉంటే మేలు. లద్దాఖ్ సాంఘిక, సాంస్కృతిక ప్రత్యేకతల్ని పరిరక్షించేలా ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌నూ పాలకులు గుర్తించాలి. లద్దాఖ్, కార్గిల్‌లు రెండూ ఒక కేంద్రపాలిత ప్రాంతంగా, ఒకే ఎంపీ ప్రాతినిధ్యానికి తగ్గిపోవడమూ చిక్కే. ఈ రెండు విభిన్న ప్రాంతాలకు చెరొక పార్లమెంటరీ స్థానంపై ఆలోచించాలి.

చైనాతో సరిహద్దులో నెలకొన్న లద్దాఖ్ కీలకమైనది. అందులోనూ హిమాలయ ప్రాంతంలో తన పరిధిని విస్తరించుకోవాలని డ్రాగన్ తహతహలాడుతున్న వేళ వ్యూహాత్మకంగానూ విలువైనది. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకొనే భయాలున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం మరింత జాగరూకతతో వ్యవహరించాలి. లద్దాఖ్ ప్రజల నమ్మకాన్ని చూరగొని, వారిని కలుపుకొని ముందుకు సాగడం ముఖ్యం. గతంలో శ్రీనగర్ నుంచి, ఇప్పుడేమో ఢిల్లీ నుంచి పాలిస్తున్నారే తప్ప స్వపరిపాలన సాగనివ్వడం లేదనే భావనను వారి నుంచి పోగొట్టడం ముఖ్యం.

ఈ ఏడాది జనవరి మొదట్లో కేంద్ర హోమ్ శాఖ ఉన్నతాధికార సంఘాన్ని (హెచ్‌పీసీ) వేసింది. గత శనివారంతో కలిపి 3 భేటీలు జరిగినా పురోగతి లేదు. హెచ్‌పీసీ హోమ్ మంత్రి లేకపోగా, తాజా భేటీకి సహాయ మంత్రి సైతం గైర్హాజరు కావడంతో సమస్యలు పరిష్కరించేందుకు సర్కారు వారికి చిత్తశుద్ధి ఉందా అన్నది అనుమానాలు రేపుతోంది. గత నాలుగేళ్ళుగా ప్రభుత్వ పాలనలోని పలు వైఫల్యాలను సహించి, భరించిన లద్దాఖ్ ప్రజలు గాంధేయ మార్గంలో శాంతియుతంగా తమ నిరసన తెలిపారు. స్థానిక ఆకాంక్షలకు తగ్గట్టు న్యాయబద్ధమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ఢిల్లీ పాలకులు సైతం ప్రజాభీష్టాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవడం మేలు. లద్దాఖ్ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని మాటల్లోనే కాదు... చేతల్లోనూ చూపడం అవసరం. లేదంటే, మున్ముందు వాంగ్‌ఛుక్ దీక్షల లాంటివి మరిన్ని తలెత్తక తప్పదు.

లోక కల్యాణమే హితంగా...



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

రామకృష్ణ మిషన్ అధ్యక్షులు, అత్యంత సీనియర్ సాధువు అయిన స్వామి స్మరణానంద తన 94వ యేట మార్చ్ 26న పరమపదించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. సంపూర్ణ జీవితం గడిపిన స్మరణానంద... రామకృష్ణ పరమహంస, శారదామాత, స్వామి వివేకానంద ఆలోచనల వ్యాప్తికి తమ జీవితాన్ని అంకితం చేశారు. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహను పెంచుతూనే... విద్యాభివృద్ధికీ, గ్రామీణాభివృద్ధికీ రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని ఎందరో సాధువులు ఆశీర్వదించారు. 'ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ' అనే సిద్ధాంతానికి స్వామి స్మరణానంద జీవితం చెరగని ఉదాహరణ.

లోక్ సభ ఎన్నికల ఘన పండుగ హడావిడిలో ఓ వార్త మనసులో కొన్ని క్షణాల పాటు అలజడిని సృష్టించింది. భారత దేశ ఆధ్యాత్మిక చింతనలో అగ్రగణ్యులైన శ్రీమత్ స్వామి స్మరణానంద జీ మహారాజ్ గతించడం (మార్చ్ 26) వ్యక్తిగత నష్టం లాంటిది. కొన్ని సంవత్సరాల క్రితం, స్వామి ఆత్మస్థానంద జీ మరణం, ఇప్పుడు స్వామి స్మరణానంద శాశ్వతంగా నిష్క్రమించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. కోట్లాది మంది భక్తులు, సాధువులు, రామకృష్ణ మఠం, మిషన్ అనుచరుల మాదిరిగానే నా హృదయం కూడా బాధగా ఉంది.

ఈ నెల ప్రారంభంలో బెంగాల్ పర్యటనకు వెళ్లినప్పుడు స్వామి స్మరణానంద జీ ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఆస్పత్రికి వెళ్లాను. స్వామి ఆత్మస్థానంద జీ మాదిరిగానే, స్వామి స్మరణానంద జీ... ఆచార్య రామకృష్ణ పరమహంస, మాతా శారద మరియు స్వామి వివేకానంద ఆలోచనల ప్రపంచవ్యాప్తికి తమ జీవితాన్ని అంకితం చేశారు. ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఆయనతో జరిపిన సమావేశాలు, ఆయనతో నా సంభాషణలు, ఆ జ్ఞాపకాలు నా మదిలో సజీవంగా కదలాడుతున్నాయి.

2020 జనవరిలో బేలూరు మఠంలో ఉన్న సమయంలో స్వామి వివేకానంద గదిలో కూర్చొని ధ్యానం చేశాను. ఆ పర్యటనలో నేను స్వామి స్మరణానందతో స్వామి ఆత్మస్థానంద గురించి చాలాసేపు మాట్లాడాను.

రామకృష్ణ మిషన్‌తో, బేలూరు మఠంతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు! ఒక ఆధ్యాత్మిక సాధకుడిగా, గత ఐదు దశాబ్దాలుగా నేను వివిధ సాధువులను, మహాత్ములను కలిశాను, అనేక ప్రదేశాలకు వెళ్ళాను. రామకృష్ణ మఠంలో కూడా ఆధ్యాత్మికతకు తమ జీవితాలను అంకితం చేసిన సాధువులతో నాకు పరిచయం ఏర్పడింది. వారిలో స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ప్రముఖులు ఉన్నారు. వారి పవిత్రమైన ఆలోచనలు, జ్ఞానం నా మనస్సుకు నిరంతర సంతృప్తినిచ్చాయి. జీవితంలో అత్యంత ముఖ్యమైన కాలంలో, అటువంటి సాధువులు నాకు 'ప్రజా సేవయే దేవుని సేవ' అనే నిజమైన సూత్రాన్ని బోధించారు.



స్వామి స్మరణానందతో నరేంద్ర మోదీ

'ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ' (స్వీయ విముక్తి కోసం మరియు లోక కల్యాణం కోసం) అనే రామకృష్ణ మిషన్ సిద్ధాంతానికి స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద జీవితాలు చెరగని ఉదాహరణ.

విద్యాభివృద్ధికీ, గ్రామీణాభివృద్ధికీ రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహ, విద్యా సాధికారత, మానవతా సేవ సంకల్పానికి రామకృష్ణ మిషన్ పని చేస్తోంది. 1978లో బెంగాల్‌ను వరదలు ముంచెత్తినప్పుడు రామకృష్ణ మిషన్ తన నిస్వార్థ సేవతో అందరి హృదయాలను గెలుచుకుంది. 2001లో కచ్ భూకంపం వచ్చినప్పుడు విపత్తు

నివాళి నిర్వహణకు రామకృష్ణ మిషన్ అన్ని విధాలుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని నాకు ఫోన్ చేసి చెప్పిన మొదటి వ్యక్తుల్లో స్వామి ఆత్మస్థానంద ఒకరు. ఆయన సూచనల మేరకు రామకృష్ణ మిషన్ భూకంప విపత్కర సమయంలో ప్రజలకు ఎంతో సాయం చేసింది.

కొన్నేళ్లుగా స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వివిధ పదవుల్లో ఉంటూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారు. ఆధునిక విద్య, నైపుణ్యం, మహిళా సాధికారత పట్ల ఇలాంటి మహానుభావులు ఎంత గంభీరంగా ఉండేవారో వీరి జీవితాలు తెలిసిన వారికి తప్పకుండా గుర్తుండే ఉంటుంది.

స్వామి ఆత్మస్థానందజీ మహోన్నత వ్యక్తిత్వంలోని ప్రత్యేకత నన్ను బాగా ఆకట్టుకుంది. ప్రతి సంస్కృతి, ప్రతి సంప్రదాయం పట్ల ఆయనకున్న గౌరవం, ప్రేమ దీనికి కారణం. ఆయన భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో చాలాకాలం గడిపారు. నిరంతరం ప్రయాణించేవారు. గుజరాత్‌లో ఉంటూ గుజరాతీ మాట్లాడటం నేర్చుకున్నారు. నాతో కూడా ఆయన గుజరాతీలోనే మాట్లాడేవారు. ఆయన గుజరాతీ మాట్లాడుతుంటే వినడం నాకు బాగుండేది.

భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ఎందరో సాధువులు ఆశీర్వదించారు. వారు సామాజిక మార్పు గురించి మనకు కొత్త చైతన్యాన్ని అందించారు. సమాజ శ్రేయస్సు కోసం కలసికట్టుగా పనిచేయాలని ఈ సాధువులు మనకు దీక్షను అందించారు. ఈ సూత్రాలు ఎప్పటికీ శాశ్వతమైనవి. రాబోయే కాలంలో ఈ ఆలోచనలు అభివృద్ధి చెందిన భారతదేశానికి, అమృత్ కాలానికి సంకల్పశక్తిగా మారతాయి.

అలాంటి మహనీయులకు యావత్ దేశం తరఫున మరోసారి నివాళులర్పిస్తున్నాను. రామకృష్ణ మిషన్‌తో సంబంధం ఉన్నవారంతా ఆయన చూపిన మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారనే నమ్మకం ఉంది.

ఓం శాంతి.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త సమస్య



ఇండియాలోని యువ విద్యావంతులకు కొత్త ఆందోళన. సెకండరీ, అంతకంటే ఎక్కువ చదువున్న వాళ్లలో నిరుద్యోగం 35.2 శాతం (2000) నుంచి 65.7 శాతానికి (2022) పెరిగింది. సాధారణ మానవులు దీన్ని గమనిస్తున్నారనుకుంటాను.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఉండకూడదా?



విస్తృత, వైవిధ్యమైన సమాజంలాంటి మన దేశంలో ప్రధాని పదవీకాలం మీద కచ్చితంగా పదేళ్ల పరిమితి ఉండాలి. ప్రజాస్వామ్య సంస్థలను పెంచడం, కాపాడటానికి ఇది మంచి మార్గం. హేతుబద్ధమే కదా?

– ఎం.కె. వేణు, సంపాదకుడు

అందుకు ముఖ్యం



ఫ్రెండ్స్, దీన్ని స్పష్టంగా చెప్పనివ్వండి: మ్యాడ్రిడ్, న్యూయార్క్, పారిస్, లండన్ నగరాల్లోని రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదులు ఈ యుద్ధాన్ని గమనిస్తున్నారు. ఒకవేళ హమాస్ మీద విజయం సాధించడంలో ఇజ్రాయెల్‌ను అడ్డుకుంటే, అది వాళ్లందరికీ ప్రేరణ కలిగిస్తుంది. మనం హమాస్‌ను నిర్వీర్యం చేయగలిగితేనే, భయోత్పాతం కలిగించాలన్న వాళ్ల ఆశలను ధ్వంసం చేయగలుగుతాం. మీరు సురక్షితంగా ఉంటారు.

– అయాన్ హిర్సీ అలీ, మానవ హక్కుల కార్యకర్త

ఎవరు చెబుతారు?



ఎర్ర సముద్రంలో చైనీస్ చమురు ట్యాంకర్‌ను హౌతీలు ఢీకొట్టారు. చైనీస్, రష్యన్ నౌకల మీద తాము దాడి చేయమని వాళ్లు ఇంతకుముందు చెప్పినప్పటికీ ఎం.వి.హువాంగ్ మీద ఈ దాడి జరిగింది. హౌతీల తరఫున చైనీయులకు ఇరాన్ క్షమాపణ చెబుతుందా?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

వెనక్కి తగ్గవు



ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయడం గురించి జర్మనీ, యూఎస్ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో నా ఆలోచన: గుర్పత్‌వంత్ సింగ్ పన్నూ కేసులో లాగానే, యూఎస్ తన వైఖరిలో వెనక్కి తగ్గదు. నేను అనుకున్నట్టుగానే అవి పునరుద్ఘాటించాయి కూడా. 'ప్రజాస్వామ్యాలకు తల్లి' అని చెప్పుకొంటూ, సవతి తల్లిలా ఇండియా ప్రవర్తించకూడదు.

– కె.సి. సింగ్, మాజీ దౌత్యవేత్త

అసలైన భారత్



నేనొక ప్రసిద్ధ అమెరికా చరిత్రకారుడితో మాట్లాడుతున్నాను. గత దశాబ్దాల గురించి ఆయన ఏం చెప్పారంటే: 1947 తర్వాత విద్యారంగం వలసవాదుల నియంత్రణలో ఉంది. వినోద రంగం నెమ్మదిగా నేర మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయింది. జర్నలిజంలో కమ్యూనిస్టుల ఆధిపత్యం కొనసాగింది. భారత్ ఇప్పుడే మేలుకుంటోంది; పరిస్థితులు అందరికీ సానుకూలంగా మారుతాయి.

– సుభాష్ కాక్, రచయిత

ఎందుకో చెప్పరా?



భారత ఆర్థిక వ్యవస్థ 2023–24లో దృఢంగా ఉందని బీజేపీ చెబుతోంది. కానీ ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు)ల రాక 31 శాతం ఎందుకు తగ్గిందో మాత్రం వివరణ లేదు. ఒక దేశం మీద, అక్కడి ప్రభుత్వం, రాజకీయాల మీద విదేశీ ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకానికి ఎఫ్‌డీఐలు ఒక కొలమానం. కానీ అలాంటి నమ్మకం తగ్గింది.

– పి. చిదంబరం, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి

ఇన్ బాక్స్

విడదీయరాని బంధం

మన ప్రధాన మంత్రికి ఇటీవల ఓ విదేశీ అత్యున్నత పురస్కారం రావడం ముదావహం. భారత్‌లో 'భారత రత్న' ఎంత అత్యున్నతమైనదో 'ఆర్డర్ ఆఫ్ ది డ్రుక్ గ్యాల్పో' భూటాన్‌లో అంత అత్యున్నత పౌర పురస్కారం. దక్షిణ ఆసియాలో భూటాన్‌కు పెద్ద దిక్కు భారత్. ఎన్నో సహాయ సహకారాలు అందిస్తూ వుంది. కోవిడ్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన దేశాలలో భూటాన్ ఒకటి. అటువంటి విపత్కర సమయంలో భారత్ చేయూత అందించింది. దాదాపు ఐదు లక్షల కోవిడ్ వ్యాక్సిన్‌లు అందించి పెద్ద మనసు చాటుకుంది. మొత్తం మీద 'భారత్–భూటాన్ సంబంధాల అభివృద్ధికి చేసిన కృషికీ, భూటాన్ దేశానికీ, ఆ దేశ ప్రజలకూ చేసిన అపూర్వ సేవకు ప్రధాని మోదీకి ఈ జీవన సాఫల్య పురస్కారం ఇస్తున్నట్లు' ఆ దేశం పేర్కొంది. రాజు జిగ్మె ఖేసర్ నాంగ్యేల్ వాంగ్ చుక్ చేతుల మీదుగా అందుకున్న ఈ అవార్డును ప్రధాని మోదీ 140 కోట్ల భారతీయులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక విదేశీయునికి భూటాన్ ఈ పురస్కారం అందించడం ఇదే మొదటి సారి కావడం గమనార్హం.


భూటాన్ రాజు మాట్లాడుతూ, రెండు దేశాలు భేషజాలు లేకుండా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలోనే వ్యవసాయం, పర్యావరణం, పర్యాటక రంగాలలో కొన్ని ఒప్పందాలు ఇరు దేశాల మధ్య కుదిరాయి. వీటి అమలు ద్వారా రెండు దేశాలూ ప్రయోజనం పొందుతాయి. భారత్ సహకారం ఉన్నంత వరకు భూటాన్‌కు వచ్చిన ముప్పేమి ఉండదు. భూటాన్‌లో భారత్ నిధులతో ఓ ఆసుపత్రి నిర్మించడం ఆనందదాయకం.

భూటాన్ పర్యటనకు రావడం ఇది మూడవసారి, భూటాన్‌లో శక్తిమంతమైన బౌద్ధ మఠం సందర్శన కొత్త అనుభూతిని ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. భూటాన్ రాజు 'భారత్ మాకు పెద్దన్న' అని కొనియాడారు. 'భారత్‌లో ప్రభుత్వాలు మారినా భారత్ మాకు ఎప్పుడూ అండగానే ఉంటుంది. భారత్‌ను మేము ప్రేమిస్తాం' అని పేర్కొనడం ఇరు దేశాల మధ్య ఎటువంటి దౌత్య బంధం ఉందో అర్థం చేసుకోవచ్చు. అవి పటిష్ఠం అని రెండు దేశాలకూ తెలుసు.

– కనుమ ఎల్లారెడ్డి, ఆస్టిన్, అమెరికా

ప్రజా పంపిణీని బలోపేతం చేయాలి!

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలను ఆదుకొనేందుకు చౌక ధరలకు ఆహార ఉత్పత్తులు అందించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ ఏర్పడింది. అయినా ఆహార పదార్థాలు అందక పేదలు ఆకలితో అహాకారాలు చేస్తూనే ఉన్నారు.

ఇప్పటికీ 30 శాతం దాకా దేశంలో పేదరికం ఉంది. దేశం బ్రిటిష్ వలస పాలనలో ఉన్నప్పుడు వచ్చిన రెండవ ప్రపంచ యుద్ధం వలన ఆహార ధాన్యాల కొరత తీవ్రమయ్యింది. దీంతో 'ఆహార రేషన్' ప్రవేశ పెట్టారు. అధికార మార్పిడి తర్వాత కూడా పేదరికంతో పాటు తీవ్రమైన ఆహార కొరత ఏర్పడింది. 1960లో పేద, మధ్య తరగతి ప్రజల కోసం దేశ వ్యాపితంగా 50 వేల రేషన్ షాపులను ఏర్పాటు చేశారు. అవి 1990–91 నాటికి 3 లక్షల 50 వేలకు పెరిగాయి.



1997లో ప్రజాపంపిణీ వ్యవస్థ అధికారికంగా మార్చబడింది. కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు (బీపీఎల్), ఎగువన ఉన్నవారు అని రెండు వర్గాలుగా విభజించారు. 2000 సంవత్సరంలో 'అంత్యోదయ' పథకం వచ్చింది. దీన్ని కోటి నుంచి రెండు కోట్ల కుటుంబాలకు వర్తింప చేసినట్లు పాలకులు ప్రకటించారు. కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం లేదా గోధుమలు ప్రకటించారు.

2002లో ఆస్తులు, వృత్తి, భూ యాజమాన్యం మొదలైన 13 అంశాల పరిమితులపై బీపీఎల్ కుటుంబాలను నిర్ణయించడానికి ప్రాతిపదికలుగా తీసుకున్నారు. కుటుంబంలో ఉన్న ప్రతి వ్యక్తికి ఐదు కిలోల బియ్యం లేదా గోధుమలు రేషన్‌గా నిర్ణయించారు. అయితే అంతకు ముందు 1992–93 సర్వేలో బీపీఎల్‌లో ఉన్న కుటుంబాల సంఖ్య కన్నా 2002లో తక్కువ గుర్తించబడ్డాయి. 2004–05 నాటికి 34 శాతం కుటుంబాలు మాత్రమే బీపీఎల్, ఏఏవై కార్డులు కలిగి ఉన్నారు. అత్యంత సంపన్నులైన కుటుంబాల్లో 20 నుండి 25 శాతం వరకు రేషన్ కార్డులు కలిగి ఉన్నారంటే కార్డుల జారీలో అవినీతి ఎలా ఉందో వెల్లడైంది. నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ అంచనా ప్రకారం 2020 నాటికి బీపీఎల్‌కు అర్హత ఉన్న కుటుంబాల్లో 59 శాతం మాత్రమే రేషన్ కార్డులు పొందగలిగారు.

కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి – నిల్వ, పంపిణీ కార్యకలాపాల్లో కలిగే నష్టాన్ని రీయింబర్స్‌మెంట్‌గా ఆహార సబ్సిడీ ఇస్తున్నది. మోదీ ప్రభుత్వ కేంద్ర బడ్జెట్ కోతల కారణంగా, ఎఫ్‌సీఐకి ఇస్తున్న నిధులు చాలా తగ్గిపోయాయి. ఎఫ్‌సీఐకి కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవటం వల్ల దాని కార్యక్రమాలకు ఆర్థిక సమస్యలు ప్రతిబంధకాలయ్యాయి. బకాయిలు చెల్లించని కేంద్రం, ప్రజలు దాచుకున్న నేషనల్ స్మాల్ సేవింగ్ ఫండ్ నుండి రుణాలు అందించింది. 2019–20 మధ్య 2,54,600 కోట్ల విలువైన ఎన్‌ఎస్‌ఎస్‌ఎఫ్ రుణాలు ఎఫ్‌సీఐ వద్ద ఉన్నాయంటే ప్రజల సొమ్ము ఎలా మళ్ళించ బడిందో అర్థమౌతుంది.

ఆహార ధాన్యాలు ప్రత్యక్ష కొనుగోలు నుంచి ఎఫ్‌సీఐని తొలగించిన మోదీ ప్రభుత్వం, కేంద్ర ప్రజా పంపిణీకి అవసరమై ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అందించే బాధ్యత మిల్లర్లపై పెట్టింది. రాష్ట్రాల అవసరాలకు ధాన్య సేకరణ రాష్ట్ర ప్రభుత్వాలే సేకరించుకోవాలని, కేంద్రం సేకరించదని పేర్కొన్నది.

ఈ విధంగా భారత ఆహార సంస్థకు నిధులు తగ్గించటం, ఆ సంస్థను ధాన్య సేకరణ బాధ్యత నుంచి తప్పించటం, రాష్ట్రాలే ధాన్య సేకరణ చేసుకోవాలనడం, బీపీఎల్ కుటుంబాలను తగ్గించటం వంటి చర్యల ద్వారా మోదీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. భూమిని, ఉపాధిని సాధించుకోవటానికి పేదలందరూ ఐక్యమవ్వాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

జీవన్ముక్తికి సోపానం

సందర్భం



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

'సంఘంలో మనలేని మానవుడు పశువైనా కావాలి, పరమాత్మయినా కావాలి' అంటాడు అరిస్టాటిల్. సమాజం కోసం జీవించడం అంటే లోకాన్ని ఉద్ధరించటం. లోకాన్ని ఉద్ధరించటం అంటే సమాజాభివృద్ధికీ, సమాజ శ్రేయస్సుకూ జీవితం త్యాగం చేయడం. అలా జీవితాన్ని ఫణంగా పెట్టి లోకానికి ఒక సందేశమిచ్చి మరణాన్ని జయించి లేచినవాడు ఏసుక్రీస్తు. ఏసు జననమే ఒక విచిత్రం. ఆయన మరణమూ విచిత్ర ఘటన. కరుడు కట్టిన దాష్టీకాన్నీ, మూఢ అంధ విశ్వాసాల్నీ, హేతువు లేని బోధలనూ వ్యతిరేకించి లోకానికి ఒక కొత్తబాట వేశాడు ఏసు క్రీస్తు. పవిత్ర దేవాలయ నిర్వాహకుల మత మౌఢ్య దురహంకార వ్యాపార దుర్మార్గ చర్యలను నిరసించి ప్రజా చైతన్యం గావించినందువల్ల ఆయనపై దేశ ద్రోహం నేరం ఆరోపించి సిలువ శిక్షకు గురిచేశారు.



ఏసు సిలువపై పలికిన చివరి ఏడు మాటలను 'సిలువ ధ్యానం'గా గుడ్ ఫ్రైడే నాడు ఆచరిస్తారు. ఏసు సిలువపై మరణానికి ముందు పలికే ఏడు వాక్కులు ప్రేమకు, బాధ్యతకు, సమాజ శ్రేయస్సుకు, విశ్వాస జీవన గమనానికి మార్గదర్శకాలు. తొలి మాటలోనే ఆయన్ని క్రూరంగా హింసిస్తున్న వాళ్లని 'వీళ్లేమి చేస్తున్నారో వీళ్లకు తెలియదు... వీళ్లని క్షమించ'మని ప్రార్థించాడు. రెండో మాటలో ఆయనతోపాటు సిలువశిక్ష అనుభవిస్తున్న మరో వ్యక్తి దిస్మస్ 'దేవా! నీ రాజ్యంలో నన్నూ చేర్చుకో' అని అడుగగా ఏసు వేదన అనుభవిస్తూ కూడా 'నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉంటావు' అని అభయమిచ్చాడు. మూడో వాక్కులో తల్లిని చూసి, 'అమ్మా! ఇదిగో నీ కుమారుడు' అని తన ప్రియశిష్యుడు, సోదర సమానుడైన యోహానుకు బాధ్యత అప్పగించాడు. నాలుగో మాటలో తన మరణం ఆసన్నమయిందని తెలిసి, 'నా దేవా! నా దేవా! నన్నెందుకు చేయి విడిచావు' అని పరలోక సందేశం పంపాడు. ఐదో మాటలో ప్రపంచానికి దాహార్తి తీర్చిన తండ్రిని తనకు దాహం వేస్తుందని 'దప్పిగొనుచున్నాను' అని సమాజాన్ని అడిగాడు. ఆరో మాటలో తాను ఈ లోకానికి వచ్చిన పని 'సమాప్తమైనది' అనీ, కర్తవ్య నిర్వహణ సక్రమంగా నెరవేర్చాననీ చివరి పలుకుగా తన తండ్రి అయిన యెహోవా దేవునికి 'నా ఆత్మను నీ చేతికి అప్పగిస్తున్నాన'ని ప్రాణం విడిచాడు. అనంతరం లోకమంతా చీకటి కమ్మింది.

ఏసుతోపాటు మరో ఇద్దరికి కూడా సిలువ వేశారు. నిజానికి ఏసు ఒక్కడికే సిలువ వేయాలి. కాని ఏసును యూదుల రాజుగా గుర్తించాడు పిలాతు. ఆనాటికి రోమ్ పరిపాలనలో ఆయనే న్యాయమూర్తి. శిక్షార్హుడయిన వారి వివరాలు వారి మెడలోనే, సిలువ మీద రాసే సంప్రదాయం ఉంది. అందుకే లాటిన్, హీబ్రూ, గ్రీకు భాషల్లో ఐఎన్‌ఆర్‌ఐ అని ఇంగ్లిష్ అక్షరాల్లో రాశారు. అంటే 'ఈసూస్ నజరేనస్ రెక్స్ ఇవాడేరమ్' అంటే యూదుల రాజైన నజరేయుడగు ఏసు (యోహాను 19:19–22) అని రాయమని తీర్పు ఇచ్చాడు పిలాతు. అందువల్ల రాజుతోపాటు మరో ఇద్దరు సిలువ వేతకు గురయ్యారు.

ఏసు సిలువ వేతకు ముందు నలభై రోజులు ఉపవాసాన్ని 'లెంట్' దినాలుగా ధ్యానిస్తారు. లెంట్ అనే లాటిన్ మాటకు నలభై అని అర్థం. నలభై రోజులు అత్యంత నిష్ఠగా దైవ ధ్యానంలో అన్ని కార్యకలాపాలు పవిత్రంగా ఆచరిస్తూ ప్రార్థనలో గడుపుతారు. ఈ కాలంలో సాత్విక ఆహార నియమాలతోపాటు సర్వజీవన క్రమాన్ని పవిత్రంగా వ్యక్తిగత క్షాళన చేసుకుని శారీరకంగా, మానసికంగా దైవ జీవన్ముక్తికీ, సమాజ ప్రేమ జీవనసౌందర్యానికీ, అంతఃశ్శుద్ధికీ ప్రాధాన్యతనిస్తారు.

గుడ్ ఫ్రైడే అనంతరం వచ్చే ఆదివారాన్ని ఈస్టర్ పండుగగా ఆచరిస్తారు. విశ్వవ్యాప్త క్రైస్తవ విశ్వాసులకు గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలు పవిత్ర జీవనక్రమానికీ, ముక్తిమార్గ సోపానానికీ ప్రతీకలు.

వ్యాసకర్త పరిశోధకులు, రచయిత । 98481 23655
(నేడు గుడ్ ఫ్రైడే)



గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చవితి సా.5.17 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** విశాఖ సా.5.56 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.10.06 నుండి 11.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.13 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.18 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.32 నుండి 10.13 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

ఏసు బలిదానానికి సంస్మరణగా గుడ్ ఫ్రైడే

● గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



సాక్షి, హైదరాబాద్: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తును శిలువ వేయడాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరసోదరీమణులతో కలిసి స్మరించుకుందామని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. క్రైస్తవ మతం బోధించే అనంతమైన కరుణ, క్షమాగుణాలకు ఏసుక్రీస్తు అంతిమ బలిదానం ప్రతిబింబిస్తుందన్నారు. తన బోధనలు, చర్యల ద్వారా ఏసుక్రీస్తు మోక్ష మార్గానికి దారిచూపించారన్నారు. ఈ గుడ్ ఫ్రైడే రోజున మానవాళికి ఆయన చేసిన నిస్వార్థ సేవలను స్మరించుకుందామన్నారు. జీసస్ బోధించిన ప్రేమ, కరుణ, క్షమాగుణాల నుంచి స్ఫూర్తి పొంది మన దైనందిన జీవితంలో ముందుకు సాగాలని గవర్నర్ సూచించారు.

ఏసుక్రీస్తు పంచిన శాంతి, కరుణ స్ఫూర్తిదాయకం

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గుడ్ ఫ్రైడే సందర్భంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఏసుక్రీస్తు త్యాగాన్ని ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఏసుక్రీస్తు శాంతి, కరుణ సందేశాలతో పాటు ఆయన నేర్పిన సేవ, దయ, సోదరభావం ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని గురువారం ఓ ప్రక టనలో పేర్కొన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా గుడ్ ఫ్రైడేను క్రైస్తవ సోదర సోదరీమణులు జరుపుకోవాలన్నారు.

జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం

● ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: మానవాళి కోసం కరుణామయుని మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం అని, జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏసు ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రై డే రోజు, ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు... ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపుతిప్పిన ఘట్టాలు అని సీఎం జగన్ పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం... ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని ఆయన తెలిపారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

● డీజీపీకి టీపీసీసీ నేతల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్న వార్ రూంపై పోలీసులు దాడి చేసి ఆధారాలు సేకరించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ నేత తుమ్మేటి సమ్మి రెడ్డి కోరారు. ఈ మేరకు వారు గురువారం డీజీపీ రవిగుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2021లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లోనూ తమలాంటి ఎందరో నాయకుల ఫోన్లను అప్పటి మంత్రి హరీశ్ రావు ఇంటెలిజెన్స్ అధికారులను ఉపయోగించి ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. ఇలా విపక్ష నేతలు, వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ చేసి దోచుకున్న రూ.వందల కోట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నా ఫోన్ ట్యాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● డీజీపీకి ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నందకుమార్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: తన ఫోన్‌ను ట్యాప్ చేసి, ఆ ఆడియోలను బయటపెట్టిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేల కొనుగోలు కేసు ప్రధాన నిందితుడు నందకుమార్ కోరారు. ఈ మేరకు గురువారం డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నందకుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తన ఫోన్ ట్యాప్ చేసి, ఆ ఆడియో రికార్డుల్లోని సంభాషణలు బయటపెట్టారని ఆరోపించారు. ఫోన్ ట్యాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరానని తెలిపారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులు, స్నేహితుల్ని అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు అక్రమంగా బంధించి కేసులు పెట్టారని, ఎవరి ఆదేశాల మేరకు అలా చేశారనేది తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో అప్రూవర్‌గా మారనందునే తన హోటల్ ను ధ్వంసం చేశారని నందకుమార్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి స్పష్టమైన ఆధారాలున్నాయని, బాధ్యులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని తాను కోరినట్టు నందకుమార్ వెల్లడించారు.

మిగిలిన గురుకుల పోస్టులను మెరిట్‌తో భర్తీ చేయండి

● రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల బోర్డులకు హైకోర్టు ఆదేశం
● గతంలోని సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గురుకుల నియామకాల్లో మిగిలిపోయిన పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పాటించాలని సూచించింది. దీనిపై తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. విచారణను వచ్చే నెల 22వ తేదీకి వాయిదా వేసింది.

అభ్యర్థులు పోస్టులు వదులుకోవడంతో..: గురుకులాల్లో డిగ్రీ అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ తదితర పోస్టుల భర్తీ కోసం 2023 ఏప్రిల్ 5న తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్లు ఇచ్చింది. అయితే ఈ నియామకాలను అవరోహణ క్రమంలో ఎగువ స్థాయి పోస్టులను ముందు, దిగువ స్థాయి పోస్టులను తర్వాత) చేపట్టాల్సి ఉన్నా.. ఒకేసారి అన్ని ఉద్యోగాల భర్తీ చేపట్టింది. దీనితో మూడు, నాలుగు పోస్టులకు ఎంపికైన మెరిట్ అభ్యర్థులు ముఖ్యమైన పోస్టులను ఎంచుకోగా.. మిగతా పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఇలా మిగిలిన పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్లకు చెందిన విజయ్ మనోహర్‌తోపాటు మరో 20 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది హిమాగ్రి వాదనలు వినిపిస్తూ.. నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టులన్నీ భర్తీ కాకుండా మిగిలిపోతే, వాటిని తదుపరి మెరిట్ అభ్యర్థులతో నింపవచ్చని గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. పిటిషనర్లు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఈ మేరకు వినతిపత్రం కూడా అందజేశారని కోర్టుకు విన్నవించారు. బోర్డు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారని.. మిగిలిన ఖాళీల్లో పిటిషనర్లను భర్తీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే తదుపరి గురుకుల నియామక ప్రక్రియపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

భారీగా 'బ్యాక్‌లాగ్'!

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యోగాల్లో సుమారు 10శాతానికిపైగా ఇలా మిగిలిపోవడం గమనార్హం.

33వేల కొలువుల్లో.. 4,590 ఉద్యోగాలు ఖాళీ..

రాష్ట్రంలో గత మూడు నెలల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో 33 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరిగింది. ఇందులో 4,590 ఉద్యోగాలు మిగిలిపోయినట్టు నియామక సంస్థల ప్రాథమిక గణాంకాలు చెప్తున్నాయి. ఉద్యోగులంతా పూర్తిస్థాయిలో విధుల్లో చేరితే ఇందుకు సంబంధించి మరింత స్పష్టత రానుంది. గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు పరిధిలో ఇప్పటివరకు 8.820 ఉద్యోగాల భర్తీ చేపట్టగా.. ఏకంగా 1,810 ఉద్యోగాలు భర్తీ కాకుండా మిగిలినట్టు సమాచారం. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఇటీవల చేపట్టిన 15,644 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో దాదాపు 2వేల ఉద్యోగాలు భర్తీ కాలేదు. ఇక మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7 వేల స్టాఫ్ నర్సు, 1,150 మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలను భర్తీ చేయగా.. వీటిలోనూ 780 ఉద్యోగాలు మిగిలిపోయాయి.

రిలిక్విష్మెంట్ లేకపోవడంతో..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఉద్యోగ ఖాళీల భర్తీలో రిలిక్విష్మెంట్ విధానాన్ని అనుసరించారు. అంటే ఏదైనా నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రకటించిన ఖాళీలు పూర్తి స్థాయిలో భర్తీ కాకుంటే.. అందులోని తర్వాతి మెరిట్ అభ్యర్థులతో భర్తీచేసేందుకు వీలు ఉండేది. 2018 వరకు ఈ విధానాన్ని అనుసరించారు. కానీ ఈ విధానంలో పారదర్శకత లోపించిందంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, దానికితోడు ఇతర కారణాలతో రిలిక్విష్మెంట్ విధానాన్ని పక్కనబెట్టారు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చాక జారీ అయిన నోటిఫికేషన్లలో రిలిక్విష్మెంట్ అంశాన్ని జతచేయలేదు. అంటే ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎన్ని పోస్టులు మిగిలినా అదే నోటిఫికేషన్ కింద భర్తీ చేసే అవకాశం లేదు. ఇటీవల రిలిక్విష్మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి, నిబంధనలపై చర్చించినా.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా భర్తీ ప్రక్రియలో బ్యాక్‌లాగ్ ఖాళీలు మిగిలిపోతున్నాయి. వాటిని భర్తీ చేయాలంటే మళ్లీ కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేయాల్సిందేనని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం నియామకాల ప్రక్రియలు ఇంకా కొనసాగుతుండటంతో.. నోటిఫికేషన్ల వారీగా ఏర్పడే ఖాళీలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పడుతుందని అంటున్నారు.

హెచ్‌సీఏఏ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి విజయం



రవీందర్‌రెడ్డి



సంజీవ్‌రెడ్డి



శాంతిభూషణ్ రావు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ ఎన్నికలను తలపించేలా సాగిన హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఎన్నికల్లో అధ్యక్షుడిగా అయ్యాడపు రవీందర్‌రెడ్డి విజయం సాధించారు. అధ్యక్షుడి ఎన్నిక కోసం అయ్యాడపు రవీందర్‌రెడ్డి, మణికొండ విజయ్‌కుమార్, చిక్కుడు ప్రభాకర్, ఏ.జగన్ నువ్వా నేనా అన్న రీతిలో ప్రచారం సాగించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో జగన్‌పై రవీందర్‌రెడ్డి 33 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఉపాధ్యక్షురాలిగా ఏ.దీప్తి, జనరల్ సెక్రటరీలుగా ఉప్పల శాంతిభూషణ్ రావు, జిల్లెల సంజీవ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా వాసిరెడ్డి నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా కట్టా శ్రావ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్.అభిలాష్ విజయం సాధించారు. హైకోర్టుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లకు ఒకేసారి ఎన్నికలు జరగడం, ఫలితాలు ప్రకటించడం విశేషం. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రవీందర్‌రెడ్డి 1987లో నాటి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. గతంలో రైల్వే స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2021లో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తా: రవీందర్‌రెడ్డి

బార్ అండ్ బెంచ్ సంబంధాలు మరింత బలోపేతం చేస్తా. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తా. జూనియర్ న్యాయవాదులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు.. వాటి పరిష్కారానికి అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

● భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌తో పాటు ఓ కొరియర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ రోహిత్‌రాజు కొత్తగూడెంలో గురువారం ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్, 204 బెటాలియన్ కోబ్రా బలగాలు దుమ్ముగూడెం మండలం ములకలపల్లిలో బుధవారం కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా మావోయిస్టు పార్టీ కిష్టారాం లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ (ఎల్‌ఓఎస్) డిప్యూటీ కమాండర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూస్నార్‌కు చెందిన పుట్టం మున్నా, ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరాపురానికి చెందిన కొరియర్ జాడి పెద్దబ్బాయి పట్టుబడ్డారు. వీరిలో మున్నా మావోయిస్టు పార్టీలో మడవి హిడ్మా నాయకత్వంలో కొంతకాలం బెటాలియన్ సభ్యుడిగా పనిచేశాడు. 2022 నుంచి కిష్టారం ఏరియా ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. మున్నా 2007లో తాడిమెట్ల దగ్గర 12 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటన, 2010లో చింతల్నార్ అటవీ ప్రాంతంలో 76 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులను హతమార్చడం, 2013 మేలో కిష్టారం వద్ద ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపడం, 2014లో కాసల్పాడు దగ్గర 14 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చడం, 2018లో మైన్ ప్రూఫ్ వాహనంపై కాల్పులు జరిపి తొమ్మిది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపడం, 2021లో జీరామ్ ఘాట్ వద్ద 22 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటన, ధర్మారం క్యాంప్‌పై దాడిలో పాల్గొన్నాడు. అతడిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రూ.5 లక్షల రివార్డు ఉంది. జాడి పెద్దబ్బాయి మూడేళ్లుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఒకటో బెటాలియన్ మావోయిస్టులకు కొరియర్‌గా పని చేస్తుండగా, వీరి నుంచి 10 జిలెటిన్ స్టిక్స్, రెండు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌషుమి భట్టాచార్య ప్రమాణం



జస్టిస్ మౌషుమి భట్టాచార్యతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌషుమి భట్టాచార్య బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉదయం 10 గంటలకు హైకోర్టు ఆవరణలోని ఫస్ట్ కోర్టు హాల్లో ఆమెతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం చేయించారు. పశ్చిమ బెంగాల్ హైకోర్టు నుంచి జస్టిస్ మౌషుమి భట్టాచార్యను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాణస్వీకార కార్యక్రమంలో జస్టిస్ మౌషుమి భట్టాచార్య కుటుంబసభ్యులతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు. జస్టిస్ మౌషుమి భట్టాచార్య చేరికతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 28కి చేరింది. ఇంకా 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

యాసంగి ధాన్యం కొనుగోళ్లు షురూ

● నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో 19 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పౌరసరఫరాల సంస్థ



నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాలబావి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తక్కువ ధరకు ధాన్యం దళారులకు విక్రయిస్తున్న తీరుపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'ధాన్యం.. దళారుల దోపిడీ' శీర్షికన వార్త కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థను అప్రమత్తం చేసింది. నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో 15 రోజుల క్రితమే కోతలు ప్రారంభం కావడంతో మిల్లర్లు, దళారులు కల్లాల నుంచే తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అధికారికంగా విక్రయాల కోసం ఏప్రిల్ 1వరకు వేచి ఉండాల్సి రావడంతో రైతులు అగ్గువకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ అంశాలను వివరిస్తూ 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వం స్పందించి వెంటనే నిజామాబాద్, నల్ల గొండ జిల్లాల్లో అవసరమైన చోట 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్, డీసీఎస్ఓ, డీఎంసీఎస్ఓ తదితరులతో కలిసి అర్జాలబావిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా యడ్పల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు.

7,149 కొనుగోలు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్‌కు సంబంధించి 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో 19 కేంద్రాలను ప్రారంభించామని వివరించింది. అవసరమైనచోట ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిచి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఇప్ప టికే సమాచారం అందించినట్లు సంస్థ పేర్కొంది.

రైతులకు విత్తన సబ్సిడీ

● ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదన
● వరి, సోయాబీన్, కంది, మినుము వంటి పంటలకు రాయితీ!
● వచ్చే వానాకాలం సీజన్లో సబ్సిడీ ఇచ్చేందుకు ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతులకు సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. వరి, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్, మినుములు, జీలుగ, జనపనార, పిల్లి పెసర తదితర విత్తనాలను సబ్సిడీపై అందజేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జీలుగ, జనపనార, పిల్లి పెసర మినహా ఇతర విత్తనాలకు మూడేళ్ల క్రితమే సబ్సిడీ ఎత్తేయగా ఇప్పుడు సబ్సిడీని పునరుద్ధరించాలని నిర్ణయించారు. కేవలం వానాకాలం సీజన్‌లో అందించే విత్త నాల సబ్సిడీ కోసమే దాదాపు రూ. 170 కోట్లు ఖర్చు కానుందని అంచనా. కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ. 25 కోట్ల మేరకు విత్తన సబ్సిడీ కింద నిధులు వచ్చే అవకాశం ఉంది. మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం సమ కూర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

35–65 శాతం వరకు సబ్సిడీ...

గతంలో మాదిరిగానే విత్తనాలకు 35 నుంచి 65 శాతం వరకు సబ్సిడీని అందించనున్నారు. సోయాబీన్‌కు 37 శాతం, జీలుగ, పిల్లి పెసర, జనపనార విత్తనాలకు 65 శాతం సబ్సిడీ... కంది, పెసర, మినుము, వేరుశనగ విత్తనాలకు 35 శాతం వరకు సబ్సిడీ అందించాలని భావిస్తున్నారు. వరి పదేళ్లలోపు పాత విత్తనాల ధర ఎంతున్నా రూ. వెయ్యి సబ్సిడీ ఇవ్వాలని... పదేళ్లకుపైగా ఉన్న వరి విత్తనాలకు రూ. 500 సబ్సిడీ ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మొత్తం విత్తన సరఫరాలో వ్యవసాయశాఖ అధికంగా వరి విత్తనాలనే రైతులకు సరఫరా చేయనుంది.

రైతు కోరుకొనే విత్తనాలే కీలకం...

ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే కొన్ని రకాల విత్తనాలను రైతులు పెద్దగా కోరుకొనే పరిస్థితి ఉండదు. గత అనుభవాల ప్రకారం రాష్ట్రంలో మొక్కజొన్న సాగు అధికం. ఆ విత్తనాన్ని ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తోంది. కానీ మొక్కజొన్నలో అనేక హైబ్రీడ్ రకాల విత్తనాలున్నాయి. వాటిలో కొన్ని రకాలకు మరింత డిమాండ్ ఉంది. కానీ ప్రభుత్వం సరఫరా చేసే మొక్కజొన్న విత్తనాలను పెద్దగా కొనుగోలు చేసేందుకు ఇష్టపడని రైతులు.. ప్రైవేటు డీలర్ల వద్ద తమకు అవసరమైన డిమాండ్ ఉన్న విత్తనాలనే కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏదో యథాలాపంగా టెండర్లు పిలిచి టెండర్లు ఖరారు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. రైతులు కోరుకొనే రకాల విత్తనాలు ఇవ్వకపోవడం వల్ల గతంలో అనేక సబ్సిడీ విత్తనాలు వ్యవసాయశాఖ వద్ద మిగిలిపోయాయి. దీనివల్ల ఆ శాఖకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుంది.

1.21 కోట్ల పత్తి విత్తనాలు అవసరం: మంత్రి తుమ్మల

వచ్చే వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో 60.53 లక్షల ఎకరాలలో పత్తి సాగు కానుందని... అందుకు 1.21 కోట్ల విత్తన ప్యాకెట్లు అవసరమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారులు, విత్తన కంపెనీలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. అన్ని ప్రైవేటు విత్తన కంపెనీలు పత్తి విత్తనాలు సరఫరా చేయాలని ఆదేశించారు. వరి 16.50 లక్షల క్వింటాళ్లు, మొక్కజొన్న 48,000 క్వింటాళ్ల విత్తనాలు అవసరమన్నారు. ప్రస్తుత లైసెన్సింగ్ విధానంలో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు చేపట్టారు. 2020 ఆగస్టు 31న ఈయన పదవీ విరమణ చేసినా.. మూడేళ్ల పాటు ఓఎస్డీగా నియమిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఆగస్టు 31తో ఆ గడువు ముగిసింది. అయితే గడువును ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు పొడిగించింది. 2018 నాటి ఎన్నికల సమయంలో రాధాకిషన్‌రావు డీసీపీ హోదాలో విధులు నిర్వర్తించారు. ఒక అధికారి ఒకే పోస్టులో రెండు ఎన్నికలకు పని చేయకూడదనే నిబంధన ఉంది. దీంతో పాటు ఆయన అధికార పార్టీకి సన్నిహితంగా ఉన్నారనే ఆరోపణలూ వచ్చాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఈసీ గత ఏడాది అక్టోబర్ 20న ఆయనపై బదిలీ వేటు వేసింది. అప్పటి నుంచి విధులకు దూరంగా ఉన్న ఆయన.. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి, కొత్త సర్కారు ఏర్పడుతుండటంతో గత ఏడాది డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ప్రభాకర్‌రావుతో కలిసి భారీ వసూళ్లు..

ఎస్ఐబీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలోని టీమ్ వ్యవహారాల్లో రాధాకిషన్‌రావుకు కీలక పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన తన సిబ్బందితో కలిసి వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. వీళ్ల టార్గెట్ చేసిన వారిలో బడా బిల్డర్లు, జ్యూవెలరీ దుకాణాల యజమానులు, రియల్టర్లతో పాటు ప్రముఖ వ్యాపారులు ఉన్నారు. ప్రణీత్‌రావు ఇచ్చే సమాచారంతో రంగంలోకి దిగే రాధాకిషన్‌రావు సైన్యం ఓ పార్టీ కోసం విరాళాలతో పాటు తమ బాస్‌ల కోసం పెద్ద మొత్తంలో మామూళ్లు వసూలు చేశారు. ప్రణీత్‌రావు అరెస్టు తర్వాత రాధాకిషన్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే ప్రణీత్‌తో పాటు భుజంగరావు, తిరుపతన్నల విచారణలో రాధాకిషన్‌రావు పాత్రపై సిట్‌కు అనేక ఆధారాలు లభించాయి. దీంతో పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) కూడా జారీ చేశారు. అయితే నాటకీయ పరిణామాల మధ్య రాధాకిషన్‌రావు గురువారం పోలీసులకు చిక్కారు.

ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు ఇద్దరికీ సన్నిహితుడే..

సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ప్రశ్నిస్తున్న ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు అటు ప్రభాకర్‌రావు, ఇటు రాధాకిషన్‌రావులకు సన్నిహితుడని తెలుస్తోంది. ప్రభాకర్‌రావు ఉమ్మడి నల్లగొండ ఎస్పీగా పని చేసినప్పుడు ఇతను చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశాడు. రాధాకిషన్‌రావు హయాంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గానూ విధులు నిర్వర్తించాడు. ఇక్కడ నుంచి మళ్లీ ప్రభాకర్‌రావు నేతృత్వం వహిస్తున్న ఎస్ఐబీలోకే వెళ్లాడు. ఇటీవల అరెస్టు అయిన అదనపు ఎస్పీ తిరుపతన్న టీమ్‌లో చురుకుగా వ్యవహరించాడని సిట్ చెప్తోంది. ఈ రెండు విభాగాల్లోనూ గట్టు మల్లు బలవంతపు వసూళ్లకు పాల్పడ్డాడని అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న నలుగురు అధికారులను పిలిచి విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. వీళ్లు రాధాకిషన్‌రావు హయాంలోనూ టాస్క్‌ఫోర్స్‌లోనే పని చేయడంతో వీరి పాత్రపై ఆరా తీస్తున్న సిట్.. సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తోంది.

భుజంగరావు, మేకల తిరుపతన్న సస్పెన్షన్

జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రణీత్‌రావు అదనపు కస్టడీ పిటిషన్‌ను మాత్రం న్యాయస్థానం కొట్టేసింది. ఇలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వీరిని ఈనెల 23న పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

'ఆమ్ ఆద్మీ'ని అంతం చేసే కుట్ర

అప్రూవర్ల ప్రకటనలతో సీఎం స్థాయి వ్యక్తిని అరెస్టు చేస్తారా?

- నా పేరు చెప్పగానే మాగుంట రాఘవకు బెయిల్ ఇచ్చారు
- రూ.100 కోట్లు అంటున్నారు.. అది ఎక్కడా లేదు: కేజ్రీవాల్
- రౌజ్ అవెన్యూ కోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన వైనం
- కేజ్రీవాల్ కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించిన ప్రత్యేక కోర్టు



కోర్టులో హాజరుపరిచాక కేజ్రీవాల్‌ను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దోపిడీ రాకెట్ నడుపుతోందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. అవినీతి అనే పొగతో కప్పేసి ఆప్‌ను అవినీతి పార్టీగా చిత్రీకరించి, అంతమొందించడం ఈడీ లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. తాను ఈడీ దర్యాప్తును వ్యతిరేకించడం లేదని అన్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు తనను ఈడీ కస్టడీలో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఏడు రోజుల కస్టడీ ముగియడంతో సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు గురువారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. తొలుత ఈడీ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు, న్యాయవాది జొహెబ్‌హుస్సేన్ వాదనలు వినిపించారు. మద్యం కుంభకోణం కేసులో స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఇతరత్రా డేటాను పరిశీలించాల్సి ఉందని ధర్మాసనానికి రాజు తెలియజేశారు. ఇతర నిందితులతో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాల్సి ఉందన్నారు. గోవా నుంచి సమన్లు అందుకొన్న కొందరితో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాలన్నారు. లిక్కర్ కేసులో దర్యాప్తునకు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా సహకరించడం లేదని ఆరోపించారు. మరో ఏడు రోజులపాటు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అనుమతించాలని న్యాయమూర్తిని కోరారు. అనంతరం స్వయంగా వాదనలు వినిపించుకోవడానికి కేజ్రీవాల్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది గుప్తా కోరగా, న్యాయమూర్తి అనుమతించారు. కేజ్రీవాల్ తన వాదనలు హిందీలో కొనసాగించారు. 2022లో సీబీఐ కేసు నమోదైందని, తనని ఎవరూ అరెస్టు చేయలేదని, ఏ కోర్టు కూడా తనను దోషిగా గుర్తించడం గానీ లేదా ఆరోపణలు చేయడం గానీ జరగలేదని స్పష్టం చేశారు.

ట్రాప్ చేయడమే ఈడీ అసలు ఉద్దేశం

ఈ కేసులో సీబీఐ ఇప్పటిదాకా 31,000 పేజీలను కోర్టులో ఫైల్ చేసిందని, 294 మంది సాక్ష్యులను విచారించిందని, ఈడీ 162 మందిని విచారించిందని, 25,000 పేజీల రిపోర్టును ఫైల్ చేసిందని చెప్పారు. తన పేరు కేవలం 4 స్టేట్‌మెంట్లలోనే ఉందని తెలిపారు. తననెందుకు అరెస్టు చేశారో చెప్పాలన్నారు. అయితే, ఈ వివరాలన్నీ అఫిడవిట్ రూపంలో ఇస్తే రికార్డుల్లో చేరుస్తానని న్యాయమూర్తి సూచించారు. దీంతో, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కేజ్రీవాల్ అభ్యర్థించారు. తాను ముఖ్యమంత్రినని, తన నివాసానికి మంత్రులు వస్తుంటారని, గుసగుసలాడుతుంటారని, దీని ఆధారంగా సిట్టింగ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై ఎస్.వి.రాజు అభ్యంతరం వ్యక్తం చేయగా... ''రాజు గారు, మీ ఆశీర్వాదం నాకు కావాలి. నన్ను మాట్లాడనివ్వండి'' అని కేజ్రీవాల్ కోరారు. ఐదు నిమిషాలు మాత్రమే సమయం ఇవ్వగలనని న్యాయమూర్తి చెప్పడంతో కేజ్రీవాల్ తన వాదనలు కొనసాగించారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరును ప్రస్తావించారు. తనకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇచ్చే వరకూ అతడి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటూనే ఉన్నారని, దీన్నిబట్టి తనని ట్రాప్ చేయడమే ఈడీ అసలు ఉద్దేశమని అర్థమవుతోందని చెప్పారు. కొంతమంది నిందితులు అప్రూవర్లుగా మారిన అనంతరం ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. మాగుంట రాఘవ ఇచ్చిన స్టేట్‌మెంట్లను ప్రస్తావిస్తూ... ఆయన ఐదు స్టేట్‌మెంట్లు ఇచ్చారని తెలియజేశారు. ఈడీ ఏం చెబితే అదే వాంగ్మూలంగా ఇచ్చారని అన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్టేట్‌మెంట్ మార్చుకోగానే ఆయన కుమారుడు మాగుంట రాఘవ బెయిలు పొందారని కేజ్రీవాల్ ఆరోపించారు. స్టేట్‌మెంట్లలో రాఘవ చెప్పింది ఏదీ కూడా ఈడీ రికార్డుల్లోకి తీసుకోలేదని ఆరోపించారు. ఈడీ కార్యాలయంలో లక్ష పేజీలు ఉన్నప్పటికీ, తనకు అనుకూలంగా ఉన్న ఒక్క అంశాన్ని కూడా రికార్డుల్లోకి తీసుకోలేదన్నారు. రూ.100 కోట్ల కుంభకోణం అంటున్నారని, అయితే ఆ సొమ్ము ఎక్కడా లేదని చెప్పారు. ఈడీ దర్యాప్తు తర్వాతే మద్యం కుంభకోణం అనేది మొదలైందని విమర్శించారు. ఈడీ అంతిమ లక్ష్యం ఆమ్ ఆద్మీ పార్టీని అంతమొందించడమేనని పేర్కొన్నారు. దీనిపై ఈడీ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

నా వద్ద ఆధారాలున్నాయి

బీజేపీకి శరత్‌చంద్రారెడ్డి రూ.55 కోట్లు విరాళంగా ఇచ్చారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ రాకెట్ నడుస్తోందనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఈడీ తనని ఎన్నిరోజులు రిమాండ్‌లో ఉంచుకున్నా అభ్యంతరం లేదన్నారు. ఈడీపై పదేపదే అవే విమర్శలు చేయడం ద్వారా ప్రజల మద్దతు కూడకట్టుకోవాలని కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఎస్.వి.రాజు ధర్మాసనానికి తెలిపారు. ఈడీ కార్యాలయంలో తనకు అనుకూలంగా పేజీలు ఉన్నాయని కేజ్రీవాల్ ఎలా భావిస్తున్నారు? ఇదంతా ఊహాజనితం అని అన్నారు. లంచం ద్వారా వచ్చిన సొమ్ములు గోవా ఎన్నికల్లో కేజ్రీవాల్ వినియోగించారని తెలిపారు. ఈ సొమ్మంతా హవాలా రూపంలో సౌత్ గ్రూపు నుంచి వచ్చిందేనని, అదంతా ఒక చైన్ లాంటిదని, అందుకే దాని గురించి కేజ్రీవాల్ మాట్లాడడం లేదని తెలిపారు. బీజేపీకి శరత్‌చంద్రారెడ్డి విరాళం ఆరోపణలపై రాజు బదులిస్తూ... దీనికి, మద్యం కుంభకోణానికి సంబంధం లేదన్నారు. ఎందుకంటే ఢిల్లీలో మద్యం విధానాన్ని రూపొందించే హక్కు బీజేపీకి లేదన్నారు. ముఖ్యమంత్రి అయినంత మాత్రాన వెంటనే క్లీన్‌చిట్ రాదని, దర్యాప్తును ఎదుర్కోవాలని,సామాన్యుడికి, సీఎంకు అరెస్టు విషయంలో తేడా ఉండదని రాజు పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో ప్రశ్నించడానికి కేజ్రీవాల్‌కు మరో వారం రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించాలని కోరారు. అనంతరం, రాజు వాదనలకు తాను స్పందించవచ్చా? అని కేజ్రీవాల్ తరపు న్యాయవాది గుప్తా కోరగా.. ఇప్పటివరకూ స్పందించారుగా ఇక అప్రస్తుతం అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది అప్రస్తుతం, అసందర్భం అని ఎలా అంటారని గుప్తా ప్రశ్నించగా... గట్టిగా మాట్లాడొద్దని హెచ్చరిస్తూ అందరి వాదనలు విన్నానని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

4 రోజులపాటు ఈడీ కస్టడీకి

మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ ఈడీ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు మరో 4 రోజులపాటు పొడిగించింది. ఆయనను ఏప్రిల్ 1న ఉదయం 11 గంటల్లోగా తమ ఎదుట హాజరుపర్చాలని ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఈడీ అధికారులను ఆదేశించారు. కేజ్రీవాల్‌ను ఏడు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరగా, న్యాయమూర్తి నిరాకరించారు. కేవలం 4 రోజులపాటు కస్టడీకి అనుమతించారు. గత ఐదు రోజులపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించామని, తప్పించుకొనేలా ఆయన సమాధానాలిచ్చారని రిమాండ్ పిటిషన్‌లో ఈడీ వెల్లడించింది.

సీఎం జైల్లో ఉంటే తప్పేంటి?

సీఎం పదవి నుంచి కేజ్రీవాల్‌ను తొలగించాలన్న పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ: అరెస్టయి జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని జైలు నుంచే నడిపించడాన్ని అడ్డుకునే చట్టపరమైన నిబంధనలను పిటిషనర్ సుర్జీత్‌సింగ్ యాదవ్ కోర్టుకు వెల్లడించని కారణంగా ఆ పిల్‌ను కొట్టేస్తున్నట్లు ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'నిజానికి సీఎం జైలులో ఉండటమనేది చాలా సంక్లిష్టమైన వ్యవహారమే. వాస్తవంలో ఇది ఎన్నో ఇబ్బందులను తెచ్చిపెట్టొచ్చని మేం కూడా భావిస్తున్నాం. అయితే సీఎం జైలులో ఉంటే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయా?' అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వరంగ విభాగాలే పరిశీలించాలి. ఇంతకు మించి వ్యాఖ్యానాలు చేయబోం' అని కోర్టు వ్యాఖ్యానించింది. 'స్వయంగా సీఎం జైలులో ఉంటే ప్రభుత్వ విశ్వసనీయతే దెబ్బతింటుంది. చట్టబద్ధపాలనకు ఆటంకాలు తలెత్తుతాయి. ఇది చివరకు ఢిల్లీ రాష్ట్రంలో పాలనావ్యవహారాల స్తంభనకు దారితీస్తుంది' అని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. 'రాష్ట్రపతి పాలన విధించాలనో, గవర్నర్ పాల కొనసాగాలనో మేం ఆదేశాలు ఇవ్వలేము. ఈ అంశాన్ని కేంద్రప్రభుత్వమే పరిశీలించాలి.

ఈడీ విచారణకు మహువా డుమ్మా

కోల్‌కతా: విదేశీ మారక ద్రవ్య నిర్వహణ(ఫెమా) చట్టం ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ దాఖలైన కేసులో తమ ఆఫీస్‌లో విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమన్లను తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా బేఖాతరు చేశారు. గురువారం ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు రాకుండా పశ్చిమబెంగాల్‌లో తాను పోటీచేస్తున్న కృష్ణనగర్ ఎంపీ స్థానంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఫెమా కేసులో మొయిత్రాతోపాటు దుబాయ్ వ్యాపారి దర్శన్ హీరానందానీకి విడివిడిగా ఈడీ తాజాగా సమన్లు జారీచేయడం తెల్సిందే. ఈడీ ఆఫీస్‌లో గైర్హాజరుపై కృష్ణనగర్‌లో ప్రచారంలో మొయిత్రా మాట్లాడారు. 'ఈడీ పని ఈడీ చేస్తుంది. నా పని నేను చేసుకుంటా. నాతోపాటు ప్రచారంలో కొనసాగేది ఎవరు?' అని 49 ఏళ్ల మొయిత్రా వ్యాఖ్యానించారు. గతంలోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మొయిత్రాను రెండుసార్లు విచారణకు పిలవగా ఇతర అధికారిక పనులు ఉన్నాయని సాకుగా చూపి ఆఫీస్‌కు రాలేదు.

గురుద్వారా చీఫ్‌ను కాల్చి చంపిన దుండగులు



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ఉద్ధమ్ సింగ్ నగర్ జిల్లాలోని ప్రముఖ నానక్ మత సాహిబ్ గురుద్వారా సాహిబ్ కర సేవా చీఫ్ తార్సెమ్ సింగ్‌ను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో గురుద్వారా ఆవరణలో కూర్చుని ఉండగా బైక్‌పై ఇద్దరు దుండగులు అక్కడికి చేరుకున్నారు. అందులో ఒకడు రైఫిల్‌తో ఆయనపైకి దగ్గర్నుంచి కాల్పులు జరిపాడు. అనంతరం బైక్‌పై పరారయ్యారు. తీవ్రగాయాలతో కిందపడిపోయిన తార్సెమ్ సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సీసీ టీవీ ఫుటేజీలో ఘటన నమోదైందని సీనియర్ ఎస్పీ మంజునాథ్ తెలిపారు. దుండగులిద్దరూ సిక్కులేనని తెలుస్తోందన్నారు.

బెంగళూరు కేఫ్‌లో పేలుడు.. కీలక సూత్రధారి అరెస్ట్

న్యూఢిల్లీ: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో ఈ నెల ఒకటో తేదీన సంభవించిన పేలుడు ఘటన దర్యాప్తులో కీలక అడుగు పడింది. ఈ ఘటనలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ముజమ్మిల్ షరీఫ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బుధవారం అరెస్ట్ చేసింది. సుమారు 18 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి కుట్రదారుల్లో ఒకడైన షరీఫ్‌తోపాటు కర్ణాటకలో 12 మందిని, తమిళనాడులో ఐదుగురిని, ఉత్తరప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది.

పంజాబ్ సీఎం మాన్ తండ్రయ్యారు!

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు కుమార్తె పుట్టింది. ఈ విషయాన్ని ఆయన గురువారం స్వయంగా ప్రకటించారు. 'ఆ సర్వేశ్వరుడు నాకు కుమార్తెను బహుమతిగా ఇచ్చారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారు' అని ఎక్స్‌లో తెలిపారు. కూతురు ఫొటోను షేర్ చేశారు. మొహాలీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ప్రసవించారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. మాన్, గుర్‌ప్రీత్‌లకు 2022లో వివాహమైంది. సీఎం మాన్ 2015లో మొదటి భార్య నుంచి విడాకులు తీసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పుత్రికోత్సాహం కలిగిన మాన్‌కు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో విచారణకు హాజరై వెళుతూ సీఎం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు.

న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు!

- స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టులు, జడ్జీలపై కొన్ని వర్గాల ఒత్తిళ్లు
- ఇలాంటి వ్యవహారాలపై కఠినచర్యలు తీసుకోండి
- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు 600 మంది సీనియర్ లాయర్ల లేఖ

న్యూఢిల్లీ: దేశంలో న్యాయ వ్యవస్థను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొన్ని వర్గాలు స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి జ్యుడీషియరీపై ఒత్తిడి పెంచుతున్నాయని సీనియర్ న్యాయవాదులు ఆరోపించారు. ప్రధానంగా రాజకీయ నాయకులు అవినీతికి సంబంధించిన కేసుల్లో న్యాయ వ్యవస్థపై ఒత్తిడి అధికంగా ఉంటోందని పేర్కొన్నారు. ఇలాంటి అనుచిత వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ మేరకు సీనియర్ అడ్వొకేట్ హరీష్ సాల్వే, బార్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మనన్‌కుమార్ మిశ్రా సహా 600 మందికిపైగా సీనియర్ న్యాయవాదులు ఈ నెల 26వ తేదీన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. దేశంలో న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుతంత్రాలు సాగుతున్నాయని లేఖలో ఆరోపించారు. రాజకీయ నేతలకు సంబంధించిన కేసుల్లో ఒత్తిళ్ల ద్వారా కోర్టు తీర్పులను సైతం ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుయుక్తులు మన న్యాయస్థానాల ప్రతిష్ట దెబ్బతీస్తున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి కఠిన మైన సమయంలో వెంటనే చొరవ తీసుకొని, అవాంఛనీయ ధోరణులను అడ్డుకట్ట వేయాలని సీజేఐకి న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు దృఢంగా వ్యవహరించాలని కోరారు. స్వార్థపరుల పట్ల 'గౌరవ ప్రదమైన మౌనం' వహించడానికి ఇది సమయం కాదని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థలోని ఓ వర్గం న్యాయవాదులను లక్ష్యంగా చేసుకొని సీనియర్ లాయర్లు ఈ లేఖ రాసినట్లు తెలుస్తోంది. వారి పేర్లను ప్రస్తావించకుండా లేఖలో పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఘనత వహించిన కొందరు న్యాయవాదులు పగటి పూట అవినీతి రాజకీయ నాయకులను సమర్థిస్తూ, రాత్రిపూట మీడియా ద్వారా జడ్జిలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో మండిపడ్డారు. కోర్టు నుంచి తీర్పులు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. తద్వారా న్యాయమూర్తులపై ఒత్తిడి పెంచి, అనుకూలంగా తీర్పులు ఇప్పించుకొనే కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రముఖ రాజకీయ నాయకులపై నమోదైన కేసుల్లో సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న సమయంలో సీజేఐకి లాయర్లు ఈ లేఖ రాయడం సంచలనాత్మకంగా మారింది.

అది కాంగ్రెస్ సంస్కృతి: ప్రధాని మోదీ

ఇతరులపై నిందలు వేయడం, భయపెట్టడం, దూషించడం, వేధించడం పాతకాలపు కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ''5 దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నేతలు నిబద్ధత కలిగిన న్యాయ వ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిస్సిగ్గుగా ఇతరుల నుంచి నిబద్ధతను కోరుకుంటారు. కానీ, దేశం పట్ల చూపాల్సిన నిబద్ధతకు దూరంగా ఉంటారు. అందుకే 140 కోట్ల మంది భారతీయులు కాంగ్రెస్‌ను తిరస్కరించడంలో ఆశ్చర్యం'' లేదు అని మోదీ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీనియర్ లాయర్లు లేఖ రాసిన వార్తను ఈ పోస్టుకు ట్యాగ్ చేశారు.

అవినీతికి చట్టబద్ధత కల్పించిన మోదీ: జైరామ్ రమేశ్

ప్రధాని మోదీ న్యాయ వ్యవస్థను సమర్థించే ముసుగులో అదే వ్యవస్థపై సిగ్గులేకుండా దాడి చేస్తున్నారని, ఇది కపటత్వానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం మండిపడ్డారు. సీజేఐకి లాయర్ల లేఖ నేపథ్యంలో 'ఎక్స్'లో మోదీ తాజా చేసిన పోస్టును తప్పుపట్టారు.



నింగిలో చక్కర్లు కొడుతున్న తేజస్ మార్క్ 1ఏ యుద్ధవిమానం

తేజస్ మార్క్ 1ఏ సక్సెస్

సాక్షి బెంగళూరు: అధునిక యుద్ధసామర్థ్యాలను సంతరించుకున్న నూతన తేజస్ మార్క్1ఏ తేలికపాటి యుద్ధవిమానం తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. గురువారం బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) కేంద్రం నుంచి టేకాఫ్ తీసుకుని 18 నిమిషాలపాటు గాల్లో నిర్దేశిత 'పథం'లో చక్కర్లు కొట్టింది. దీంతో తన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. తేజస్ ఎంకే1ఏ సిరీస్‌లో ఎల్ఏ5033 మొట్టమొదటి తేలికపాటి యుద్ధ విమానం. హెచ్ఏఎల్‌లోని చీఫ్ టెస్ట్ పైలెట్ గ్రూప్ కెప్టెన్ కెకె వేణుగోపాల్(రిటైర్డ్) ఈ విమానాన్ని నడిపారు. విమాన ప్రయాణం విజయవంతమవడంతో త్వరలోనే ఈ సిరీస్‌తో అధునాతన యుద్ధవిమానాలను తయారుచేసి భారత వాయుసేనకు అప్పగించనున్నారు. ''అంతర్జాతీయ పరిణామాలు, ఆయుధాల సరఫరా వ్యవస్థపై ఒత్తిడి నెలకొన్న ఈ తరుణంలో వేగంగా అధునాతన డిజైన్‌తో స్వదేశీ 4.5 నూతనతరం యుద్ధ విమానాన్ని తయారుచేయడంలో హెచ్ఏఎల్ సఫలీకృతమైంది. ఈ విజయంలో కీలక భాగస్వాములైన రక్షణ శాఖ, భారత వాయుసేన, రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థకు కృతజ్ఞతలు' అని హెచ్ఏఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనంతకృష్ణన్ చెప్పారు. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు, ఆయుధాలు, ఆధునిక ఎలక్ట్రానిక్ రాడార్, కమ్యూనికేషన్ సిస్టమ్, స్వీయ రక్షణకు జామర్ పాడ్‌లను దీనిలో అమర్చారు. 2028 ఫిబ్రవరిలోపు 83 తేజస్ మార్క్1ఏలను తయారుచేసి భారత వాయుసేనకు అందించనుంది. భారత వాయుసేనలో ఇప్పటికే తేజస్ 'ఫ్లయింగ్ డ్యాగర్', 'ఫ్లయింగ్ బుల్లెట్' పేరుతో రెండు బృందాలు ఉన్నాయి.

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ మృతి




లక్నో: జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్, ఉత్తరప్రదేశ్ రాజకీయ నాయకుడు ముఖ్తార్ అన్సారీ(63) గురువారం గుండెపోటుకు గురై బందా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో మృతి చెందారు. అంతకుముందు, రాత్రి 8.25 గంటల సమయంలో అన్సారీ ఆరోగ్యం విషమించడంతో అధికారులు బందా జిల్లా జైలు నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల బృందం చికిత్సలు చేస్తుండగానే ఆయన గుండెపోటుకు గురై చనిపోయినట్లు బందా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సునీల్ కౌశల్ పీటీఐకి తెలిపారు. దీంతో, ఉన్నతాధికారులు ఆస్పత్రి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రాష్ట్రవ్యాప్తంగా సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించారు. బందా, మౌ, గాజీపూర్, వారణాసి జిల్లాల్లో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. పొట్టలో నొప్పిగా ఉందని చెప్పడంతో మంగళవారం కూడా ఆస్పత్రిలో 14 గంటలపాటు ఉంచినట్లు అధికారులు చెప్పారు. జైలులో ఆయనపై విష ప్రయోగం జరిగిందని ఇతడి సోదరుడు, ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు.

5సార్లు ఎమ్మెల్యే.. 60కిపైగా కేసులు

మౌ సదర్ స్థానం నుంచి రెండుసార్లు బీఎస్పీ తరఫున, రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా, ఒకసారి సొంతపార్టీ క్వామీ ఏక్తా దళ్ తరఫున మొత్తం ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వివిధ ఆరోపణలపై యూపీ, పంజాబ్ జైళ్లలో 2005 నుంచి శిక్ష అనుభవిస్తున్నారు. ఈయనపై 60కి పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. యూపీలోని వివిధ కోర్టుల్లో 2022 నుంచి ఇతడిపై ఉన్న 8 కేసుల్లో తీర్పులు వెలువరించాయి. ప్రస్తుతం బందా జైలులో ఉన్నారు.

ప్రముఖ సైకాలజిస్ట్ డేనియల్ కానమన్ కన్నుమూత



న్యూజెర్సీ: ప్రపంచ ప్రఖ్యాత మనస్తత్వవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డేనియల్ కానమన్ (90) బుధవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రకటించింది. 1993వ సంవత్సరం నుంచి కానమన్ అక్కడే పనిచేస్తున్నారు. ఆర్థిక శాస్త్రం చదవకపోయినా ప్రవర్తనా ఆర్థిక శాస్త్రానికి ఆయన పర్యాయపదంగా మారారు. ఆయన రాసిన పుస్తకం 'థింకింగ్, ఫాస్ట్ అండ్ స్లో' ఎంతో ప్రజాదరణ పొందింది. డేనియల్ కానమన్ సిద్ధాంతాలు సామాజిక శాస్త్రాలను చాలా మటుకు మార్చివేశాయని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్డార్ షాఫిర్ పేర్కొన్నారు. 1934లో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో కానమన్ జన్మించారు.

ఎలక్షన్ బీట్

మహార్యాలీకి కాంగ్రెస్ సన్నాహాలు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ భారీ ప్రదర్శనకు సిద్ధమైంది. ఈ నెల 31న దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో తలపెట్టిన మహార్యాలీకి కాంగ్రెస్ పార్టీ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ సహా ఇండియా కూటమిలోని పార్టీల నేతలు పాల్గొని ర్యాలీలో పాల్గొని సంఘీభావం ప్రకటించనున్నారు. రామ్‌లీలా మైదాన్‌లో మార్చి 31న జరిగే ర్యాలీకి హాజరు కావాలని ఆప్ నాయకులు ఇప్పటికే శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మహార్యాలీని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి ఢిల్లీ, హరియాణా రాష్ట్రాల పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఐటీ, సీబీఐ తదితర సంస్థలను ఉసిగొల్పుతున్న కేంద్రం తీరును ఇండియా కూటమి నేతలు ఈ ర్యాలీ వేదికగా ఎండగట్టనున్నారు.

టికెట్ దక్కలేదని మనస్తాపం.. ఆత్మహత్యకు యత్నించిన ఎంపీ మృతి



సాక్షి, చెన్నై: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను టికెట్ రాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం(ఎండీఎంకే) సీనియర్ నేత, ఈరోడ్ ఎంపీ ఎ.గణేశమూర్తి(77) చనిపోయారు. ఈ నెల 2వ తేదీన తన నివాసంలో గుర్తు తెలియని విష మాత్రలు తీసుకుని, అస్వస్థతకు గురైన ఆయన్ను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆ తర్వాత కోయంబత్తూర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. గణేశమూర్తి ఎండీఎంకే టిక్కెట్‌పై 1998లో పళని నుంచి, 2009లో ఈరోడ్ నుంచి ఎంపీ అయ్యారు. అనంతరం 2019లో డీఎంకే గుర్తుపై పోటీ చేసి ఈరోడ్ నుంచి మరోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే, సీట్ల పంపకాల్లో భాగంగా ఈసారి ఆయనకు టిక్కెట్ దక్కలేదు. తీవ్ర మనస్తాపంతో ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు చెబుతున్నారు. ఆయనకు ఇద్దరు సంతానం. గణేశమూర్తి ఆకస్మిక మరణంపై సీఎం స్టాలిన్, ఎండీఎంకే చీఫ్ వైకో సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీలో చేరిన సావిత్రీ జిందాల్

చండీగఢ్: కాంగ్రెస్‌కు చెందిన హరియాణా మాజీ మంత్రి సావిత్రీ జిందాల్(84) బీజేపీలో చేరారు. ఆమె కుమారుడు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ కూడా ఇటీవలే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. గురువారం హిసార్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం నాయబ్ సింగ్ సైనీ, మాజీ సీఎం ఖట్టర్‌ల సమక్షంలో కుమార్తె సీమాతో కలిసి కాషాయ కండువా కప్పుకున్నారు. దివంగత పారిశ్రామికవేత్త, మాజీ మంత్రి ఓపీ జిందాల్ భార్య అయిన సావిత్రి ఈ ఏడాది ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన భారత మహిళా కుబేరుల జాబితాలో సుమారు రూ.2.42 లక్షల కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో ఉన్నారు. గతంలో కాంగ్రెస్‌కు చెందిన భూపీందర్ హుడా ప్రభుత్వంలో ఆమె మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో హిసార్‌లో బీజేపీకి చెందిన కమల్ గుప్తా చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. సావిత్రీ జిందాల్ కుమారుడు నవీన్ కాంగ్రెస్ తరఫున 2004–14 కాలంలో కురుక్షేత్ర నుంచి ఎంపీగా పనిచేశారు. కాంగ్రెస్‌ను వీడిన ఆయనకు బీజేపీ మళ్లీ కురుక్షేత్ర టికెట్ ఇవ్వడం గమనార్హం.

44 మందితో సీపీఎం మొదటి జాబితా

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను సీపీఎం గురువారం 44 మంది అభ్యర్థుల పేర్లతో మొదటి జాబితా ప్రకటించింది. ఇందులో కేరళలోని అలప్పుజ నుంచి సిట్టింగ్ ఎంపీ ఏఎం ఆరిఫ్, ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కేకే శైలజ, రాజ్యసభ ఎంపీ ఇ.కరీం తదితర 17 మంది పేర్లున్నాయి. అదేవిధంగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన ముర్షీదాబాద్ నుంచి ఎండీ సలీం తదితర 17 మందికి చోటుదక్కింది. తమిళనాడులో మదురై సిట్టింగ్ ఎంపీ ఎస్.వెంకటేశన్, దిండిగల్ నుంచి ఆర్.సచ్చిదానందంతోపాటు బిహార్, జార్ఖండ్, అస్సాం, అండమాన్ నికోబార్ దీవులు, పంజాబ్, రాజస్తాన్, తెలంగాణ, త్రిపురలోని ఒక్కో స్థానానికి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

శివసేనలో చేరిన నటుడు గోవిందా



ముంబై: బాలీవుడ్ నటుడు, మాజీ ఎంపీ గోవిందా రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. గురువారం ఉదయం బాలాసాహెబ్ భవన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో సమావేశమైన అనంతరం ఆయన సమక్షంలో శివసేనలో చేరారు. అనంతరం గోవిందా మాట్లాడుతూ.. మళ్లీ రాజకీయాల్లోకి వస్తానని తాను ఊహించలేదన్నారు. శిండే ముఖ్యమంత్రి అయిన తరువాత ముంబై మరింత సుందరంగా మారిందని, అభివృద్ధిలో దూసుకుపోతోందని కొనియాడారు. నార్త్‌వెస్ట్ ముంబై లోక్‌సభ నియోజకవర్గం నుంచి గోవిందా పోటీ చేయనున్నట్లు శివసేన వర్గాల సమాచారం. గత వారం సీఎం శిందేతో గోవిందా భేటీ అయిన నాటినుంచే ఆయన శివసేనలో చేరతారనే ఊహాగానాలు మొదలయ్యాయి.

నకుల్‌నాథ్ ఆస్తులు రూ.700 కోట్లు

భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్ నాథ్ కుమారుడు, రాష్ట్రంలో ఏకైక కాంగ్రెస్ ఎంపీ నకుల్‌నాథ్ రూ.700 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఈయన్ను ఛింద్వారా నుంచి మరోసారి కాంగ్రెస్ నామినేట్ చేసింది. లోక్‌సభ ఎన్నికల మొదటి దశ ఎన్నికలకు గాను మధ్యప్రదేశ్‌లో నామినేషన్లు వేసిన 113 మందిలో నకుల్ ఒకరు. 2019లో లోక్‌సభకు ఎన్నికైన 475 మంది కోటీశ్వరుల్లో నకుల్ నాథ్ మొదటి స్థానంలో ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తెలిపింది. గత అయిదేళ్లలో నకుల్ ఆస్తులు రూ.40 కోట్ల మేర పెరిగినట్లు ఏడీఆర్ విశ్లేషించింది.

డీకే సురేశ్ ఆస్తులు రూ.593 కోట్లు

బెంగళూరు: కాంగ్రెస్‌కు చెందిన బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ రూ.593 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్ సోదరుడైన సురేశ్ రూ.339 కోట్ల ఆస్తులున్నట్లు 2019 ఎన్నికలప్పుడు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీన్ని బట్టి, ఐదేళ్లలో ఈయన ఆస్తుల విలువ 75 శాతం మేర పెరిగినట్లు తెలుస్తోంది. మూడు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన సురేశ్ మరోసారి ఎన్నికల బరిలో ఉన్నారు.

6న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

జైపూర్: వచ్చే నెల ఆరో తేదీన జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను విడుదలచేయనుంది. ఆ రోజున జైపూర్‌లో జరిగే భారీ బహిరంగ సభలో పార్టీ అగ్రనేతలు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తారు. ఈలోపు ఈనెలాఖరున ఢిల్లీలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఇంకా ప్రకటించని లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేసి వారం దరి పేర్లను ప్రకటిస్తారు.



ఆళ్లగడ్డ నియోజకవర్గం మెట్టపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగ దంపతులు అపర్ణ, ఎస్.ప్రసాద్ ఎర్రగుంట్ల సభలో పాల్గొని తమకు ప్రభుత్వం వల్ల ఈ 58 నెలల్లో జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. ఇద్దరు సరిగ్గా నడవలేరు. వీరికోసం సీఎం వైఎస్ జగన్ మోకాలిపై కూర్చొని వారితో ఫొటో దిగారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్విటర్, ఫేస్‌బుక్‌లలో వేలల్లో షేర్‌లు, లక్షల్లో వ్యూస్‌తో దూసుకుపోతోంది. సీఎం వైఎస్ జగన్ మరోసారి తన మంచితనాన్ని చాటుకున్నారంటూ నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది.

వైరల్ వీడియో



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న కాశీం

కాశీం ఆకాంక్ష ఫలించింది

- సీఎంగా ఉన్నప్పుడు జగన్‌ను కలవాలని కోరిక
- ఆయన్ను కలసినప్పుడే చెప్పులు వేసుకుంటానని శపథం
- 14 ఏళ్ల ఎదురుచూపులకు నంద్యాల సభలో తెర

నంద్యాల (అర్బన్): ఓదార్పు యాత్రలో భాగంగా 2010లో ఈ ప్రాంతానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఆయన ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించాడు నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దూదేకుల కాశీం. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన్ను కలిసేంత వరకు చెప్పులు ధరించనని అప్పుడే స్నేహితులు, గ్రామస్తుల సమక్షంలో శపథం చేశాడు. సీఎం నంద్యాల సభలో అతని కోరిక నెరవేరింది. నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి సహకారంతో సభా వేదికపైకి వచ్చి సీఎం జగన్‌తో సెల్ఫీ దిగడంతో కాశీం ఆనందానికి అవధులు లేవు. చిన్నప్పటి నుంచి కాశీంకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే వల్లమాలిన అభిమానం. ఆయన అకాల మరణంతో కొన్నిరోజుల పాటు అన్నపానీయాలు మానేశాడు. అనారోగ్యంతో ఇబ్బందులు పడ్డాడు. వైఎస్సార్ తనయుడు ఓదార్పు యాత్ర చూసి ఉప్పొంగి పోయాడు. 14 ఏళ్ల అతని ఎదురుచూపులకు తెరపడిందని, ఓర్పుతో ఎదురుచూపులు చూసినదానికి ఫలితం దక్కిందని అతని స్నేహితులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు.



సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం (ఫైల్)



ఆదుకున్న సీఎంఆర్‌ఎఫ్..

నా కుమారుడికి చిన్న వయసులోనే గుండెకు రంధ్రం పడి పెద్ద ఆరోగ్య సమస్య తలెత్తింది. ఆపరేషన్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆపరేషన్ చేశారు. నా కుమారుడు బతికి బయట పడ్డాడంటే సీఎం జగన్ చలవే. ఆయనే మళ్లీ సీఎం కావాలి. – నాగరాజు, ఎర్రగుంట్ల

చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందాం

సెల్‌ఫోన్ ఉన్న ప్రతి కార్యకర్త ఓ ఎడిటర్, ఓ చానల్ ఓనర్

సోషల్ మీడియా ద్వారా ఎల్లో మీడియాను ఏకేద్దాం ● నంద్యాల బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

మేనిఫెస్టో అంటే ఎన్నికల తర్వాత చెత్తబుట్టలో వేసే సంస్కృతి చంద్రబాబుది. మనం మాట చెబితే బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి 99 శాతం హామీలు అమలు చేసి చూపించాం. ఈ మార్పుల్లో 10 శాతం లేదా 5 శాతం అయినా చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో తీసుకొచ్చారా? మనం చేసిన దాంట్లో కనీసం 5 శాతం చంద్రబాబు చేసి ఉంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5ల్లో, ఎల్లో మీడియా, ఆయన మనుషులు మా బాబుకు ఒకటి కాదు పది రంగాల్లో నోబెల్ ప్రైజులు, 4 ఆస్కార్‌లు, మెగసెసె అవార్డులు ఇవ్వాలనే వారు. యునైటెడ్ నేషన్స్ సెక్రటరీ జనరల్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు.. ఇద్దరూ కలిసి వచ్చి చంద్రబాబుకు శాలువా కప్పాలని ప్రచారం చేసేవారు.

ఈ ఎన్నికల్లో ఓటు వేసి మన ఐదేళ్ల ఇంటింటి ప్రగతిని వచ్చే ఐదేళ్లు కూడా ముందుకు తీసుకెళ్తూ కొనసాగించాలా? లేక చంద్రబాబుకు ఓటు వేసి పదేళ్లు వెనక్కు వెళ్లాలా? అనేది ప్రతి కుటుంబం ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఈ ఓటుతో మన తల రాతను మనమే రాసుకుంటున్నాం. మీకు, మీ కుటుంబానికి ఎవరి పాలనలో మంచి జరిగిందో ఓటు వేసే ముందు ఆలోచించండి. మంచి చేసిన మనకు ఈ ఎన్నికలు ఓ జైత్రయాత్ర అయితే, మోసం చేసిన బాబుకు చివరి ఎన్నికలు కావాలి. - సీఎం వైఎస్ జగన్



సభలో సీఎం జగన్ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్లను ఆన్‌చేసి మేము సిద్ధం అంటూ నినదిస్తున్న ప్రజలు

సాక్షిప్రతినిధి, కర్నూలు: పొత్తులు, జిత్తులు, ఎత్తులతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు మాటలను పొరపాటున కూడా నమ్మొద్దని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. విశ్వసనీయతకు, వంచనకు మధ్య.. ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ఈ ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సైనికులేనన్నారు. చీకటి రాతలు రాసేందుకు మనకు ఈనాడు, ఏబీఎన్, టీవీ-5.. ఇంకా ఇలాంటి వారు తోడు లేరని.. ఎల్లో ఛానెల్స్, పత్రికలను బాబులాగా పోషించలేదని చెప్పారు. అందువల్ల సెల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ మనకు ఒక ఎడిటర్ అని, ఒక ఛానల్ ఓనర్ అని దిశా నిర్దేశం చేశారు. సోషల్ మీడియా ద్వారా ఎల్లో మీడియాను ఎదుర్కోవాలని చెప్పారు. మనందరి ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రతి ఇంటా వివరించాలని కోరారు. పేదవాడి భవిష్యత్‌కు అండగా నిలబడేందుకు, మంచి చేసిన మన ప్రభుత్వానికి తోడుగా ఉండేందుకు, 175 ఎమ్మెల్యేలు, 25 ఎంపీలు గెలిపించేందుకు, రాష్ట్రం రూపు రేఖలు మార్చేందుకు మళ్లీ మనమంతా సిద్ధమై ఈ చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఓటుతో మన తల రాతను మనమే రాసుకుందామని చెప్పారు. 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేపట్టిన సీఎం జగన్ గురువారం ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించారు. జనం గుండెల్లో గుడి కట్టుకున్న మనల్ని ఎదుర్కొనేందుకు వారు జెండాలతో జత కట్టారని.. సంక్షేమాన్ని, ఇంటింటి అభివృద్ధిని కాపాడుకునేందుకు తరలి వచ్చిన ప్రజా సైన్యంతో నంద్యాల ఒక సముద్రంలా మారి 'సిద్ధం' అంటోందన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

డబుల్ సెంచరీ సర్కారును స్థాపిద్దాం

- గతంలో చంద్రబాబు అబద్ధాలు, మోసాల పాలన చూసిన తర్వాత.. అందుకు భిన్నంగా ఐదేళ్లుగా మన ప్రభుత్వం చేసిన మంచిని చూసిన తర్వాత.. ఒక నరకాసురుడు, రావణుడు, దుర్యోధనుడు మరోసారి పైకి లేచి తాము సింహాసనం ఎక్కుతామంటే ప్రజలు ఎలా ఒప్పుకోరో, అలాగే నారా వారి పాలన మళ్లీ తీసుకువస్తానంటే ఒప్పుకోం అంటూ నంద్యాల నుంచి ఏలూరు వరకు, కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజలంతా నినదిస్తున్నారు.
- ప్రజల రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, ఇంటింటి అభివృద్ధిని, మహిళ, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని కూలగొడతామని మూడు పార్టీలు చూస్తున్నాయి. వీరికి తోడు పరోక్షంగా మరో జాతీయ పార్టీ కూడా 'అదృశ్య హస్తం'గా తోడుగా ఉంది. ఇటువైపు చూస్తే జగన్ ఒకే ఒక్కడు. అటువైపు చంద్రబాబు, దత్తపుత్రుడు వీరికి తోడు బీజేపీ. పరోక్షంగా మరో పార్టీ కాంగ్రెస్. వీరు సరిపోనట్లు ఓ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5. ఇంతమంది కేవలం ఒకే ఒక జగన్‌ను ఎన్నుకునేందుకు సిద్ధమయ్యారు. వీరిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమా? (సిద్ధమే అని జనం నినాదాలు చేశారు).
- పేదవాడి భవిష్యత్తును వెలుగు నుంచి చీకటిలోకి తీసుకుపోదామని పొత్తులమారి, జిత్తుల మారి, ఎత్తులమారి పార్టీలన్నీ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి. ఆ కుట్రలను, కుతంత్రాలను ఎదుర్కొనేందుకు అందరం సిద్ధమవుదాం. మరోసారి ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేసి, వేయించి 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీలకు 25 స్థానాలు మొత్తంగా 200 స్థానాలు సాధించి డబుల్ సెంచరీ సర్కారును స్థాపించేందుకు సిద్ధమవుదాం.

విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం

- మీ జగన్ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో 77 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఏ ప్రభుత్వం తీసుకురాని మార్పులను తీసుకువచ్చాడని గర్వంగా చెబుతున్నా. మీ గ్రామంలోనే మార్పు కన్పిస్తోంది. ఈ రోజు గ్రామంలోకి, పట్టణంలోకి అడుగుపెట్టిన వెంటనే గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం.. అందులో పది మంది అదే ఊరి పిల్లలు పని చేస్తూ కనిపిస్తారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే సెలవైనా, ఆదివారమైనా వలంటీర్లు అవ్వాతాతల వద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నారు.
- రైతు భరోసా కేంద్రం, నాడు-నేడు ద్వారా మారిన ఇంగ్లిషు మీడియం స్కూళ్లు, విలేజ్ క్లినిక్‌లు కన్పిస్తాయి. బర్త్ సర్టిఫికెట్, పింఛన్, రేషన్‌కార్డు లాంటి ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి అందిస్తున్న పాలన మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న తర్వాతే జరుగుతోంది.
- రూ.2.70 లక్షల కోట్లు బటన్‌నొక్కి అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి రూపాయి లంచం, వివక్ష లేకుండా అర్హులకు పథకాలు అందించాం. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, సున్నావడ్డీ, విద్యాదీవెన, వసతి దీవెన, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, పింఛన్ కానుక, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, జగనన్నతోడు, చేదోడు, 31 లక్షల ఇళ్లపట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, చదువులకు అనుసంధానం చేస్తూ కళ్యాణమస్తు, షాదీతోఫా అందిస్తున్నాం.
- అక్కచెల్లెమ్మల ఫోన్‌లలో దిశ యాప్‌ను పెట్టాం. బటన్ నొక్కితే చాలు, ఆపదలో ఉంటే పది నిమిషాల్లో పోలీసులు నేరుగా వచ్చి ఆదుకుంటున్నారు.
- నాడు-నేడులతో ప్రభుత్వ బడులను మార్చింది.. గోరుముద్ద, విద్యాకానుక, ఇంగ్లిషు మీడియం, బైజూస్ కంటెంట్, పిల్లల బైలింగ్వల్ పుస్తకాలు, ట్యాబ్‌లు, తరగతి గదులో ఐఎఫ్‌బీ ప్యానల్స్, డిజిటల్ తరగతులు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లు, సీబీఎస్‌ఈ సిలబస్, ఐబీ ఇలాంటివన్నీ మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వచ్చాయి.

వైద్య, వ్యవసాయ రంగంలో సమూల మార్పులు

- వైద్య రంగంలో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏకంగా 54 వేల మంది డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది రిక్రూట్ అయ్యారు. నాణ్యమైన మందులు అందిస్తున్నాం. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం. నంద్యాలలోనూ మెడికల్ కాలేజీ కన్పిస్తోంది. ఆరోగ్యశ్రీని విస్తరించాం. ఏకంగా 2,300 రోగాలకు వర్తించేలా తీసుకెళ్లాం. రూ.25 లక్షల దాకా ఉచితంగా వైద్యం అందిస్తున్నాం.
- ఆపరేషన్ తర్వాత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెబితే, నెలకు రూ.5 వేల చొప్పున ఆరోగ్య ఆసరా ద్వారా సాయం చేస్తున్నాం. గ్రామ స్థాయిలో 10,600 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు కనిపిస్తున్నాయి. కొత్తగా 108, 104 వెహికల్స్ 1500 కొనుగోలు చేశాం. గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్‌లను డాక్టర్లతో అనుసంధానం చేశాం. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చాం. పేదవాడికి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నాం. ఇవన్నీ మీ బిడ్డ ప్రభుత్వంలోనే జరిగాయి.
- రైతన్నలకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.13,500 ఇస్తూ, ఈ ఐదేళ్లలో రూ.67,500 అందించాం. 10,778 ఆర్బీకేలు విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా రైతన్నకు తోడుగా పని చేస్తున్నాయి. పగటిపూటే 9గంటల నాణ్యమైన విద్యుత్, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, చంద్రబాబు మూసేసిన చిత్తూరు డెయిరీ లాంటివి తెరిపించాం. అమూల్ ద్వారా పాడి రైతులకు తోడుగా నిలవడం ద్వారా లీటర్‌పై రూ.10-20 దాకా అదనంగా వచ్చేలా చేశాం. 22-ఏ కింద నుంచి తొలగించి 19.17 లక్షల మంది రైతులకు 34.75 లక్షల ఎకరాల్లో పూర్తి హక్కులు కల్పిస్తున్నాం.

సామాజిక న్యాయంలో సువర్ణాధ్యాయం

- సామాజిక న్యాయం విషయంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించాం. తొలిసారి నామినేటెడ్ పదవుల్లో ఏకంగా చట్టం చేసి 50% పదవులు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చాం. మంత్రి మండలి నుంచి 68% పదవులు ఈ వర్గాలకు ఇచ్చాం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 4 లక్షల ఉద్యోగాలు ఉంటే.. ఇప్పుడు అదనంగా 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. వీటిలో 80 శాతం నా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఉన్నారు. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం. ఇందులో 75 శాతం పైగా ఈ సామాజిక వర్గాలకే అందాయి.
- అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులతో పాటు కొత్తగా 13 జిల్లాలు ఏర్పాటు చేశాం. 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశాం. రూ.16 వేల కోట్లతో 4 సీపోర్టులు, రూ.3,800 కోట్లతో పది షిషింగ్ హార్బర్‌లు కడుతున్నాం. రాష్ట్రంలో 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలు కన్పిస్తున్నాయి. 11 వేల ఆర్బీకేలు ఉన్నాయి. 11 వేల విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇదంతా రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని ఘట్టం.

చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయారు?

- మనం చేసిన మంచిలో కనీసం 5 శాతం అయినా చంద్రబాబు చేసి ఉంటే.. ఇదే ఎల్లో మీడియా చంద్రబాబు కంటే మరో నాయకుడు ప్రపంచంలో లేరని ఢంకా బజాయించేవారు. మీ బిడ్డకు దక్కిన బహుమతి ఏదో తెలుసా! పేదల గుండెల్లో సంతోషం. వారి మనసుల్లో ఆత్మవిశ్వాసం, పిల్లల చదువుల్లో విప్లవం, వారి కుటుంబాల్లో సాధికారత, అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు.. ఇవీ జగన్‌కు కావల్సిన అవార్డులు, రికార్డులు. వీటి కోసమే జగన్ ఆరాట పడతాడు. ప్రయాస పడతాడు.
- 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. ఆయన వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని మాత్రం అందరికీ తెలుసు. బాబు పేరు చెబితే వ్యవసాయం దండగ, బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు, రుణామాఫీ అని రైతులను నిలువునా ముంచేయడం, బాబు వస్తే కరువొస్తుందనే నానుడి, రెయిన్‌గన్‌తో కరువును జయించిన ఓ పిట్టలదొర గుర్తుకు వస్తాడు. ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలనే మాటలు గుర్తుకు వస్తాయి.

ఇందులో ఒక్కటైనా నెరవేర్చారా?

- ఈ కరపత్రంలో చంద్రబాబు సంతకం ఉంది. మోదీ ఫొటో ఉంది. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఫొటో ఉంది. 2014లో ఈ కరపత్రంతో పాటు ఇందులోని హామీలను టీవీల్లో ఊదరగొట్టారు.
- రైతుల రుణమాఫీపై తొలి సంతకం చేస్తానన్నాడు. రూ.87,612 కోట్లు, రైతుల రుణమాఫీ చేశాడా?
- డ్వాక్రా రుణాలు పూర్తిగా రద్దు చేస్తానన్నారు. రూ.14,205 కోట్లు. ఒక్కరూపాయి అయినా చేశారా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తానన్నారు. మీ ఇంట్లో లేదా పక్కింట్లో పుట్టిన ఏ ఆడబిడ్డకైనా డిపాజిట్ చేశారా?
- ఇంటింటికీ ఉద్యోగం.. లేదంటే రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తానన్నారు. 60 నెలల్లో ప్రతి కుటుంబానికి 1.20 లక్షలు ఇవ్వాలి. ఇచ్చారా?
- అర్హులైన వారందరికీ 3 సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు ఇస్తానన్నారు. ఒక్కరికైనా ఒక సెంటయినా ఇచ్చారా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత పవర్ లూమ్స్, మహిళల రక్షణ కోసం ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్, సింగపూర్‌కు మించి రాష్ట్రం అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నారు. ఈ హామీలన్నీ 2014లో మోదీ, చంద్రబాబు, దత్తపుత్రుడి ఫోటోతో పంపారు. ఇందులో ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా? ప్రత్యేక హోదా ఇచ్చారా? (లేదు.. లేదు.. అని ప్రజలు నినాదాలు) ఇవన్నీ ఇవ్వకపోగా సూపర్ సిక్స్.. సెవెన్ అంటూ రంగురంగుల మేనిఫెస్టోతో మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తారట.

బాబు ధ్యాసంతా దోచుకోవడమే..

'రాజకీయాల్లో నాయకుడు అంటే 'అదిగో మా నాయకుడు' అని కాలర్ ఎగరేసుకుని చెప్పేలా ఉండాలి. విలువలు, విశ్వసనీయత అనే పదానికి అర్థం ఉండాలి. మోసం చేయడానికి, కుర్చీ ఎక్కడానికీ, ఏ గడ్డి అయినా తినేందుకు సిద్ధంగా ఉండే నాయకులు ఈ రాష్ట్రానికి కావాలా? ఇవాళ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ. లక్షలు కన్పిస్తాయి. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు మీ బిడ్డ మీ ఖాతాల్లో జమ చేశాడని గర్వంగా చెబుతున్నా. చంద్రబాబు ఇలా ఎందుకు చేయలేదంటే.. ఆయన ధ్యాసంతా దోచుకోవడం, పంచుకోవడమే. మంచి జరిగింది మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే. మంచి చేసిన జగన్ మీ అందరిని నమ్ముకుని ఎన్నికల బరిలో ఉంటే, చెడు చేసిన బాబు పొత్తులు, కుట్రలు, మోసాల్ని నమ్ముకుని రాజకీయం చేస్తున్నారు' అని సీఎం జగన్ అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు బుగ్గన రాజేంద్రనాథ్, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధీర్, కాటసాని రామిరెడ్డి, బుగ్గన, శిల్పా చక్రపాణిరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ముఖాముఖికి హాజరైన జనసందోహంలో ఓ భాగం

పేదల తలరాతలు మార్చే ఎన్నికలివి

ఎర్రగుంట్లలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం జగన్



ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం

సాక్షి, నంద్యాల: వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో గ్రామాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయని, ఈ ఎన్నికలు పేదల తలరాతలను మార్చే ఎన్నికలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఇవాళ మన ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు మారాయి. సర్కారు స్కూళ్లలో డిజిటల్ బోధన వచ్చింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశాం. వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామాన్ని జల్లెడ పడుతూ పేదవాడికి ఆరోగ్య పరీక్షలతోపాటు మందులు కావాలన్నా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నాం' అని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందజేస్తున్నామన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆళ్లగడ్డలోని రాత్రి బస ప్రాంతం నుంచి గురువారం ఉదయం మొదలైంది. అక్కడి నుంచి సీఎం జగన్ ఉదయం 11 గంటల సమయంలో ఎర్రగుంట్ల గ్రామానికి చేరుకుని రైతులు, వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు తెన్నుల ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యవస్థనూ మార్చుకుంటూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని, ఈ మార్పు కొనసాగడం ఎంత అవసరమో అందరూ ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు. ఆయనేమన్నారంటే..

చిన్న పిల్లాడు చేసిన పనులు.. మీరెందుకు చేయలేదు?

నేను చాలా చిన్న పిల్లాడిని. మన ప్రభుత్వం కంటే ముందు మీరు చాలా ప్రభుత్వాలను చూశారు. నాకన్నా వయసులో పెద్దోళ్లు, ఎంతో అనుభవం ఉందని గొప్పలు చెప్పుకునే వారు ముఖ్యమంత్రులుగా పని చేశారు. మరీ ముఖ్యంగా రాష్ట్రం విడిపోయాక నా కంటే ముందు 75 ఏళ్ల ముసలాయన పరిపాలన చేశారు. ఆయన ఏకంగా 14 ఏళ్లు పాలించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నేను వయసులో ఆయన కంటే చాలా చిన్నోడిని. నేను ఒకటే అడుగుతున్నా. ఇంత చిన్నోడు చేసిన పనులను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఏనాడైనా చేశారా? మీరంతా దీనిపై ఆలోచన చేయాలి. ఈ రోజు ఏ రకంగా మన బతుకులు, జీవితాలు మారాయి? ఏ రకంగా వ్యవస్థల్లో మార్పులు తేగలిగాం? అనే విషయాలను అందరూ ఒక్కసారి గమనించాలని కోరుతున్నా.

మీ కుటుంబంతో చర్చించండి..

గత ఎన్నికల్లో నాకు ఓటు వేయని వారిని కూడా అడుగుతున్నా. రకరకాల కారణాలతో నాకు ఓటు వేయకపోయి ఉండొచ్చు. అయితే ఓటు వేయలేదని వివక్ష చూపించలేదు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధిని అందజేస్తున్నాం. ఈ రోజు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు వచ్చాయి. విద్యార్థులకు డిజిటల్ బోధన అందిస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ఒకవైపు ఇంగ్లిష్, మరో వైపు తెలుగు మీడియంతో ప్రచురించిన పుస్తకాల ను పిల్లలకు అందజేస్తున్నాం. వీటితో పాటు విద్యా ర్థులకు ట్యాబ్‌లు కూడా ఉచితంగా ఇస్తున్నాం. మీరంతా ఒక్కసారి ఇంటికి వెళ్లి ఆలోచన చేయండి. ఈ ప్రభుత్వంలో సాకారమైన మార్పులను గమనించండి. ఇది కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకునే ఎన్నిక కాదు. మన భవిష్యత్తు కోసం ఓటు వేస్తున్నాం. అందరూ ఇంటికి వెళ్లాక ఒక్కసారి మీ భార్య, పిల్లలు, ఇంట్లో అవ్వాతాతలతో మాట్లాడండి. అందరూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకోండి. ఈ ఎన్నికలు పేదల తలరాతలను మార్చే ఎన్నికలు.

మేడిగడ్డ డిజైన్లలో వైరుధ్యాలెందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

కోరింది. ''కాఫర్ డ్యామ్ నిర్మాణంలో భాగంగా నది గర్భంలో పాతిన షీట్‌పైల్స్‌ను మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తిగా తొలగించారా? లేదా? కుంగిపోయిన ఏడో బ్లాక్ పునాదులకు ఎదురుగా కొంతభాగంలో షీట్‌పైల్స్‌ను అలానే వదిలేశారా? అక్కడ భూమి కోతకు గురికావడానికి ఇదే కారణమా?'' అని నిలదీసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం జరిపి, పరిష్కారాలను సూచించడానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల రాష్ట్రంలో రెండోసారి పర్యటించిన కమిటీ.. 52 ప్రశ్నలతో సీడీవో విభాగానికి ప్రశ్నావళి అందించి, త్వరగా బదులివ్వాలని కోరింది.

ర్యాఫ్ట్, సెకెంట్ పైల్స్ మధ్య జాయింట్లపై ఫోకస్

మేడిగడ్డ బ్యారేజీల పునాది (ర్యాఫ్ట్), సెకెంట్ పైల్స్ మధ్య జాయింట్లకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణంపై అయ్యర్ కమిటీ ప్రధాన దృష్టిసారించింది. బ్యారేజీల్లో లోపాలకు ఇవి కూడా ముఖ్యకారణం కావచ్చన్న చర్చ ఉంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఎగువ/దిగువ కటాఫ్‌లు–ర్యాఫ్ట్‌ల మధ్య జాయింట్లకు సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను అందించాలని సీడీవోను కమిటీ కోరింది. ''జాయింట్లలో లాకింగ్ ఏర్పాట్లున్నాయా? బ్యారేజీలకు రక్షణ కల్పించాల్సిన అప్రాన్ దెబ్బతిని ర్యాఫ్ట్ కుంగిపోతే, సెకెంట్ పైల్స్–ర్యాఫ్ట్ మధ్య జాయింట్లు విరిగిపోవా? మేడిగడ్డ బ్యారేజీ ర్యాఫ్ట్ 2.5 మీటర్ల మందం ఉంటే.. ర్యాఫ్ట్–సెకెంట్ పైల్స్ మధ్య జాయింట్‌గా వేసిన శ్లాబు మందం 1.5 మీటర్లు మాత్రమే ఉంది. నీటి ఒత్తిడిని జాయింట్ ఎలా తట్టుకుంటుంది?.'' అని ప్రశ్నించింది. దృఢమైన రాతిపై కటాఫ్‌వాల్స్‌ను నిర్మిస్తే.. ర్యాఫ్ట్ కుంగిపోయేందుకు ఉన్న అవకాశాలను ఊహించలేదా? అని అడిగింది. బ్యారేజీలను తేలియాడే కట్టడాలుగా డిజైన్ చేశారా? స్థిరంగా ఉండేలా చేశారా అని ప్రశ్నించింది.

సీడీవోలో ఎవరేం చేస్తారు?

సీడీవోలో చీఫ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారాల శ్రేణి, బాధ్యతలను, విభాగం నిర్మాణ క్రమాన్ని తెలపాలని కమిటీ కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పనలో సీడీవో పాత్ర, ఇతర వివరాలు ఇవ్వాలని అడిగింది. ''బ్యారేజీలకు పరీక్షలను సంతృప్తికర స్థాయిలో జరిపారా? మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్వెస్టిగేషన్లు చేశారా? లోటుపాట్లు ఏమైనా గుర్తించారా?'' అని ప్రశ్నించింది. డీపీఆర్, ఆ తర్వాత నిర్మాణ దశల్లో ప్రతి బ్యారేజీ విషయంలో నిర్వహించిన సబ్ సర్ఫేస్ జియోలాజికల్/జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ల వివరాలను అందించాలని కోరింది.

డిజైన్ ఉల్లంఘనలేమిటి ?

సీడీవో కన్‌స్ట్రక్షన్ డ్రాయింగ్స్‌ను ఉల్లంఘించి ప్రాజెక్టు నిర్మాణ విభాగం జరిపిన నిర్మాణాలేమిటో తెలపాలని నిపుణుల కమిటీ కోరింది. లేఖలు/సవరణ డ్రాయింగ్స్ ద్వారా ఆ ఉల్లంఘనలకు తర్వాతి కాలంలో అనుమతి ఇచ్చారా? ఇస్తే ఆ సవరణ డ్రాయింగ్స్ జాబితా ఇవ్వండి అని అడిగింది. ''సీడీవో కన్‌స్ట్రక్షన్ డ్రాయింగ్స్ జారీ చేయడానికి ముందే నిర్మాణ సంస్థలు పనులు ప్రారంభించాయా? దీనివల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో డ్రాయింగ్స్‌ను మళ్లీ సవరించాలనే ఒత్తిడిని సీడీవో ఎదుర్కోవాల్సి వచ్చిందా? బ్యారేజీల నిర్మాణానికి పరిశీలించిన ప్రత్యామ్నాయ స్థలాలేవి? ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు'' అని ప్రశ్నించింది. బ్యారేజీల గేట్ల నుంచి విడుదలయ్యే వరదతో దిగువన భూమి కోతకు గురవకుండా తగిన మోతాదులో నీరుండేలా టెయిల్ పాండ్‌ను డిజైన్ చేశారా అని.. నిబంధనల ప్రకారమే గేట్లను ఆపరేట్ చేశారా? వివరాలు ఇవ్వాలని కోరింది.

చంద్రబాబుకు అమ్ముడుపోయిన మంద కృష్ణకు బుద్ధిచెబుతాం

ఏపీ మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల ధ్వజం

సాక్షి, అమరావతి: వర్గీకరణ పేరుతో ముప్పై ఏళ్లుగా మాదిగలకు వెన్నుపోటు పొడుస్తున్న మంద కృష్ణ ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబుకు తమ జాతిని తాకట్టు పెట్టడానికి సిద్ధమవుతాడని మాదిగ సంఘాలు మండిపడ్డాయి. చంద్రబాబుకు ప్యాకేజీకి అమ్ముడుపోయిన మంద కృష్ణ ఈ నెల 30న గుంటూరులో జరిగే సభకు ఎలా వస్తాడో చూస్తామని హెచ్చరించాయి. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. రాష్ట్రంలోని 25 మాదిగ సంఘాల నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మనువాద బీజేపీ, మోసకారి చంద్రబాబు కూటమికి ఎందుకు ఓటెయ్యాలని పలువురు మాదిగ సంఘాల నేతలు ప్రశ్నించారు. మనువాద విష కౌగిలికి మాదిగలను చేర్చేందుకు మంద కృష్ణ ప్రయత్నిస్తున్నాడని, చంద్రబాబుతో అక్రమ సంబంధం నెరపుతున్నాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తానని హామీ ఇచ్చిన బీజేపీ పదేళ్లు అయినా పట్టించుకోలేదని, వర్గీకరణను అడ్డుపెట్టుకుని చంద్రబాబు మాదిగల ఓట్లతో రాజకీయ లబ్ధి పొందుతున్నాడని మండిపడ్డారు. ఇకపై మంద కృష్ణ ఆటలు సాగనివ్వబోమని, అతని ఎత్తులను తిప్పి కొడతామన్నారు

కూటమిలో వేరు కుంపట్లు

స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి సీనియర్ నాయకులు

- హిందూపురం ఎంపీగా పరిపూర్ణానందస్వామి పోటీ?
- రాప్తాడు బరిలో నిలిచేందుకు వరదాపురం సూరి సన్నాహాలు
- కదిరిలో కూటమికి దూరంగా విష్ణువర్ధన్‌రెడ్డి వర్గం
- ధర్మవరంలో సత్యకుమార్‌కు పరిటాల శ్రీరామ్‌కు మధ్య దూరం
- పుట్టపర్తిలో కనిపించని 'గ్లాసు', 'కమలం'

మరిన్ని వివరాలు వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కాపులను విస్మరించిన బీజేపీకి గుణపాఠం చెబుతాం

కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితర కాపు ఉపకులాలను పూర్తిగా విస్మరించిన బీజేపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాపు ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, రాష్ట్ర కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ గురువారం బహిరంగ లేఖ విడుదల చేశారు. పురందేశ్వరి, చంద్రబాబు కలిసి కాపులకు చేసిన అన్యాయాన్ని ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు మెయిల్ ద్వారా తెలియజేశామన్నారు. బీజేపీ రాష్ట్రంలో టీడీపీకి బీ టీమ్‌గా మారిపోయిందని ఆరోపించారు. బీజేపీ పోటీ చేస్తున్న ఆరు ఎంపీ, పది అసెంబ్లీ స్థానాల్లో కనీసం ఒక్కటి కూడా కాపులకు కేటాయించకపోవడం దారుణమన్నారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్టు



రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

అబిడ్స్: హోలీ పండుగ రోజు చెంగిచెర్లలో దాడికి గురైన బాధితులను పరామర్శించడానికి వెళ్లనున్నట్లు ప్రకటించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా హౌస్ అరెస్టు చేశారు. గురువారం ఉదయమే గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో ధూల్‌పేటలోని రాజాసింగ్ ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ తరహాలోనే ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. హిందువులపై పోలీసుల వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. చెంగిచెర్లలో హిందువులపై దాడులు చేసినా బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు.

బీజేపీ నేతలపై అక్రమ కేసులు ఎత్తేయాలి

బండి సంజయ్‌పై కేసులు, రాజాసింగ్ హౌస్ అరెస్ట్‌ను ఖండించిన కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: చెంగిచెర్ల ఘటనలో బాధితుల పరామర్శకు వెళ్లిన తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌తోపాటు పలువురు కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఖండించారు. అలాగే ఎమ్మెల్యే రాజాసింగ్‌ని హౌస్ అరెస్టు చేయడంపై మండిపడ్డారు. చెంగిచెర్లలోని అక్రమ స్లాటర్ హౌస్‌ను తొలగించి, తమ నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని, స్థానికులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ పాలన అంటే మతోన్మాదాన్ని ప్రోత్సహించడమేనా అని గురువారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. దాడికి గురైనవారిపై కేసులు పెట్టడం సమంజసం కాదని రాష్ట్ర సర్కారు, పోలీసుల తీరుపై ధ్వజమెత్తారు. హోలీ పండుగ రోజు చెంగిచెర్లలో జరిగిన దాడిలో పలువురు మహిళలు, యువత గాయపడ్డారని తెలిపారు. చెంగిచెర్లలో బారికేడ్లు పెట్టి మరీ స్లాటర్ హౌస్ నడుపుతున్న మాఫియాకు పోలీసులు వంతపాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కేసులకు భయపడే ప్రసక్తే లేదు: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: అక్రమ కేసులతో బీజేపీని భయపెట్టలేరని, తమ సహనాన్ని చేతకాని తనంగా భావించొద్దని, తాను కేసులకు భయపడే ప్రసక్తే లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. కేసుల పేరుతో రోహింగ్యాల దాడిని తప్పుదారి పట్టించే కుట్ర జరుగుతోందని గురువారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చెంగిచర్ల బాధితుల పరామర్శకు వెళ్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు గృహ నిర్బంధంలో పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వానికి దమ్ముంటే చెంగిచర్లలో రోహింగ్యాలు చేస్తున్న మాఫియా దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినా పట్టించుకోరా? పేదలకు భరోసా కల్పించేందుకు వెళుతున్న వారిని అడ్డుకునేందుకు బ్యారికేడ్లు పెట్టడమేంటని ప్రశ్నించారు. తనతోపాటు చెంగిచర్ల వచ్చిన బీజేపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు.


నిరుద్యోగ 'యువ భారత్'

83 శాతం మంది వారే.. 2000తో పోల్చితే 2022లో రెండింతలు పెరిగిన నిరుద్యోగులు

అటాచ్‌మెంట్లతో ఈ- మెయిల్స్ కూడా పంపలేని దుస్థితి...

తెలంగాణ నిరుద్యోగుల్లో అమ్మాయిలే ఎక్కువ

ఐఎల్‌ఓ, ఐహెచ్‌డీ సంయుక్తంగా వెల్లడించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 చెబుతున్నది ఇదే..



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగయువత అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. భారత్‌లోని నిరుద్యోగుల్లో 83 శాతం యువతే ఉండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాథమికోన్నత విద్య (సెకండరీ) లేదా ఆపై ఉన్నతవిద్య (హయ్యర్) అభ్యసించిన యువత నిష్పత్తి క్రమంగా పెరుగుతోంది. వీరి శాతం 2000లో 35.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 65.7 శాతానికి (నిరుద్యోగుల శాతం) పెరిగింది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డీ) సంయుక్తంగా రూపొందించి తాజాగా విడుదల చేసిన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024లో అనేక అంశాలు వెల్లడయ్యాయి. 2000–2019 సంవత్సరాల మధ్య యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు (అండర్ ఎంప్లాయ్‌మెంట్) తగ్గడం వంటివి భారీగా పెరగగా, కోవిడ్ సందర్భంగా మాత్రం కొంత తగ్గుదల నమోదైనట్టుగా ఈ నివేదిక పేర్కొంది. 2000–2019 మధ్యలో యువత నిరుద్యోగిత శాతం దాదాపు మూడింతలు (5.7 – 17.5 శాతం) పెరిగింది. 2022 నాటికి అది 12.4 శాతానికి తగ్గింది' అని ఈ నివేదిక చీఫ్ ఎకనమిక్ అడ్వయిజర్ వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు.

తెలంగాణ విషయానికొస్తే...

సెకండరీవిద్య, ఆపై ఉన్నత చదువులు చదివినా తెలంగాణకు చెందిన యువత ఎక్కువగా నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నట్టుగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024లో నివేదిక వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం...

- 15–29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 30.3 శాతం అమ్మాయిలు, 18.3% అబ్బాయిలు (మొత్తం 48.6%) నిరుద్యోగులుగా ఉన్నారు. అదే జాతీయ స్థాయిలో ఇదే కేటగిరిలో చూస్తే 65.7 శాతంగా ఉంది.
- రాష్ట్రంలో 2005 నుంచి యువతలో నిరుద్యోగిత శాతమనేది క్రమంగా పెరుగుతోందని ఈ నివేదిక తెలిపింది. 2005లో చూస్తే.. యువతలో 14.1నిరుద్యోగ శాతం ఉండగా, 2012కల్లా 14.9 శాతానికి, 2019 కల్లా 34.9 శాతానికి చేరుకుంది.
- అదే 2022 సంవత్సరంలో 21.7శాతానికి తగ్గుముఖం పట్టింది. అయితే 2022లో అమ్మాయిలతో పోల్చితే అబ్బాయిల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా సాధించారు. నిరుద్యోగిత శాతం అబ్బాయిల్లో 18.3 శాతం ఉండగా, అమ్మాయిల్లో అది 30.3 శాతంగా ఉంది.
- 2022లో రాష్ట్రంలో 27.5% మంది యువత 'నాట్ ఇన్ ఎంప్లాయిమెంట్, ఎడ్యుకేషన్ ఆర్ ట్రెనింగ్' (నీట్) కేటగిరిలో ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. 2005 నుంచి 2019 మధ్యలో అది 17.9 శాతం నుంచి 34 మధ్యలో ఉంది.
- రాష్ట్రంలో పదిహేనేళ్లకు పైబడిన క్యాజువల్ వర్కర్ల నెలవారీ వేతనం విషయానికొస్తే...2022లో మగవారిది రూ.10,175గా, మహిళలది రూ.6,642గా ఉంది.

మనోళ్ల టెక్ స్కిల్స్ అంతంతే...

దేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే తెలంగాణ సాంకేతికంగా, టెక్ స్కిల్స్‌లో ఉన్నతస్థాయిలో నిలుస్తుందని అనుకుంటాం. కానీ...

- దాదాపు 90 శాతం యువత ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ఉపయోగించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ లేదా కంప్యూటర్ ప్రోగ్రామ్ కూడా రాయలేకపోతున్నారు.
- అధికశాతం విద్యార్థులకు ఎమ్మెస్ ఎక్సెల్ తదితర అప్లికేషన్లలో విస్తృతమైన పరిజ్ఞానం, అవగాహన లేదు.
- 50 శాతానికి పైగా యువత అటాచ్‌మెంట్‌తో కూడిన ఈ–మెయిల్‌ను కూడా పంపించలేకపోతున్నారు.
- 53.83 శాతం యువత కాపీ చేసి ఫైల్‌ను మూవ్ చేయగలుగుతున్నారు.
- 50.4 శాతం మంది ఏదైనా ఫైల్‌ను కాపీ, పేస్ట్ చేయగలుగుతున్నారు.
- కేవలం 14.7 శాతం మాత్రమే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎలక్ట్రానిక్ ప్రజెంటేషన్ చేస్తున్నారు.

నిపుణులు ఏమంటున్నారంటే...


- తెలంగాణలోని అనేక స్కూళ్లలో కంప్యూటర్ ల్యాబ్‌లున్నా, సాంకేతిక అంశాలు బోధించే టీచర్లు, టెక్ నైపుణ్యం ఉన్నవారు లేకపోవడమే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశాలన్నింటిని కూడా పాఠశాల బోధనాంశాల్లో చేర్చితేనే ప్రయోజనం ఉంటుందని వారు చెబుతున్నారు.

'మౌలికం'పైనే అత్యధిక సైబర్ పంజా..

- ప్రపంచంపై ఆధిపత్యం కోసం ఒకప్పుడు ప్రచ్ఛన్న యుద్ధాలు జరగ్గా ఆ తర్వాత కాలంలో కూటములుగా ఏర్పడి దేశాలు కొట్టుకొనేవి. ప్రస్తుతం ప్రపంచమంతా డిజిటల్‌మయంగా మారడంతో ఆయా దేశాలు కూడా పంథా మార్చాయి. వివిధ రంగాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ప్రభుత్వపరంగా లేదా తమ అనుబంధ గ్రూపుల ద్వారా సైబర్‌యుద్ధాలకు తెగబడుతున్నాయి. అంతర్జాతీయ వార్తాసంస్థ రాయిటర్స్ ఇటీవలి కథనం ప్రకారం.. తమ దేశాలకు చెందిన రక్షణరంగ కాంట్రాక్టర్లు సహా నిరసనకారులు, వివిధ కంపెనీలపై పదేళ్లకుపైగా గూఢచర్యానికి పాల్పడ్డారంటూ చైనా ప్రభుత్వంతో సంబంధాలున్న ఓ హ్యాకింగ్ గ్రూప్‌లోని ఏడుగురిపై అమెరికా, బ్రిటన్ అభియోగాలు నమోదు చేశాయి.

యూరోపియన్ రిపోసిటరీ ఆఫ్ సైబర్ ఇన్సిడెంట్స్ అనే సంస్థ గణాంకాల ప్రకారం రాజకీయ ఎజెండాతో కొందరు అత్యధికంగా లక్ష్యంగా చేసుకొనేది ఇంధన, టెలికమ్యూనికేషన్లు, వైద్యం, రవాణా తదితరాలతో కూడిన కీలక మౌలికవసతుల రంగాన్నే. 2023లో ఈ రంగంపై ఏకంగా 500 సైబర్ దాడులు జరిగాయి. మొత్తంమీద 2023లో రాజకీయ కోణంలో జరిగిన సైబర్ దాడుల సంఖ్య 895. సాధారణ కంపెనీలపై సైబర్ దాడులు డేటా చోరీ లేదా ఆర్థిక నష్టాలకు దారితీస్తాయి. కానీ విద్యుత్ కేంద్రాలు, టెలికమ్యూనికేషన్ల వంటి కీలక మౌలికవసతులపై దాడులు జాతీయ భద్రతకు ముప్పుగా మారతాయి. అందుకే సైబర్ భద్రత అత్యవసరం కావడమే కాకుండా లాభదాయక, పోటీ మార్కెట్‌గా మారింది. స్టాటిస్టా మార్కెట్ ఇన్‌సైట్స్, ఐడీసీ సహా మరికొన్ని సంస్థల అంచనా ప్రకారం 2023లో సైబర్ భద్రతపై యావత్ ప్రపంచం సుమారు రూ. 13 లక్షల కోట్ల నుంచి రూ. 18 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఇది వచ్చే ఐదేళ్లలో భారీగా పెరగనుంది. – సాక్షి, సెంట్రల్ డెస్క్

కీలక మౌలికవ్యవస్థలే ప్రధాన లక్ష్యం | **వివిధ రంగాలను దెబ్బతీయడమే లక్ష్యంగా జరిగిన రాజకీయ ప్రేరేపిత సైబర్‌దాడుల సంఖ్య ఇలా..**



వారి చావుకు కారణమయ్యానన్న నింద భరించలేను

మనవడి పెళ్లి ఆగిందని తాత ఆత్మహత్య



పెంటయ్య

పాపన్నపేట(మెదక్): మనవడి పెళ్లి ఆగడంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం పెళ్లి కూతురును తీసుకొచ్చేందుకు బయలుదేరిన పెళ్లి బృందం ట్రాక్టర్ సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పరిధిలో బోల్తాపడి బాచారం గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పెళ్లి ఆగిపోయింది. ఈ నేపథ్యంలో తన ఇంట పెళ్లి వేడు కలకు పిలిచి, ముగ్గురు మహిళల చావుకు కారణమయ్యానన్న నిందను మోసే శక్తి తనకు లేదని తీవ్ర మనస్తాపం చెందిన వరుడి తాత సొంగ పెంటయ్య (64) గురువారం తెల్లవారుజామున తన ఇంట్లోని బాత్ రూంలో ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. కాగా, సాయంత్రం పెంటయ్యతో పాటు, రోడ్డు ప్రమాదంలో మరణించిన ముగ్గురు మహిళల అంత్యక్రియలు ముగిశాయి. పెళ్లి బాజాలు మోగాల్సిన చోట.. చావు డప్పులు వినిపించడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

గన్ మిస్‌ఫైర్.. సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

కోల్‌కతాలో ఘటన.. మృతుడు మహబూబ్‌నగర్ జిల్లావాసి



హన్వాడ: కోల్‌కతాలో గన్ మిస్‌ఫైర్ అయ్యి ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల పరిధిలోని వేపూర్‌కి చెందిన చాకలి విష్ణు(28) మూడేళ్ల కిందట సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. విష్ణు ఇటీవల తన శిక్షణ పూర్తి చేసుకొని కోల్‌కతాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అక్కడి ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలోని సరిహద్దులో విధులకు వెళ్లేందుకు గురువారం ఉదయం విష్ణు సిద్ధమయ్యాడు. తన రైఫిల్‌ను శుభ్రం చేసుకునే క్రమంలో గన్ మిస్‌ఫైర్ అయ్యి అతని శరీరంలోకి బుల్లెట్ దూసుకెళ్లి.. మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. విష్ణు మృతదేహాన్ని కోల్‌కతా నుంచి తీసుకొచ్చేందుకు గురువారం రాత్రి ఆయన సోదరుడు శేఖర్ ఇక్కడి నుంచి బయలుదేరివెళ్లాడు. మృతుడు విష్ణుకు వివాహం కాలేదు. తండ్రి కృష్ణయ్య పదేళ్ల కిందట చనిపోగా..తల్లి అంజిలమ్మ, తమ్ముడు శేఖర్ ఉన్నారు.

కట్టేసి, కారం చల్లి.. వేడినీరు పోసి, రోకలిబండతో బాది..

కుటుంబ కలహాలతో భర్తను కిరాతకంగా చంపిన భార్య సహకరించిన మరో ఇద్దరు.. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘటన



కరీంనగర్ క్రైం: కుటుంబ కలహాలతో భర్తను అతికిరాతకంగా కడతేర్చిందో భార్య. తాళ్లతో కట్టేసి, కారంపొడి చల్లి, వేడినీళ్లు పోస్తూ.. రోకలిబండతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఆదర్శనగర్‌కు చెందిన తోట హేమంత్(39)కు 2012లో రోహితితో వివాహమైంది. వారికి ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. హేమంత్ పెట్రోల్‌బంక్‌లో పనిచేసి మానేశాడు. రోహితి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పేషెంట్ కేర్‌గా పనిచేస్తోంది. దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం గొడవ తీవ్రమైంది. దీంతో రోహితి హేమంత్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం ఆస్పత్రిలో పనిచేసే నవీన్, సాయికుమార్ సాయం కోరింది. బుధవారం రాత్రి వారిని ఇంటికి పిలిచింది. వారు ఇంటికి వచ్చి గేటు, ఇంటి తలుపులు మూసేశారు. ముగ్గురూ కలిసి హేమంత్‌ను తాళ్లతో కట్టేశారు. కళ్లలో కారం కొట్టారు. అనంతరం నవీన్, సాయికుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తరువాత రోహితి హేమంత్ శరీరంపై వేడినీళ్లు పోస్తూ.. రోకలిబండతో విచక్షణరహితంగా దాడి చేసింది. తల, మర్మాంగాలపై దాడి చేయడంతో రక్తస్రావం జరిగి స్పృహ కోల్పోయాడు. దీంతో రోహితి అంబులెన్స్‌కు ఫోన్ చేసింది. అర్ధరాత్రి దాటిన తరువాత ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. హేమంత్ తల్లి విమల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులనూ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కన్నతల్లి కళ్లెదుటే..: తన కళ్లెదుటే హేమంత్‌ను కొట్టారని, కొట్టొద్దని బ్రతిమిలాడినా వినలేదని విమల రోదించింది. వేడినీళ్లు, కారంపొడి పోస్తూ దాడి చేశారని, ముగ్గురు పిల్లలున్నారు వద్దన్నా వినకుండా చంపేశారని భోరుమంది. పథకం ప్రకారమే హేమంత్‌ను నిందితులు చంపారని బంధువులు ఆరోపించారు. బుధవారం ఉదయం నుంచి నవీన్, సాయికుమార్ పలుమార్లు ఫోన్ చేశారని హేమంత్ తమకు చెప్పాడన్నారు. ఈ క్రమంలోనే రాత్రి ఇంటికి వచ్చి పథకం ప్రకారం దాడిచేసి చంపారని ఆరోపించారు.

కేసీఆర్ కుటుంబసభ్యుల పాస్‌పోర్టులు సీజ్ చేయాలి

కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలు బయటపడుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు దేశం విడిచిపోకుండా పాస్‌పోర్టులను సీజ్ చేయాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఫోన్ ట్యాపింగ్‌లో 600 లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఈ కేసులో ఇంకా ఎన్నో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని తెలిపారు. షకీల్ కుమారుడు విదేశాలకు పారిపోయినట్లు వీరు కూడా పారిపోయే అవకాశం ఉందన్నారు. పేదలకు ఇచ్చే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల వ్యవహారంలో మాజీమంత్రి హరీశ్‌రావు కార్యాలయ సిబ్బంది తమ సొంతానికి వాడుకోవడం దారుణమన్నారు.

ఏం చేసినా జనం కాంగ్రెస్ వైపే

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌ను కుంగదీయడానికి బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీలను వాడుతోందని ఏఐసీసీ మీడియా అధికార ప్రతినిధి, తెలంగాణ మీడియా ఇన్‌చార్జి సుజాత పాల్ విమర్శించారు. ఆమె గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని దాడులు చేసినా జనం మాత్రం కాంగ్రెస్ వైపున్నారనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. మాట వినని నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐలతో దాడులు చేయిస్తూ లొంగదీసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్‌ను ఎదుర్కొనలేక ఖాతాలను స్తంభింపజేస్తున్నారని సుజాత పాల్ ధ్వజమెత్తారు.





ఎండలు మండి.. ఊరు ఎండి..

కాలం మాయాజాలం ముందు ప్రకృతి కూడా ప్రభావితమవుతుంది. గత ఏడాది వర్షాకాలంలో ఆకుపచ్చని అందాలతో గ్రామాలు కనువిందు చేయగా.. నేడు వేసవి ఎండలకు చెట్లన్నీ మోడువారిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం లోహర గ్రామంలో రెండు విభిన్న కాలాల్లో మారిన ప్రకృతి చిత్రాలివి. – సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

వారణాసిలో ప్రధానిపై పోటీ చేస్తా

యుగతులసి పార్టీ అధ్యక్షుడు శివకుమార్

సాక్షి, న్యూఢిల్లీ: వారణాసి నుంచి ఎంపీ అభ్యర్థిగా ప్రధాని మోదీపై పోటీ చేస్తానని హైదరాబాద్‌కు చెందిన యుగతులసి పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి శివకుమార్ వెల్లడించారు. ఆయన గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమాజ హితం కోసం గోవుల సంరక్షణను తమ పార్టీ అజెండాగా పెట్టుకుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఎండల మంటలే!

▶ మొదటి పేజీ తరువాయి

అధిక వేడి ఉండే ఎల్‌నినో పరిస్థితులు జూన్ వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోందని.. అంటే వచ్చే రెండు నెలలు ఎండల మంటలు తప్పకపోవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఇప్పటికే హెచ్చరికలు కూడా జారీ చేశాయి.


ఈసారి భగభగలు తప్పనట్టే..

దేశవ్యాప్తంగా ఈ వేసవికాలంలో భానుడి భగభగలు తప్పకపోవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఆసియా ఖండంలోని దేశాల్లో తీవ్ర వర్షాభావం, అధిక వేడికి కారణమయ్యే ఎల్‌నినో పరిస్థితులు జూన్ వరకు కొనసాగవచ్చని పేర్కొంటున్నారు. భారత వాతావరణ శాఖ కూడా దీనిపై ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. ఈసారి సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు వీయవచ్చని కూడా అంచనా వేసింది. పరిస్థితులు కూడా ఇందుకు అనుగుణంగానే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం (మార్చి చివరివారంలో) ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి.

చాలా చోట్ల 40 డిగ్రీలకుపైనే నమోదు

దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తీవ్రమవుతున్న ఎండల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజలకు హెచ్చరికలు, మార్గదర్శకాలు జారీ చేసింది. తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించాయి. ఉత్తర భారతంలోనూ పలు ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతల తీరు (డిగ్రీల సెల్సియస్‌లలో)



తీవ్రమైన ఉక్కపోత.. ఆరు బయట జాగ్రత్త

అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో తేమ శాతం పెరిగిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. దీనికితోడు పలు ప్రాంతాల్లో వేడిగాలులు వీస్తుండటం మరింత సమస్యగా మారిందని నిపుణులు చెప్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయట తిరగకూడదని, ఆరు బయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. వీలైనంత మేర నీటిని తాగుతూ ఉండాలని, శరీరం చల్లగా ఉండేలా చూసుకోవాలని వివరిస్తున్నారు. జిమ్‌లు, బయటా వ్యాయామాలు చేసేవారు కూడా జాగ్రత్తగా ఉండాలని.. డీహైడ్రేషన్, ఇతర పరిస్థితుల వల్ల ఆరోగ్యం ఒక్కసారిగా దెబ్బతినవచ్చని హెచ్చరిస్తున్నారు.

'దక్షిణం'లో తీవ్ర వర్షాభావం..

భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి తెలంగాణతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్‌లతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. మిగతా ప్రాంతాల్లో కాస్త లోటు నుంచి సాధారణ వర్షపాతం నమోదైనట్టు గణాంకాలు చెప్తున్నాయి.

సాధారణం కంటే 2 డిగ్రీలు అదనం..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనూ ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతుండటంతో.. రాత్రిపూట కూడా వేడిగా ఉంటున్న పరిస్థితి ఉందని వాతావరణశాఖ అధికారు లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించారు. కాగా.. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటినట్టు రాష్ట్ర ప్రణాళిక–అభివృద్ధిశాఖ పేర్కొంది. ఈ మేరకు ఉష్ణోగ్రతల అంచనాలను విడుదల చేసింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేసింది.

ఏప్రిల్‌లో మరింత ఎక్కువ ఎండలు

- గతేడాది కంటే వేగంగా ఈసారి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. వాతావరణంలో నెలకొంటున్న మార్పుల వల్లే ఈ పరిస్థితి కనిపిస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే వచ్చే వారం రోజుల పాటు ఎండ వేడి ఎక్కువగా ఉన్నా వడగాడ్పులు వీచే అవకాశం లేదు. ఏప్రిల్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా ఉంటాయని అంచనా. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన ఉష్ణోగ్రతల అంచనాలను ఏప్రిల్ 1న విడుదల చేస్తాం. గరిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా మూడు రోజులపాటు సాధారణం కంటే 2, 3 డిగ్రీలు అధికంగా నమోదై, మరింత పెరిగే అవకాశం ఉన్నప్పుడు అలర్టులను జారీ చేస్తాం. ఏప్రిల్ నుంచి వేసవి ముగిసేవరకు ఉష్ణోగ్రతల అంచనాలు, జాగ్రత్తలపై రోజువారీగా బులిటెన్ విడుదల చేస్తాం.

– నాగరత్న, ఐఎండీ డైరెక్టర్

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరుబయట పనిచేసే వారు, ఏదైనా పని కోసం బయటికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని చెప్తున్నారు. తరచూ నీళ్లు తాగాలని, డీహైడ్రేషన్ తలెత్తకుండా చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఇంకా వైద్యులు సూచనలు ఇవీ..

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- బయటికి వెళ్లేవారు తెలుపు, లేత రంగుల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి. తలపై టోపీ పెట్టుకోవాలి. లేదా రుమాలు చుట్టుకోవాలి.
- నీళ్లు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగుతూ ఉండాలి.
- ఎండలో అధికంగా పనిచేయకూడదు. ఇబ్బందిగా అనిపిస్తే చల్లని ప్రదేశంలో సేదతీరాలి.
- అధిక వేడి వల్ల ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటివి తింటే డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మధ్యాహ్నం పూట బయటికి వెళ్లొద్దు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 29 । మార్చి । 2024



క్వింటాల్ పత్తి రూ.7,500

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. మార్కెట్‌కు 46వాహనాల్లో 609 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది. మోడల్ ధర రూ.7,400 పలికింది.

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ శుక్ర(సా॥)	సహర్ శని(ఉ॥)
కరీంనగర్	:	6.27	4.45
పెద్దపల్లి	:	6.34	4.50
రాజన్న సిరిసిల్ల	:	6.34	4.51
జగిత్యాల	:	6.34	4.50

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం

జిల్లాలో ఈరోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కాస్త చల్లగా ఉంటుంది.

కాల్ రికార్డ్స్ ఖతం!

సిరిసిల్ల హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం

- జిల్లా కేంద్రంగా వార్ రూంను గుర్తించిన పోలీసులు
- స్థానిక నేత ఇచ్చిన నంబర్లు ఇక్కడి నుంచే ట్యాప్
- 12న డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాధితులు?
- వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలు, సీఎం అనుచరులే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇది హైదరాబాద్‌లోని ఎస్‌ఐబీ కార్యాలయం కేంద్రంగా సాగగా సిరిసిల్ల, వరంగల్‌లో ఎస్‌ఐబీ పోలీసులు కొందరు వార్ రూంలు ఏర్పాటు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. వరంగల్‌లో ఓ నాయకుడు చెప్పిన నంబర్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలు వస్తుండగా అదే తరహాలో సిరిసిల్లలోనూ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సిరిసిల్లకు చెందిన ఓ కీలక నేత కూడా కొన్ని నంబర్లు ఇచ్చి, స్థానిక వార్ రూం ద్వారా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు నిర్ధారించారు. పంజగుట్ట పోలీసుల విచారణలో ఆ నాయకుడు ఎవరు? ట్యాప్ చేయమని ఎవరెవరి నంబర్లు ఇచ్చాడు? వార్ రూం ఎక్కడ నుంచి నిర్వహించారు? అందులో ఎవరెవరు పని చేశారు? తదితర అంశాలపై విచారణ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ట్యాప్ అయిన జాబితాలోని మెజారిటీ వ్యక్తులు కాంగ్రెస్ సీనియర్లు, అందులోనూ సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితులు కావడం గమనార్హం.

వార్ రూం ఎంతకాలం నడిచిందో?

గత డిసెంబర్ 4న ఎన్నికల ఫలితాలతో అప్రమత్తమైన అప్పటి సిరిసిల్ల డీఎస్పీ ప్రణీత్‌రావు సీసీ కెమెరాలు ఆపేసి, వార్ రూంలోని దాదాపు 50 హార్డ్ డిస్కులను ధ్వంసం చేసిన విషయం విదితమే. దీనిపై మార్చి 10న పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవడం, 12న డీఎస్పీని సిరిసిల్లలో అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి. ప్రణీత్‌రావు, ఆయన బృందం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంగానే వార్ రూం ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అది ఎంతకాలం నడిచింది? ఎవరెవరి కాల్స్ రికార్డ్ చేశారు? అన్న విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. వార్ రూం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ల ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిసింది. వీరు ట్యాప్ చేసిన కాల్స్‌లో ముఖ్యమైన వాటిని కాపీ చేసి, ప్రణీత్‌రావుకు ఇచ్చేవారని సమాచారం. ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన హార్డ్ డిస్కుల్లో సిరిసిల్ల కాల్ రికార్డ్స్ కూడా ఉన్నాయని సమాచారం.

సిరిసిల్లకే పరిమితం కాలేదా?

వార్ రూంలో పనిచేసిన సభ్యులు కేవలం సిరిసిల్లకు మాత్రమే పరిమితం కాలేదని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా పెద్దపల్లిలో ముగ్గురు కీలక ప్రతిపక్ష నేతల అనుచరులకు చెందిన కోట్లాది రూపాయలను అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులు ఉమ్మడి జిల్లాతోపాటు, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పట్టుకున్నారు. కరీంనగర్, జగిత్యాల ప్రతిపక్ష నేతలు డబ్బులు ఖర్చు చేయకుండా వారికున్న ఆర్థిక మూలాలను ముందే గుర్తించి, కట్టడి చేశారన్న దిశగానూ దర్యాప్తు సాగుతోంది. సూట్‌కేసు పరిమాణంలో ఉండే ట్యాపింగ్ పరికరాలను ఓ వ్యాన్‌లో పెట్టుకొని, టార్గెట్ చేసిన నాయకుడి ఇంటికి 200 మీటర్ల దూరంలో ఉంటే చాలు.. ఆయన కాల్స్ మాత్రమే కాదు, ఇంట్లోవారు, ఆ చుట్టుపక్కల వారి కాల్స్ కూడా వినే వీలుంటుంది.

2022లోనే అనుమానించిన ఎంపీ సంజయ్

2022 మే 25వ తేదీన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రధాన మీడియా సంస్థ విలేకరితో హిందూ ఏక్తా యాత్రపై చర్చించారు. ఆ ఫోన్ కట్ అయిన కొన్ని నిమిషాల్లోనే ఎంపీ నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టారు. దీంతో ఆయన అనుచరులు సదరు విలేకరే పోలీసులకు సమాచారం ఇచ్చాడంటూ వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనతోపాటు మరిన్ని సంఘటనలు గుర్తు చేసుకున్న ఎంపీ సంజయ్ తనతోపాటు తన అనుచరుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అనుమానించారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వకండి

- కలెక్టర్ పమేలా సత్పతి



చేగుర్తిలో బోరును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులతో కొత్తగా వేసిన తాగునీటి బోర్‌వెల్, ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. బోరు ఎన్ని ఫీట్లు వేశారు.. గ్రామంలో ఎన్ని ట్యాంకులు ఉన్నాయి.. వాటి సామర్థ్యం.. ఎక్కడి నుంచి నీటిని సరఫరా చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం మార్చి 31లోపు పూర్తయ్యేలా దృష్టి సారించాలని, లేకపోతే నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకానికి తీసుకుంటున్న చర్యలు.. ఏమేం మొక్కలు ఎక్కువగా పెంచుతున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో సంజీవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్య ప్రకాశ్, మిషన్ భగీరథ డీఈ ప్రభాకర్, ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ వాస్తవిక్, పీఆర్ ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 23వరకు నిర్వహించిన పోషణ్ పక్షోత్సవాల నిర్వహణలో కరీంనగర్ జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఉద్యోగులకు గురువారం కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా కో–ఆర్డినేటర్ ఇ.నాగరాజు, ప్రాజెక్టు అసిస్టెంట్ జి.రామీల, హుజూరాబాద్ సీడీపీవో తిరుపతమ్మ, సూపర్‌వైజర్ శిరీష, బ్లాక్ కో–ఆర్డినేటర్ కె.నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ కరుణ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

టైంకు వస్తలేరు.. చదువు చెప్తలేరు

- ఉపాధ్యాయులపై డీఈవోకు విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదు
- హన్మాజిపల్లె పాఠశాలను తనిఖీ చేసిన జనార్దన్‌రావు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

గన్నేరువరం: 'సర్ మా ఊరి సర్కారు బడిని గతంలో మూతబడితే చందాలు వేసుకుని మళ్లీ ప్రారంభించాం. మన ఊరు– మన బడి కింద ప్రభుత్వం ఆధునీకరించింది. అయితే ఇక్కడి పిల్లలకు చదువు చెప్పే సార్లు మాత్రం టైంకు బడికి వస్తలేరు. వచ్చినోళ్లు చదువు చెప్తలేరు. బడికొచ్చిన పిల్లలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై చాలాసార్లు మాజీ సర్పంచ్‌కి, పెద్దసార్లకు ఫిర్యాదు చేసినం. ఎవరూ మారలేదు. మీరైనా బడిలోని సార్లను బాగుచేయండి' అంటూ గన్నేరువరం మండలం హన్మాజిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు డీఈవోకు మొర పెట్టుకున్నారు. డీఈవో జనార్దన్‌రావు గురువారం పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు రవీందర్‌రావు విధుల్లో ఉండగా ఒకరు లీవ్‌లో, మరొకరు పదోతరగతి పరీక్షల విధులకు వెళ్లారు. ఈ సందర్భంగా డీఈవో విద్యార్థులతో మాట్లాడగా.. తమకు చదువు సరిగా చెప్పడం లేదని, అసభ్యకరమైన పదాలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. డీఈవో వచ్చిన విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. ఇక్కడి ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని, దీంతో విద్యార్థులు సరిగా చదవడం లేదని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అనేక సందర్భాల్లో జంగపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మాజీ సర్పంచ్‌కు ఫిర్యాదు చేసినా మార్పు రాలేదన్నారు. గతంలో మూతబడిన బడిని 2015లో చందాలు వేసుకుని ప్రారంభించామని, మళ్లీ ఆ పరిస్థితి రానియొద్దని, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు రవీందర్‌రావును ఇక్కడి నుంచి బదిలీ చేయాలని విన్నవించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కరీంనగర్: హన్మాజిపల్లె ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు డి.భాగ్యలక్ష్మిని సస్పెండ్ చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. ఆమె విధులకు గైర్హాజరవుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపీపీ ఫిర్యాదు చేశారన్నారు. గురువారం పాఠశాలను సందర్శించగా నిజమేనని తేలిందన్నారు. దీంతో ఆమెను సస్పెండ్ చేశామని, ఇదే పాఠశాలలో పనిచేస్తున్న మరో ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు ఆలస్యంగా వచ్చినందున నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒక్క రోజు కలెక్షన్ రూ.2 కోట్లు

- ఆర్టీసీ ఆస్తిపన్ను రూ.1.88 కోట్లు
- బల్దియాకు చెల్లించిన అధికారులు



చెక్కు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచింది. ఆర్థికసంవత్సరం ముగియడానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో బల్దియా అధికారులు అధికమొత్తంలో బకాయి ఉన్న ప్రభుత్వసంస్థలపై దృష్టిసారించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ కాంప్లెక్సుకు సంబంధించిన రూ.1,88,87,368 ఆస్తిపన్ను గురువారం వసూలుచేశారు. సంబంధిత చెక్కును నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణికి ఆర్టీసీ అధికారులు అందజేశారు. ఇదిలా ఉంటే ఒక్క గురువారం రోజే రూ.2,34,04,894 ఆస్తిపన్ను వసూలైంది. కాగా ఆర్థికసంవత్సరం చివరి రెండురోజులు ప్రజలు ఆస్తిపన్ను చెల్లించేందుకు వీలుగా నగరపాలకసంస్థ కార్యాలయంలో ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, 90 శాతం వడ్డీ మాఫీని వినియోగించుకొని ఆస్తిపన్ను చెల్లించాలని కమిషనర్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఆర్ఓ ఆంజనేయులు, శ్రీకాంత్, శేఖర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

రామడుగు: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ హెచ్చరించారు. రామడుగు మండలం వెదిర గ్రామంలో ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. మార్చి 31వరకు పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇంకా ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, గ్రామ ప్రత్యేకాధికారి భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లైఫ్‌సైన్స్ శిక్షణతో ఉద్యోగ అవకాశాలు



జ్ఞాపిక అందుకుంటున్న రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ కళాశాలలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ.. డాక్టర్లు దేవుళ్లన్నారు. కోవిడ్ సమయంలో ఎంతోమంది ప్రాణాలు కాపాడాలని ప్రశంసించారు. అలాంటి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల వైపు విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. డాక్టర్ ప్రియదర్శిని, గోవిందు,, జంతుశాస్త్ర విభాగాధిపతి పి.రాజు, కే.సురేందర్‌రెడ్డి, సురేష్ కుమార్, తిరుపతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



పీవీ రాజ్‌కుమార్



తిరుకోవేల రఘువీర్



బేతి మహేందర్ రెడ్డి


కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీవీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తిరుకోవేల రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా బేతి మహేందర్ రెడ్డి, కార్యదర్శిగా గుగులోతు భీమా ఎన్నికయ్యారు. లైబ్రరీ కార్యదర్శిగా కటకం రాజేందర్, మహిళా ప్రతినిధిగా డి.రేణుకను ఎన్నుకున్నారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కందుల అరుణ్‌కుమార్, సుంకే దేవకిషన్, మాతంగి రవీందర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పొన్నం ఆంజనేయులు, కొండ్ర లక్ష్మణ్, బెజ్జంకి శ్రీకాంత్, ట్రెజరర్‌గా రామగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా మడిపల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కాసుగంటి మాధవ రావు వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర మాజీ సివిల్ సప్లై చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, సుడా మాజీ చైర్మన్ జీవీ రామ కృష్ణారావు తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పదో తరగతి పరీక్షల్లో ఒకరు డిబార్

కరీంనగర్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం సామాన్యశాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 12,565మందికి 12,551మంది హాజరుకాగా 14మంది గైర్హాజరు అయ్యారని, ప్రైవేట్ విద్యార్థులు 92 మందికి గానూ 66మంది హాజరు కాగా 26మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఒక పరీక్ష కేంద్రాన్ని మొత్తం 17 కేంద్రాలను తనిఖీ చేసినట్టు తెలిపారు. దుర్శేడ్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థిని మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు వివరించారు.

ల్యాబ్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

కరీంనగర్‌టౌన్: జిల్లా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌లో మద్యం సేవించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసినట్లు సూపరింటెండెంట్ వీరారెడ్డి తెలిపారు. ఈనెల 19న 'ఎంసీహెచ్ ల్యాబ్‌లో మద్యం కలకలం' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సూపరింటెండెంట్ స్పందించారు. ఎన్‌హెచ్‌ఎం కింద విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వోకు, మరో ముగ్గురు విద్యార్థులను 15 రోజుల పాటు సస్పెండ్ చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.



'ఎల్లంపల్లి'కి భానుడి తిలకం

రోజంతా నిప్పులు కురిపించిన భానుడు సంధ్యాసమయంలో ఆకట్టుకున్నాడు. ఒక వైపు జలాశయంలో చేపలవేటలో ఉన్న జాలరి.. మరోవైపు అస్తమిస్తున్న సూర్యుడి ప్రతిబింబం నీటిలో అందంగా కనిపిస్తుండగా... ఆకాశం నుదుటన సింధూరం పెట్టుకుందా అన్నట్లు ఆకట్టుకున్న ఈ అద్భుత దృశ్యం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద 'సాక్షి' కెమెరాకు కనిపించింది.– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



'చి'వరి'కి ట్యాంకర్ నీరు

యాసంగిలో సాగుచేసిన పంటను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన పూరెల్ల అంజయ్యకు మూడెకరాల భూమి ఉంది. సాగునీటి కొరతతో ఎకరంన్నరలో వరి వేశాడు. పంట పొట్టదశలో ఉండగా ఎస్సారెస్పీ కాలువ నీళ్లు రాక, వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటడంతో పొలం ఎండిపోయే దశకు వచ్చింది. దీంతో పంటను కాపాడుకునేందుకు రెండు రోజుల నుంచి వాటర్ ట్యాంకర్ ద్వారా బావిలో నీళ్లు నింపుతున్నాడు. రోజుకు ఐదు నుంచి ఆరు ట్యాంకర్ల ద్వారా నీళ్లు బావిలో పోస్తున్నట్లు అంజయ్య తెలిపాడు. ట్యాంకర్‌కు రూ.1000 చొప్పున ఇప్పటి వరకు రూ.15వేలు చెల్లించినట్లు వివరించాడు. – కరీంనగర్‌రూరల్





కల్యాణం.. కమనీయం

వేములవాడ రాజన్న సన్నిధిలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 10.50 గంటలకు ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేదమూర్తుల మంత్రోచ్చరణల మధ్య, భాజాభజంత్రీలతో కల్యాణం వైభవంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం పెద్దసేవపై ఊరేగించారు. కల్యాణ వేదికను చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేయడంతో అధికసంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. దాదాపు లక్ష మంది వరకు హాజరయ్యారు. – వేములవాడ



నమో.. నారసింహ

తిమ్మాపూర్ మండలం నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీసమేత నృసింహస్వామిని దర్శించుకుని పులకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, ఈవో వెంకన్న పర్యవేక్షించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ స్వామి, ఎస్సై చేరాలు తెలిపారు. – తిమ్మాపూర్

క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న కుమార్

కరీంనగర్: టెట్ ఫీజు తగ్గించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.400 ఫీజు ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.1,000, రూ.2000కు పెంచడంతో నిరుద్యోగులపై భారం పడుతోందని పేర్కొన్నారు. వారి భవిష్యత్‌ను దృష్టిలో పెటుకొని, పాత ఫీజు విధానాన్నే కొనసాగించాలని కోరారు. సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు లోకిని రమేశ్, రాజేశ్, శ్రవణ్ పాల్గొన్నారు.

గొర్రెపల్లిలో కలప పట్టివేత


అధికారులు పట్టుకున్న దుంగలు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని గొర్రెపల్లి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు భూపతిపూర్ డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంద్రమౌళి తెలిపారు. వారి వివరాల ప్రకారం .. కలప అక్రమ రవాణాపై సమాచారంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. గొర్రెపల్లి శివారులోని ఓ పశువుల పాకలో 42 దుంగలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. బీట్ ఆఫీసర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీపై కేసు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న సంతకం ఫోర్జరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. గ్రామానికే చెందిన ఓ మహిళ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం తన సంతకాన్ని ఫోర్జరీ చేసిందని పంచాయతీ కార్యదర్శి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో జూనియర్ లైన్‌మెన్ బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గురువారం విధి నిర్వహణలో భాగంగా ఆయన విద్యుత్ స్తంభంపై మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డారని పేర్కొన్నారు. వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


శ్రీవేంకటేశ్వర స్వామి పల్లకిని మోస్తున్న పోలీసులు


పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకుంటున్న స్వామివారు

పోలీస్‌స్టేషన్‌లో శ్రీవేంకటేశ్వరునికి పూజలు

- వైభవంగా దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామికి గురువారం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలను అంగరంగ వైభవంగా జరిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌కు చేరిన స్వామివారికి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ముందుగా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్వాములవారు పోలీస్‌స్టేషన్‌లో పూజలు అందుకోవడం ధర్మపురిలో నేటికీ కొనసాగుతోంది. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులున్నారు.

నేడు శ్రీలక్ష్మీనృసింహుడి రథోత్సవం

శ్రీలక్ష్మీనృసింహ స్వామి రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నారు. ముప్పూరు స్వాములైన లక్ష్మీనృసింహుడితోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వాములను రథాలపై ఆలయం నుంచి నందీకూడలి వరకు రథాలపై ఊరేగిస్తారు. గోదావరి నదికి తీసుకెళ్లి స్వామివార్లకు చక్రస్నానం, ఇతర పూజలు జరిపిస్తారు.

హత్య కేసుల్లో నిందితుల అరెస్టు

ధర్మపురి: ఓ మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని కమలాపూర్‌కు చెందిన పులి లస్మయ్య, గంగయ్య వరుసకు అన్నదమ్ములు. ఇద్దరూ గీత కార్మిక వృత్తిలో ఉన్నారు. వీరి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. ఇరు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూ హద్దుల పంచాయితీ నడుస్తోంది. ఈ కారణంగా గంగయ్యకు, లస్మయ్య భార్య పద్మకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 26న గ్రామంలో కాటమయ్య పండుగ నిర్వహించగా గంగయ్య హాజరయ్యాడు. ఇంట్లోనే ఉన్న అతని భార్య రేణుక అలియాస్ రేణ(50) ఉరేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన గంగయ్యకు భార్య శవమై కనిపించింది. ఆమె ఆత్మహత్యకు లస్మయ్య భార్య పద్మనే కారణమని భావించాడు. కోపోద్రిక్తుడై లస్మయ్య ఇంటికి వెళ్లి, పద్మపై కల్లు గీసే ఉలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రామ్‌నర్సింహారెడ్డి కేసు నమోదు చేశారు. గురువారం గంగయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.


గంగయ్య అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్,


ప్రకాశ్ అరెస్టు చూపుతున్న సీఐ ఆరిఫ్ అలీఖాన్

తిప్పన్నపేటకు చెందిన వ్యక్తి..

జగిత్యాల క్రైం: హత్య కేసులో నిందితుడు జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటకు చెందిన బోగ ప్రకాశ్‌ను అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ప్రకాశ్ తిప్పన్నపేటకే చెందిన మేడిశెట్టి రమ కూతురుని పెళ్లి చేసుకుంటానని చెప్పగా ఆమె కుటుంబసభ్యులు నిరాకరించారు. ఇది మనసులో పెట్టుకున్న అతను రమ కుమారుడు రిషివర్ధన్‌ను చంపితే తాను పెళ్లి చేసుకోవచ్చని అనుకున్నాడు. ఈ క్రమంలో రిషివర్ధన్ ఈ నెల 25న హోలీ పండుగ రోజు ప్రకాశ్ ఇంటి సమీపం నుంచి వెళ్తుండగా కావాలనే గొడవపడ్డాడు. కొడవలితో వెంబడించగా అడ్డుకోబోయిన అతని తల్లి రమపై దాడి చేశాడు. ఆమె మెడ భాగంలో తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. గురువారం ఉదయం పొరండ్ల శివారులో ఎస్సై సదాకర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ప్రకాశ్ బైక్‌పై వెళ్తూ పట్టుబడ్డాడు. వాహనం, సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన కొడవలి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- వీరిలో ఒకరు మైనర్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్


పెగడపల్లిలో..

రాయికల్(జగిత్యాల): గంజాయిని విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రాయికల్ ఠాణా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేశ్, అరుముల్ల సాయికుమార్‌లకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. అతను అక్కడ తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, జగిత్యాలకు తీసుకువచ్చాడు. స్థానిక యువతకు ఎక్కువ ధరకు విక్రయించాలని భావించి, గురువారం బైక్‌పై రాయికల్ వస్తున్నారు. అదే సమయంలో కుమ్మరిపల్లి శివారులో ఎస్సై అజయ్ వాహనాల తనిఖీ చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి లభ్యమైంది. గంజాయితోపాటు ద్విచక్రవాహనం, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు. వారిని చాకచక్యంగా పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్, కానిస్టేబుళ్లు సాగర్, ప్రశాంత్‌లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. సాయికుమార్ తల్లిదండ్రులు తమ కొడుకును పోలీ సులు అన్యాయంగా అరెస్టు చేశారంటూ రాయికల్ ఠాణాకు వచ్చి, విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీని వివరణ కోరగా అన్ని సాక్ష్యాలతో అరెస్టు చేశామని పేర్కొన్నారు.

పెగడపల్లి నంది చౌరస్తా వద్ద ఇద్దరు..

పెగడపల్లి(ధర్మపురి): గంజాయి తరలిస్తున్న ఓ యువకుడు, ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలు వెల్లడించారు. పెగడపల్లి నంది చౌరస్తా వద్ద ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ, ఓ బాలుడు బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి, తనిఖీ చేయగా బ్యాగులో 900 గ్రాముల గంజాయి లభ్యమైంది. బైక్‌ను స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అరెస్టు చేశారు. పోలీసులను డీఎస్పీ అభినందించారు. గంజాయి తరలించినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ రవి, ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్‌రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

కరీంనగర్: రానున్న లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో ఒకదాన్ని బ్రాహ్మణులకు ఇవ్వాలని బ్రాహ్మణ సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కస్బా భూమేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ కుటుంబాలు మొదటినుంచి కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉంటూ.. ప్రతీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. అన్ని పార్టీలు బ్రాహ్మణులను చిన్నచూపు చూస్తూ వారికి రాజకీయ అవకాశాలు లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించని కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయంకు కేటాయించాలని ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అఖిల బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు నేదునూరి వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి పురం ప్రేమ్‌చందర్‌రావు, ఉపాధ్యక్షులు జీవీ.రంగారావు, బండపల్లి ఉపేందర్ శర్మ, యోగా మాస్టర్ సంపత్ కుమార్, డాక్టర్ దీపక్ బాబు, మూగ హరిశంకర్ శర్మ, నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి 'చాడ' లేఖ

సిరిసిల్లటౌన్: చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని చేనేత, సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను వివరిస్తూ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేయించగా వాటికి సంబంధించిన రూ.270 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నేత కార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని కోరారు. మూడు నెలలుగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, ఆదుకోవాలని కోరారు. గత 45 రోజులుగా కార్మికులు, ఆసాములు పోరాటాలు చేస్తున్నారని, వారి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- హెడ్‌కానిస్టేబుల్‌పైనా వేటుకు రంగం సిద్ధం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు సురేశ్, ధనుంజయ్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఠాణాకు మద్యం తెచ్చుకొని, ఇద్దరు ప్రజాప్రతినిధులతో విందు చేసుకున్న సంఘటనపై ఆయన చర్యలు తీసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పైనా వేటుకు రంగం సిద్ధమైంది. మల్టీజోన్-1 ఐజీకి నివేదిక సమర్పించినట్లు ఎస్పీ తెలిపారు. 1, 2 రోజుల్లో చర్యలు ఉండనున్నాయి. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది.

గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు తప్పకోవాలి

కొత్తపల్లి(కరీంనగర్): గ్రానైట్ పరిశ్రమ బతకాలంటే జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కొత్తపల్లి మండలం బావుపేట శివారులోని అసోసియేషన్ జిల్లా కార్యాలయం ఎదుట జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల పలువురు యజమానులు నిరసన తెలిపారు. జి.సుదర్శన్ రెడ్డి, బి.సాగర్, ఆర్.విక్రమ్, కె.సత్యనారాయణ, టి.శ్యాంరావు, కె.సతీశ్ రావు, అశోక్ రెడ్డి, పవన్ కుమార్, ఎస్.కరుణాకర్, జె.మధు, పి.సత్యం, ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి ధోరణి వల్లే ఫ్యాక్టరీల మనుగడ ప్రశ్నార్థకంగా మారి రోడ్డున పడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అసోసియేషన్ భవనంలో తమకు భాగస్వామ్యం ఉన్నప్పటికీ అహంకారపూరితంగా వ్యవహరిస్తూ భవనానికి తాళం వేశారని మండిపడ్డారు. రెండేళ్లకోసారి కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరగాల్సి ఉండగా పదేళ్లుగా ఏకచత్రాధిపత్యం వహిస్తూ ఫ్యాక్టరీల యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అసోసియేషన్‌లో ఉన్న డబ్బులను సేవా కార్యక్రమాలకు వినియోగించకుండా ఇష్టానుసారంగా వినియోగిస్తూ విదేశీ పర్యటనల పేరిట దుర్వినియోగం చేశారన్నారు.


నిరసన తెలుపుతున్న యజమానులు



వేములవాడలో కిక్కిరిసిన భక్తులు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం జరిగిన శివకల్యాణోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణ వేడుకల అనంతరం స్వగ్రామాలకు వెనుదిరిగిన భక్తులతో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను నడిపించినట్లు వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు.



బీజేపీ స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు

- మరో ఏక్‌నాథ్ షిండే కానున్న రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్


మాట్లాడుతున్న సుమన్

గోదావరిఖని: బీజేపీ బలంగా ఉన్న పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెడుతోందని బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, నాగర్‌కర్నూల ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకూలంగా మారి మరో ఏక్‌నాథ్‌షిండే అవతారం ఎత్తారని ఎద్దేవా చేశారు. తమ ఉనికి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అన్యాయంగా జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై ఈడీ దాడులు హేయమన్నారు. వందరోజుల్లో అన్నీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందన్నారు. కాంట్రాక్టర్ల నుంచి పెద్దమొత్తంలో ముడుపులు వసూలు చేసి ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ తీరుతో నీరు అందక 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. అప్పులు చెల్లించని రైతులను అవమానపరుస్తూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుబంధు, రుణమాఫీతోపాటు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని అన్నారు. దళితుడు వర్సెస్ ధనవంతుడు మధ్య జరుగుతున్న పోరులో కార్మిక నేతగా, ఈప్రాంత బిడ్డగా ఎంతో అనుభవం ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

- మృతురాలి మనవడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందగా ఆమె మనవడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) గురువారం తన మనవడు విఘ్నేశ్‌తో కలిసి బైక్‌పై మీర్జంపేటలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామం వస్తుండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓదమ్మ అక్కడికక్కడే మృతిచెందగా విఘ్నేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.



స్థానికులు అతన్ని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధుడి మృతి

మెట్‌పల్లి(కోరుట్ల): ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్‌కు చెందిన బోగం సాయమ్య(70) హుజూరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఆర్టీసీ బస్సులో నిజామాబాద్ వస్తున్నాడు. మెట్‌పల్లి శివారులోకి రాగానే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. డ్రైవర్ బస్సును నిలిపివేసి, 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు.

నర్సింగపూర్‌లో చోరీ

- 10 తులాల పట్ట గొలుసులు మాయం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం నర్సింగపూర్‌కు చెందిన బైరగోని మల్లేశం ఇంట్లో దొంగతనం జరిగిందని గురువారం బాధితుడు చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత బైరగోని సునిత మల్లేశం దంపతలు వేములవాడలో నివాసం ఉంటున్నారు. గురువారం తమ స్వగ్రామం నర్సింగపూర్‌కు వెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టి దొంగలు చొరబడి.. 10 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. చందుర్తి పోలీసులు క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. వేలిముద్రల ఆధారంగా దొంగను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎస్సారెస్పీ కెనాల్లో గుర్తు తెలియని మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): కొండపూర్ శివారు ఎస్సారెస్పీ కెనాల్లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు ఏఎస్సై హసన్ మహమ్మద్ తెలిపారు. మృతుడి వయసు 40-45 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు. వివరాలు తెలిసినవారు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కొండపూర్ పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ఇషాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కొత్తపల్లిలో..

తిమ్మాపూర్(మానకొండూర్): కొత్తపల్లిలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై చేరాలు తెలిపారు. పెట్రోల్ బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో కొబ్బరి చెట్టు కింద గుర్తించామన్నారు. మృతుడి వయసు 40-50 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. అతనికి మతిస్థిమితం సరిగా లేదని, 15 రోజులుగా గ్రామంలో తిరుగుతున్నాడని స్థానికులు తెలిపారు. ఎండ తీవ్రతకు చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 70770 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చేయి విరిగినా.. 'పది' పరీక్షకు హాజరు


సహాయకురాలితో పరీక్ష రాసిన విద్యార్థిని

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మహ్విన్ నిసార్‌కు ప్రమాదవశాత్తు కుడి చేతు విరిగింది. స్థానిక కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చింది. కుడి చేతు విరగడంతో సహాయకురాలిగా పరీక్షలు రాయడానికి తన కంటే కింద తరగతి విద్యార్థినితో వచ్చింది.

పాఠశాల కిటికీకి నిప్పంటించిన దుండగులు


కాలిపోయిన కిటికీ

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిటికీకి గురువారం సాయంత్రం దుండగులు నిప్పంటించడంతో పాక్షికంగా కాలిపోయింది. వారం రోజుల క్రితం స్కూల్లోని సీలింగ్ ఫ్యాన్లు, కరెంటు స్విచ్ బోర్డులు, డిజిటల్ బోర్డును కొందరు విద్యార్థులు ధ్వంసం చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు రాస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పదోతరగతి పరీక్ష కేంద్రానికి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

దాడి కేసులో ఒకరికి జైలు

మంథని: మండలంలోని భట్టుపల్లికి చెందిన దూపం శ్రీనివాస్‌పై గొడ్డలితో దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గుండ్ల సదయ్యకు మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి జైలుశిక్ష, జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. 11.05.2023న శ్రీనివాస్‌పై సదయ్య గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. చంపాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశాడని బాధితుడి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి గురువారం సదయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న రెస్క్యూ టీం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్‌తోపాటు ఐవోసీఎల్, ఇతర గ్యాస్ ఆధారిత పరిశ్రమలకు జీఎస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్, కుందనపల్లి నుంచి రామగుండం వరకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే, గ్యాస్ సరఫరా సమయంలో లీకేజీ సమస్య ఏర్పడితే స్పందించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడం తదితర చర్యలపై రెస్క్యూ సభ్యులు గురువారం ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. పైప్‌లైన్‌లో గ్యాస్ లీకేజీ, ఎగిసిన మంటలను అదుపు చేయడం, గాయాల పాలైన వారిని ఆస్పత్రికి తరలించడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, రామగుండం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జీఐటీఎల్ అధికారులు ఎంకే తుతేజ, రాగేశ్, నవీన్‌పటేల్, ఆనంద్, రుషబ్, రితుల్, ప్రసాద్, నితిన్, సమీర్ తపస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్ చేతుల మీదుగా శిశుగృహ పాప దత్తత



పాపను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని శిశుగృహలోని పాపను గురువారం కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా హైదరాబాద్ చెందిన దంపతులకు దత్తతగా అందజేశారు. పాప యొక్క చెన్నైకి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వుల కాపీని కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న దంపతులతో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు భవిష్యత్‌లో మంచి విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, పీవో(ఎస్ఐసీ) తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది రాజేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుపతికి డాక్టరేట్



తిరుపతి

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామానికి చెందిన వడ్లూరి తిరుపతికి ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించారు. శ్రేయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సాగర్ పర్యవేక్షణలో 'స్కేలబుల్ డేటా ఎక్స్చేంజి అండ్ రీడైరెక్షన్స్ ఆఫ్ క్లైంట్స్ ఇన్ లార్జ్ స్కేల్ డిస్ట్రిబ్యూటెడ్ ఐవోటీ నెట్‌వర్క్ త్రు (ఎంక్యూటీటీ) ప్రోటోకాల్' అనే అంశంపై పరిశోధనలు జరిపి నివేదిక సమర్పించినందుకు ఉస్మానియా యూని వర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రకటించారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: మానకొండూర్ శివారులో పనిచేస్తున్న అన్నారం జెఎల్ఎం జి.బాలకృష్ణ ప్రమాద బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు నలువాల స్వామి డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన జేఎల్ఎంను కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ 33కేవీ లైన్ బ్రేక్‌డౌన్ జంపర్ ఓపెన్ చేయడానికి ఒక్క జేఎల్ఎంను పంపడం సరైందికాదని అన్నారు. లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ స్థాయి సిబ్బందిలో పాటు ఏఈ, ఏడీ పర్యవేక్షణలో జరగాల్సిన పనిని ఒక్క జేఎల్ఎంతోనే చేయించారన్నారు. విద్యుత్ స్తంభంపై నుంచి పడ్డ అతడిని ఆసుపత్రిలో చేర్పించడానికి ఎవరూ లేరని తెలిపారు. ఈ సంఘటనపై విద్యుత్ అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా క్రెడిట్ కార్డు చికిత్స చేయించుకునేలా విద్యుత్ సంస్థ అనుమతి మంజూరు చేయాలని స్వామి విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు కొత్త ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇంటర్నల్ షిప్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకున్న చదువుతో ఏదైనా చిన్న పరిశ్రమను స్థాపిస్తే కొంతమంది గ్రామీణ యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. శిక్షణ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా చిన్న పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నాయని తెలిపారు. అనంతరం ఎంఎస్ఎంఈ తరఫున ది నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ పి.ముత్తుకుమారన్ శిక్షణ ఇస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల సైన్స్ సెల్ కో ఆర్డినేటర్, డీన్ డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, సమన్వయకర్త డీన్ డాక్టర్ యోగేశ్ కుండలిక్, అధ్యాపకులు ఉన్నారు.

పంచాయతీ రాజ్ ఏఈకి షోకాజ్ నోటీస్

ఇల్లందకుంట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఇల్లందకుంట, భోగంపాడు, వంతడ్పుల గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అంతర్గతరోడ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈనెల 31 లోపు రోడ్ల నిర్మాణంపై వివర ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

భక్తిభావం.. ఉపాధి మార్గం



- ప్రజల్లో పెరుగుతున్న ఆధ్యాత్మికత
- నగరంలో పెరుగుతున్న పూజా స్టోర్లు
- జీవనాధారంగా సామగ్రి విక్రయాలు

విద్యానగర్(కరీంనగర్): హిందూ మత విధానంలో విగ్రహారాధన ప్రధానాంశం. సందర్భాను సారం పూజా విధానాల్లో మార్పులు ఉంటాయి. ఆ పూజలకు అవసరమయ్యే వస్తు సామగ్రి కూడా భిన్నంగా ఉంటుంది. ప్రజల్లో పెరుగుతున్న ఆధ్యాత్మికతకు అనుగుణంగా అన్ని రకాల పూజలకు సంబంధించిన వస్తు సామగ్రి కోసం కరీంనగర్‌లో ప్రత్యేక దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో పలువురు ఉపాధి పొందుతున్నారు.

ఆధ్యాత్మికత వైపు..

ఆధునికత ఎంత పెరుగుతున్నప్పటికీ హిందూ సంస్కృతి సంప్రదాయల పట్ల చిన్న పెద్ద వయొ బేధం లేకుండా మొగ్గు చూపిస్తూ ఆచరిస్తున్నారు. ఇటీవల యువత కూడా పూజా పునస్కారాలను ఆచరించడం విశేషం. వయస్సు పైబడిన వారి కంటే యువతే ఎక్కువగా దైవదర్శనాలకు, పూజలకు ప్రాధాన్యం ఇస్తుండడంతో పూజా వస్తువుల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

వ్రతాలు, నోములు, మాలధారణలు

వరలక్ష్మీ వ్రతాలు, గౌరీ వ్రతాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు, నోములు, అయ్యప్ప పూజలు, వివిధ దేవత మాలధారణలు, షష్టిపూర్తి, అన్నప్రసన, ఉపనయనాలు, భూమి పూజలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు ఇలా ఏదైనప్పటికీ విగ్రహారాధన పూజలు తప్పని సరి. వీటి అన్నింటికీ పూజా సామగ్రి అవసరం. దీంతో పూజా సామగ్రి వ్యాపారం జోరుగా సాగుతోంది.

పూజా సామగ్రి దుకాణాలతో పలువురికి ఉపాధి

ఇంట్లో, వాణిజ్య రంగాల్లో నిత్యం నిర్వహించే పూజలు, ప్రత్యేక పూజల వస్తుసామగ్రి కోసం ప్రత్యేక దుకాణాలు కరీంనగర్‌లో విరివిరిగా ఏర్పాటు చేస్తూ తద్వారా చాలా మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కరీంనగర్‌లో ప్రతి వీధికి రెండుకు మించి పూజా స్టోర్స్ ఉన్నాయి. కరీంనగర్‌లో దాదాపు 200 వరకు పూజా స్టోర్స్ ఉన్నాయంటే ఆధ్యాత్మికత వైపు పెరుగుతున్న ఆసక్తిని అర్థం చేసుకోవచ్చు. అన్ని రకాల పూజలకు సంబంధించిన వస్తువులన్నీ ఇప్పుడు ఒకే స్టోర్‌లో అందుబాటులో ఉంటున్నాయి.





పూజాస్టోర్స్‌లో పూజా సామగ్రి

వ్యాపారం బాగుంది



ప్రస్తుతం ప్రజలు అధ్యాత్మికత వైపు మొగ్గు చూపిస్తున్నారు. వివిధ దేవత మాలాధారణలు, పూజల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. వివిధ పూజలకు అవసరమైన వస్తువుల సామగ్రి ఒకే చోట ఏర్పాటు చేశాం. మా దగ్గర అన్ని రకాల పూజలకు సంబంధించిన సామగ్రి లభిస్తుంది.

– తొడుపునూరి సంతోష్‌కుమార్, మహాదేవ పూజా స్టోర్స్, కరీంనగర్

దైవచింతన ఉండాలి



ప్రతీ ఒక్కరిలో దైవచింతన ఉండాలి. అప్పుడే సమాజంలో అధ్యాత్మికత పెరిగి అరాచకాలు తగ్గుతాయి. ఆలయాలు పెరగడం, పూజలపై ఆసక్తి పెరగడం మంచి పరిణామమే. ప్రజలందరూ దైవచింతన కలిగి సుఖశాంతులతో జీవించాలన్నదే మన పురాణాల సారం. పూజా సామగ్రి దుకాణాలు పెరగడం వల్ల కూడా అందరిలో దేవుడిపై నమ్మకం, విశ్వాసం పెరుగుతుంది.

– పవనకృష్ణ శర్మ, శ్రీదుర్గాభవానీ ఆలయ ప్రధానార్చకులు, నగునూర్, కరీంనగర్

మహిళా సాధికారతపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న వినయకళ

కరీంనగర్‌రూరల్: నగునూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సమత ఆధ్వర్యంలో గురువారం మహిళా సాధికారతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కొర్వి వినయకళ హాజరై మాట్లాడుతూ మహిళలు పోటీ ప్రపంచంలో ఎలా ముందుకెళ్లాలి, చదువు ప్రాముఖ్యతను వివరించారు. పాండిచేరి సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమోలక్‌సింగ్ మెథడ్స్ ఆఫ్ డేటా కలెక్షన్ ఇన్ రీసెర్చ్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, లావణ్య, ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి కోర్టు గురువారం జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీంఉల్లా ఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా ఒక వ్యక్తికి ఏడురోజులు శిక్ష, మరొకరికి ఐదు రోజుల జైలు, ముగ్గురికి మూడు రోజుల జైలుశిక్ష, రూ.9,500లు జరిమానా, పది మందికి కలుపుకొని రూ.19,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆక్రమణలకు అధికారిక దన్ను

- 10 ఫీట్లకు కుచించుకుపోయిన రోడ్డు

కరీంనగర్ కార్పొరేషన్: అసలే ఆ రోడ్డు ఇరుకు. ఆపై అక్రమ నిర్మాణాలు.. అందుకు అధికారిక దన్ను... వెరసి అక్కడి స్థానికులు, ఆ రోడ్డు వెంట ప్రయాణించే వాళ్లకు ప్రతీరోజు ఇబ్బందులే. అప్పటికే 13 ఫీట్లతో రోడ్డు ఇబ్బందికరంగా ఉందంటే, ఓ ఇంటి యజమానికి చేసిన నిర్వాకం.. ఆయనకు అధికారుల వత్తాసు పలకడంతో 10ఫీట్లకు కుచించుకుపోయింది. నగరంలోని 21వ డివిజన్ సీతారాంపూర్‌లోని రెడ్డిఫంక్షన్‌హాల్ వెనకాల ఉన్న ఓ రోడ్డు పరిస్థితి ఇది. సీతారాంపూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే ఈ రోడ్డు పక్కన కొన్ని ఇండ్లు నిర్మించారు. అప్పట్లో ఆ రోడ్డు 13 నుంచి 15 ఫీట్ల వెడల్పుతో మాత్రమే ఉంది. కాలక్రమేణా ఈ రోడ్డులో కొత్తగా ఇండ్ల నిర్మాణం చేపడుతున్న సమయంలో చాలా మంది సెట్‌బ్యాక్ తీసుకొని నిర్మాణాలు చేసుకుంటున్నారు. దీనితో రోడ్డు వైశాల్యం పెరుగుతోంది. కాని ఓ ఇంటి యజమాని మాత్రం సెట్‌బ్యాక్ తీసుకోకపోవడం పక్కనపెడితే, ఉన్న రోడ్డుపైన నిర్మాణాలు చేపడుతున్నాడు. పైగా అతని పలుకుబడితో ఇటీవల ట్రాన్స్‌కో నుంచి ఓ విద్యుత్ స్తంభాన్ని కూడా ఇంటి ముందు రోడ్డుపైనే వేయించుకొన్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆ రోడ్డు వెంట విద్యుత్ స్తంభాలు ఒక వరుసలో ఉంటే, సదరు వ్యక్తి ఇంటి వద్ద మాత్రం రోడ్డుపైకి ఏర్పాటు చేశారు. దీంతో ఆ రోడ్డు 10 ఫీట్లకు కుచించుకుపోయింది. పైగా అక్కడే నూతనంగా అపార్ట్‌మెంట్‌నిర్మాణం చేపట్టడంతో రద్దీ మరింతగా పెరిగింది. కాని ఆ రోడ్డు మొత్తం ఒక రకంగా ఉంటే, ఆయన ఇంటి వద్ద మాత్రం రోడ్డు పదిఫీట్లకు కుచించుకుపోయింది. స్తంభాన్ని తొలగించి, మిగతా స్తంభాల వరుసలోనే ఏర్పాటు చేయాలని, రోడ్డు కుచించుకుపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు.




సీతారాంపూర్‌లో కుచించుకుపోయిన రోడ్డు

హుండీల ఆదాయం లెక్కింపు



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మంకమ్మతోటలో గల భక్తాంజనేయ ఆలయం, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. భక్తాంజనేయ ఆలయంలో రూ. 1,08,480, హనుమాన్ సంతోషిమాత ఆలయంలో రూ.1,55,680 ఆదాయం సమకూరినట్టు ఈవో అనిల్ తెలిపారు. ఈ లెక్కింపులో దేవాదాయ శాఖ పరిశీలకులు సత్యనారాయణ, మహేశ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



విద్యానగర్(కరీంనగర్): సంకష్టహర చతుర్థి సందర్భంగా గురువారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలోని లక్ష్మీగణపతికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణశర్మ జరిపారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' ఇంతేనా?

- సమీకృత మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు
- నిధుల కొరత.. చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కొత్తపల్లిలో అర్ధాంతరంగా నిలిచిన పనులు

సాక్షి ఫోకస్ సాక్షి సాక్షి ఫోకస్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పట్టణ శివారులో నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పటి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో మార్కెట్ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు పునాదుల్లో నిలిపివేసి డబ్బులు రాక చేతులెత్తేసారు. ఇక అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు సమాధానమివ్వలేకపోతున్నారు. నిర్మాణాలు మొదలు పెట్టి ఆపేయడంతో ఇటు ప్రభుత్వానికి, అటు కాంట్రాక్టర్‌కు కొంతమేర నష్టం జరిగే అవకాశం లేకపోలేదు.

రెండెకరాల్లో..

కొత్తపల్లి శివారులోని తెలంగాణ సీడ్ కంపెనీకి చెందిన 127 సర్వే నంబర్‌లోని రెండెకరాల స్థలంలో రూ.2 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిబంధనల మేరకు సమీకృత మార్కెట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. అయితే నిధుల లేమి, కాంట్రాక్టర్‌కు భారంగా మారడంతో పనులను నిలిపివేశారు. పనులు ప్రారంభించి సుమారు రెండున్నరేళ్లు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. అయితే సదరు కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో మార్కెట్ పనులపై ప్రస్తుత ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.



కొత్తపల్లి శివారులో నిలిచిపోయిన ఇంటిగ్రేటేడ్ మార్కెట్ పనులు

అభిలాష్ మృతిపై విచారణ జరిపించాలి



వినతిపత్రం చూపిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కరీంనగర్: తిమ్మాపూర్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి అభిలాష్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సీపీ అభిషేక్ మహంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థి ఆచూకీ తెలియక దాదాపు 24 రోజులు గడుస్తున్నా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వెలువడుతున్నాయని తెలిపారు. వారి తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి చైర్మన్‌ను కలిస్తే ఎలాంటి స్పందన ఇవ్వలేదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తిమ్మాపూర్‌లోని పీఎస్‌లో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ 24 రోజుల తర్వాత మృతదేహం దొరకడం బాధాకరమన్నారు. మృతిపై సమగ్ర విచారణ జరిపించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దానిపై విచారణ జరిపి త్వరలో ఆధారంతో పట్టుకుంటామని సీపీ స్పష్టం చేసినట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను మినహాయింపు ఇవ్వండి



మున్సిపల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల సంఘం ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ భవనానికి పన్ను మినహాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయ అధికారులకు విన్నవించారు. గురువారం మున్సిపల్ కార్యాలయ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో 552 ప్రకారం సొసైటీకి పన్ను మినహాయింపు ఇవ్వాలని సూచించిందని తెలిపారు. సదరు ఆర్డర్‌ను అనుసరిస్తూ టీఎన్జీవోస్ వెల్ఫేర్ సొసైటీ భవనాలను డిమాండ్ నుంచి తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ వస్తున్నామని అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నాయకులు సుమంత్‌రావు, రాజేశ్వర్‌రావు, పవన్‌కుమార్, వంశీ, అజయ్, నారాయణ, శ్రీమాన్ రెడ్డి, కరుణాకర్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా అప్రమత్తంగా ఉండాలి

గన్నేరువరం: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రామానుజాచారీ సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీలో గురువారం మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ బావులు, బోరువెల్‌ల నిర్వహణపై జీపీల ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి సమస్య తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. పైపులైన్ లీకేజీ మరమ్మతులను నిర్లక్ష్యం చేయొద్దని, నిరుపయోగంగా ఉన్న బోరుబావులు, చేతి పంపులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

అవగాహన ర్యాలీ

హుజూరాబాద్: పట్టణంలోని 17వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాల నిండిన యువత ఏప్రిల్ 14 వరకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ కే.మానస, సీఎల్ఆర్‌పీ, కే.స్వరూప, ఆర్‌పీ చాంద్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి

జమ్మికుంట: కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను జమ్మికుంటకు చెందిన సీనియర్ నాయకుడు పూదరి రేణుకశివకుమార్‌గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని, ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన కార్యకర్తలను గుర్తించి, నామినేటెడ్ పదవులతో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని శివకుమార్‌గౌడ్ వివరించారు.

అలరించిన వీడ్కోలు వేడుక

కరీంనగర్‌సిటీ: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థులు గురువారం బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుక అలరించింది. విద్యార్థులు తమ పాటలు, నాటికలు, నృత్యాలతో హోరెత్తించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు చక్కని క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్‌రెడ్డి, అర్థశాస్త్ర విభాగాధిపతి మార్కొండ శకుంతల, శ్రీధర్‌రావు, సామ్యూల్ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సాక్షి బిజినెస్
శుక్రవారం
29-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	655	73,651
నిఫ్టీ ▲	203	22,327

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,381	▼	19
డోజోన్స్	39,765	▲	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲	21
డాక్స్	18,492	▲	15
షాంఘై	3,110	▲	18
నికాయ్	40,168	▼	595

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	66,760	▲	126
బంగారం (99.5 స్వచ్ఛత)	66,691	▲	125
వెండి (కిలో)	74,747	▲	250

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.93	83395
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.32	106.84
€	యూరో	[illegible]	89.25	90.68
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	55.34	56.14
AUS$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	53.54	55.75
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.34	64.75
SAR	సౌదీ రియాల్	[illegible]	21.28	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.69	23.55
¥	చైనా యువాన్	[illegible]	10.40	12.47

చేతులు కలిపిన అంబానీ- అదానీ

అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్‌కు 26 శాతం వాటా



న్యూఢిల్లీ: బిలియనీర్ పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తొలిసారి చేతులు కలిపారు. దీనిలో భాగంగా అదానీ పవర్‌కు చెందిన పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) 26 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా మధ్యప్రదేశ్‌లోని ఈ ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆర్ఐఎల్ సొంత అవసరాలకు వినియోగించుకునేందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వెరసి అదానీ పవర్ పూర్తి అనుబంధ సంస్థ మహన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో 5 కోట్ల ఈక్విటీ షేర్లను ఆర్ఐఎల్ సొంతం చేసుకోనుంది. రూ. 10 ముఖ విలువకే(రూ. 50 కోట్లు) వీటిని చేజిక్కించుకోవడంతోపాటు.. 500 మెగావాట్ల విద్యుత్‌ను సొంత అవసరాలకు ఆర్ఐఎల్ వినియోగించుకోనుంది. సొంత వినియోగ పాలసీలో భాగంగా ఆర్ఐఎల్ 20 ఏళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) ఎంఈఎల్‌తో కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ వెల్లడించింది. మొత్తం 2,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఎంఈఎల్ ప్లాంటులో 600 మెగావాట్ల యూనిట్‌ను సొంత అవసరాల పద్ధతిలో తెరతీయనున్నట్లు వివరించింది.

అదానీ గ్రూప్ ప్రపంచ అతిపెద్ద కాపర్ ప్లాంట్



గుజరాత్‌లోని ముంద్రాలో అదానీ గ్రూప్ భారీ కాపర్ ప్లాంటు తొలి దశను ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే సింగిల్ లొకేషన్‌లో ఏర్పాటైన అతి పెద్ద కాపర్ తయారీ కర్మాగారంగా నిలవనుంది. దీనితో దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గనుంది.

అంబుజాలో అదానీ వాటా అప్

రూ. 6,661 కోట్ల పెట్టుబడులు

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో వాటాను పెంచుకుంది. 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకోవడం ద్వారా 3.6 శాతం అదనపు వాటాను పొందింది. ఇందుకు రూ. 6,661 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం అంబుజాలో అదానీ వాటా 66.7 శాతానికి చేరింది. దేశీయంగా సిమెంట్ తయారీలో రెండో పెద్ద కంపెనీగా నిలుస్తున్న అంబుజాలో ప్రమోటర్ సంస్థ హార్మోనియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ షేరుకి రూ. 314.15 సగటు ధరలో వారంట్లను మార్పిడి చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లోనూ ప్రమోటర్ సంస్థ వారంట్లను అందుకోవడం ద్వారా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా హార్మోనియాకు 47.74 కోట్ల మార్పిడికి వీలయ్యే వారంట్లను అంబుజా సిమెంట్స్ జారీ చేసింది.

చిన్న పొదుపులపై వడ్డీరేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న పొదుపులపై వడ్డీరేట్లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జనవరి–మార్చి తరహాలోనే యథాతథంగా కొనసాగనున్నాయి. వీటిలో ఎటువంటి మార్పూ ఉండబోదని కేంద్రం ప్రకటించింది. ప్రకటన ప్రకారం సురక్ష సమృద్ధి యోజనపై 8.2% వడ్డీరేటు అమలవుతుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.1%. పీపీఎఫ్‌పై వడ్డీ 7.1 శాతంకాగా, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌పై 4% వడ్డీ అమలవుతుంది. కిసాన్ వికాస పత్రపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ మెచ్యూరిటీ కాలం 115 నెలలు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ 7.7%. నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ లభిస్తుంది.

ఫిబ్రవరిలో మౌలికం నెమ్మది



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమలతో కూడిన భారత్ మౌలిక రంగం ఫిబ్రవరిలో 6.7 శాతం పురోగమించింది. 2023 ఇదే నెల్లో ఈ వృద్ధి రేటు 7.4 శాతం. అయితే జనవరితో పోల్చితే (4.1 శాతం) గ్రూప్ పురోగమించడం గమనార్హం. సమీక్షా నెల్లో ఎరువుల రంగంలో వృద్ధిలేకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ పురోగతి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 8.2% నుంచి 7.7 శాతానికి తగ్గింది. ఎరువులుసహా బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ రంగాలు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వెయిటేజ్ 42 శాతం.

కొటక్ బ్యాంక్ చేతికి సొనాటా ఫైనాన్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఎన్‌బీఎఫ్‌సీ.. సొనాటా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 537 కోట్లు వెచ్చించింది. 549 బ్రాంచీల ద్వారా సొనాటా 10 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆర్‌బీఐ రిజిస్టర్డ్ మైక్రోఫైనాన్స్ సంస్థ సొనాటా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సుమారు రూ. 2,620 కోట్లు కాగా.. 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు కొటక్ బ్యాంక్ పేర్కొంది. దీంతో సొనాటా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించినట్లు వెల్లడించింది.

ఈ వార్తల నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,786 వద్ద ముగిసింది.

ఆర్థిక సంవత్సరానికి

లాభాలతో గుడ్ బై...

- సెన్సెక్స్ 655 పాయింట్లు ప్లస్
- 22,250 స్థాయి పైకి నిఫ్టీ
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

● సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ (0.50%), రిలయన్స్ (0.37%), హెచ్‌సీఎల్ (0.26%), టెక్ మహీంద్రా (0.25%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 26 షేర్లూ లాభపడ్డాయి.

● బీఎస్ఈ, నిఫ్టీలు ఎంపిక చేసుకున్న షేర్లలో బీటా వెర్షన్ టీ+0 ట్రేడ్ సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. తొలి రోజున రెండు ఎక్స్ఛేంజీల్లో 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ముంబై: ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,327 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద, నిఫ్టీ 392 పాయింట్లు బలపడి 22,516 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. స్టాక్ మార్కెట్ సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పాటు ఫారెక్స్ మార్కెట్లో బలహీనతల కారణంగా ఆఖర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్ఈలో రూ.3.33 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

నేడు ఎక్స్ఛేంజీలకు గుడ్‌ఫ్రైడే సెలవు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు రోజులు కావడంతో ట్రేడింగ్ సోమవారం ప్రారంభం అవుతుంది.

ర్యాలీ ఎందుకంటే

ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్ల(ఏఐఎఫ్)లో రుణదాతల పెట్టుబడులపై గతంలో కఠిన ఆంక్షలు విధించిన ఆర్‌బీఐ తాజాగా నిబంధనలను సులభతరం చేయడంతో అధిక వెయిటేజీ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. మోర్గాన్ స్టాన్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి అవుట్‌లుక్‌ను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి అప్‌గ్రేడ్ చేసింది. ఇటీవల ఎఫ్ఐఐలు భారత ఈక్విటీల పట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా సూచీలు రికార్డు స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి.

2023- 24లో రూ.128 లక్షల కోట్ల సృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్ 2023–24లో గణనీయమైన లాభాలు పంచింది. సెన్సెక్స్ 14,660 పాయింట్లు (25%) ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం విలువ ఏడాది వ్యవధిలో 128 లక్షల కోట్లు పెరిగి రూ.387 లక్షల కోట్లు చేరింది. సెన్సెక్స్ మార్చి 7న 74,245 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్చి 2న ఇన్వెస్టర్ల సంపద సైతం రూ.394 లక్షల వద్ద ఆల్‌టైం హైని తాకింది. ఇదే కాలంలో నిఫ్టీ 4,967 పాయింట్లు(29%) పెరిగింది. మార్చి 11న 22,526 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. 2022–23లో 423 పాయింట్లు పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు రూ. 5.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.

కార్వీకి సెబీ మరో షాక్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సెబీ మరో షాక్ ఇచ్చింది. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించినందుకు మర్చంట్ బ్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2023 మార్చి 15–17 తేదీల్లో కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌ను సెబీ బృందం తనిఖీల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ సెబీ కార్వీపై పలు చర్యలు తీసుకున్న సంగతి విదితమే.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు 72 శాతం వాటాదారులు అనుమతించినట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజాగా వెల్లడించింది. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. డీలిస్టింగ్ తదుపరి మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్‌లో విలీనంకానున్నట్లు తెలియజేసింది. డీలిస్టింగ్ పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను పొందనున్నట్లు వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
29-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

టయోటా వాహనాలు కాస్త ప్రియం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా మోటార్ ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలు పెంచనుంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ గురువారం ప్రకటించింది. తయారీ, నిర్వహణ వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. టయోటా తయారు చేస్తున్న మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.6.86 లక్షలు మొదలుకుని రూ.51.44 లక్షల వరకు ఉంది.

భారత్‌లో ఐఏఐ అనుబంధ సంస్థ ఏర్పాటు




న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ రంగ దిగ్గజం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భారత్‌లో తమ అనుబంధ సంస్థ ఏరోస్పేస్ సర్వీసెస్ ఇండియా (ఏఎస్ఐ)ని ప్రారంభించింది. మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో పాలుపంచుకోవడంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఏఎస్ఐ సీఈవో డ్యానీ లాబర్ తెలిపారు. భారతీయ సాయుధ బలగాల కోసం అధునాతన సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఏఐఏ, డీఆర్‌డీవో మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడగలదని వివరించారు.

కడెం.. ఖాళీ!



అడుగంటిన కడెం ప్రాజెక్టు



మిషన్ భగీరథ ఇన్‌టెక్ వెల్

- అడుగంటిన నీటిమట్టం
- బీళ్లుగా మారిన పొలాలు
- తాగునీరు కూడా కష్టమే

కడెం: ఏటా రెండు పంటలకు సాగు నీరందించే వరప్రదాయిని కడెం ప్రాజెక్ట్ ప్రస్తుతం వెలవెలబోతుంది. గతేడాది కన్నా నీటిమట్టం తగ్గిపోవడంతో ఇరిగేషన్ అధికారులు ఆయకట్టుకు యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో పొలాలు బీళ్లుగా మారాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావుల కింద సాగుచేసిన పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో నీటి కష్టాలు రెట్టింపు అవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే వేసవిలో తాగునీటికి కూడా తిప్పలు తప్పవని అధికారులు పేర్కొంటున్నారు.

క్రాప్ హాలిడే..

కడెం ప్రాజెక్టు ఏటా వానాకాలంలో 68 వేల ఎకరాల సాగు నీరందిస్తుండగా, యాసంగిలో 25 వేల ఎకరాలకు సాగు నీరందించేది. ఈ ఏడాది వచ్చిన వరదలకు గేట్ల పైనుంచి వరద వెళ్లడంతో గేట్లు మరమ్మతుకు వచ్చాయి. తెరిచిన గేట్లు కిందకు దిగకపోవడంతో చాలారోజులు నీళ్లు వృథాగా పోయాయి. దీంతో యాసంగి సాగయ్యే నాటికి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పది అడుగులు నీటిమట్టం తక్కువగా ఉంది. దీంతో యాసంగి పంటలకు నీరివ్వలేమని అధికారులు ప్రకటించారు. దీంతో బావులు, బోర్లు ఉన్న రైతులు కొద్దిమేర పంటలు వేశారు. నీళ్లు వస్తాయని కొందరు పంటలు వేశారు. ప్రస్తుతం అవి ఎండిపోతున్నాయి.

భగీరథకు కష్టమే..

కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాలకు కడెం నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. నిత్యం 9 క్యూసెక్కుల నీరు తాగునీటికి అవసరం. ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరడంతో మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌కు నీరందడంలేదు. రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో ఐదు మండలాలకు తాగునీరు కూడా కష్టమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాలువ తీస్తున్నాం



కడెం కిందనే ఉన్న మాకు నీళ్లు వస్తాయనే ఆశతో రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. కాలువకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. పంటలు వేసిన రైతులందరం కలిసి ప్రాజెక్టు కుడి కాలువకు నీరందేలా నెల రోజులుగా పిల్ల కాలువ తీస్తున్నాం. – శ్రీహరి, కౌలు రైతు, కన్నాపూర్

రెండెకరాలు బీడే



కడెం ప్రాజెక్ట్ కాలువ నీరే మా పంట పొలాలకు ఆధారం. ఈ యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించడంతో రెండెకరాల పొలం సాగు చేయకుండా వదిలేశాం. ఇప్పుడు పొలం బీడుగా మారింది. పంటలు వేయని రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. – రాజేశ్, కలమడుగు

నల్లా నీరే దిక్కు



మా ఊళ్లో చేతి పంపులు, బావులు లేవు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నల్లా నీరే మాకు ఆధారం. కడెం ప్రాజెక్టు ఎండిపోతంది. నల్లా నీళ్లు రావంటున్నరు. ఇప్పుడే ఇలా అయితే.. నడెండకాలం ఇంకా కష్టమైతది. – లక్ష్మి, మద్దిపడగ

టెక్నాలజీతో అధిక దిగుబడులు సాధ్యం



శాస్త్రవేత్తల పరిశోధన ప్రగతిని పరిశీలిస్తున్న వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ

జగిత్యాలఅగ్రికల్చర్: పంటల సాగులో ఆధునిక సాంకేతికత ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల ముగింపు సమావేశంలో మాట్లాడారు. సాగులో సమస్యలను పరిష్కరించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారని, రైతులు పరిశోధన స్థానాలకు వెళ్లి శాస్త్రవేత్తలకు వివరించాలని సూచించారు. రైతులు వ్యాపారిలా ఆలోచించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడికి ప్రయత్నించాలన్నారు. సంప్రదాయకతకు పెద్దపీట వేస్తూనే.. ఆధునికతను జోడించాలని, అద్భుత ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు రైతులతోపాటు శాస్త్రవేత్తలకూ సవాల్ విసురుతున్నాయని, వాటిని ఎదుర్కొనే అంశంపై పరిశోధనలు చేస్తున్నారని వివరించారు. పొలాస పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సాగులో సమస్యలు పరిష్కరించేందుకు శాస్త్రవేత్తలు బృందాలుగా గ్రామాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పంటల శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ఫొటో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కోతుల బెడద తీవ్రమైందని, శాస్త్రవేత్తలు పరిష్కార మార్గాలు చూపాలని, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గించే పరికరాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరారు. రాబోయే రోజుల్లో కొత్త పంటల సాగుపై శాస్త్రవేత్తలు, బృందాల వారీగా చర్చలు జరిపారు. వివిధ రకాల పంటల సాగులో అద్భుతంగా రాణిస్తున్న రైతులను సన్మానించారు. వానాకాలం వరి తర్వాత యాసంగిలో మొక్కజొన్న సాగు చేసిన రైతులను శాస్త్రవేత్తలు సర్వే చేయగా.. మొక్కజొన్న సాగుతో హెక్టారుకు రూ.58,299 నికర రాబడి వచ్చినట్లు నివేదిక అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖాధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

చి‘వరి’కి ఎండింది



గంభీరావుపేట(సిరిసిల్ల): ఎండలు మండుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఎంతో ఆశగా సాగుచేసిన యాసంగి పొలాలు చి‘వరి’కి మూగజీవాలకు మేతగా మారుతున్నాయి. గంభీరావుపేట మండలం గజసింగవరంలో కాపరవేని మహేశ్ రెండు ఎకరాలలో వరి సాగుచేశాడు. పంట చేతికందే దశలో బావుల్లో నీటి లభ్యత తక్కువైంది. ఎకరం పొలం కళ్ల ఎదుటే ఎండిపోయింది. చేసేదేమీ లేకపోవడంతో మూగజీవాలకు మేతగా వదిలేశాడు.

‘ఆర్‌ఎస్పీ గో బ్యాక్’

- ప్రవీణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు



కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో అతికించిన పోస్టర్

కౌటాల(సిర్పూర్): కౌటాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ‘బహుజన ద్రోహి ఆర్‌ఎస్పీ గోబ్యాక్’ అంటూ వెలిసిన పోస్టర్లు కలకలం సృష్టించాయి. సిర్పూర్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ తరుపున బరిలో దిగి 44,646 ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. అనంతర పరిణామాలతో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ మారిన తర్వాత తొలిసారి గురువారం సాయంత్రం కాగజ్‌నగర్‌కు వచ్చారు. పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఆయన పర్యటన నేపథ్యంలోనే బుధవారం అర్ధరాత్రి కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ‘బహుజన ద్రోహి ఆర్‌ఎస్పీ గోబ్యాక్’ అనే పోస్టర్లు అంటించారు. ఇవి గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్ అభిమానులు ఆ పోస్టర్లను తొలగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓటమికి పరోక్షంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య కారణమని భావించిన బీఆర్‌ఎస్ మాజీ కార్యకర్తలు గాని, బీఆర్‌ఎస్‌లో చేరడాన్ని నిరసిస్తూ బీఎస్పీ కార్యకర్తలు గానీ ఈ పోస్టర్లు అంటించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తెలుగు వర్సిటీ పురస్కారాలు ప్రదానం





శ్రీనివాస్, లక్ష్మణ్‌రావుకు పురస్కారం అందిస్తున్న దర్శకుడు నర్సింగరావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలను గురువారం కరీంనగర్‌కు చెందిన చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు, కవి బి.నర్సింగరావు, విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కిషన్‌రావు వారికి పురస్కారంతోపాటు రూ.20 వేల పారితోషికం అందజేశారు. 2022 సంవత్సరానికి గాను వివిధ రంగాలకు చెందిన 12 మందికి అవార్డులు ప్రకటించగా వారిలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉండటం విశేషం. ఈ సందర్భంగా అన్నవరం, గండ్రలను జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, ప్రముఖులు అభినందించారు.

భూ సేకరణపై సమావేశం



మాట్లాడుతున్న రవీందర్

మంథని: డివిజన్‌లోని ముత్తారం మండలంలో నిర్మించే జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం డివిజనల్ పరిపాలన అధికారి రవీందర్ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారికి సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనల నివేదికలను త్వరితగతిన అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం తహసీల్దార్ సుమన్, అధికారులు విజయశంకర్, వై.మానస పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 29-3-2024



గుడ్‌ఫ్రైడే

క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్టంగా వివరించుకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొర్రె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొర్రె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొర్రెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలియాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.


**''అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొర్రె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొర్రెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా''**

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ' అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొర్రెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.




ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.

● ముత్తు నందిని ప్యాలెస్


ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్



పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్



ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

''రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టుపక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరోటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం'' అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లి కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్ బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందుకెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.

● టెక్... టాక్



నుబియా జెడ్ అల్ట్రా ఫొటోగ్రాఫర్ ఎడిషన్

నూబియా జెడ్ 60 అల్ట్రా కెమెరా ఫోన్ 2023 ఆఖరులో ప్రత్యేకమైన 35 ఎంఎం ప్రైమరీ కెమెరా, స్లైడ్ ఆల్రౌండ్ స్పెసిఫికేషన్‌లతో విడుదలైంది. ఈ ఫోన్ ఇప్పుడు కొత్త డిజైన్, అదనపు ఏఐ కెమెరా ఫీచర్‌లతో కొత్త వెర్షన్‌గా వస్తోంది. దీనికి నూబియా జెడ్ 60 అల్ట్రా ఫొటోగ్రాఫర్ ఎడిషన్‌గా పిలుస్తున్నారు.

గెలాక్సీ ఏఐ

గెలాక్సీ ఎస్ 24 సిరీస్ ఆఫ్ స్మార్ట్‌ఫోన్‌లతో గత ఫిబ్రవరిలో శాంసంగ్ గెలాక్సీ ఏఐ ఫీచర్‌లను ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌లను ప్రీవియస్ జనరేషన్ ఫ్లాగ్‌షిప్స్‌కు (ఫోల్డబుల్ అండ్ నాన్-ఫోల్డబుల్ డివైజ్)కు అందుబాటులోకి తీసుకురానుంది. 'ఇప్పుడు శాంసంగ్ గెలాక్సీ ఎకోసిస్టమ్ అంతటా మరింత మంది వినియోగదారులకు గెలాక్సీ ఏఐ ఫీచర్‌లను తీసుకువస్తోంది' అని అధికారిక ప్రెస్ నోట్‌లో శాంసంగ్ తెలియజేసింది.





ప్రొఫిసీ ల్యాప్‌టాప్ స్టాండ్

బ్రాండ్: ప్రొఫిసీ కలర్ : స్పేస్ గ్రే
* ఎత్తు పెంచడానికి, సరియైన యాంగిల్‌లో కనిపించడానికి సులభంగా అడ్జస్ట్ చేసుకోవచ్చు.
*కంపాటబుల్: 11–17 అంగుళాల ల్యాప్‌టాప్స్
*బరువు: 950 గ్రా.

లెనోవా ట్యాబ్ ఎం 11

లెనోవా కొత్త బడ్జెట్ ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ ఎం 11ను విడుదల చేసింది. కొన్ని వివరాలు...
సైజ్: 11.0 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 1200×1920 పిక్సెల్స్
ర్యామ్: 8జీబి
ఇంటర్నల్ మెమొరీ: 128 జీబి
బరువు: 465 గ్రా.
బ్యాటరీ: 7040 ఎంఏహెచ్



● యంగ్ టాలెంట్

మెరుపుల మెరాకీ

నియమత్ మెహతా దిల్లీలో ఏర్పాటు చేసిన ఫస్ట్ సోలో ఎగ్జిబిషన్ 'మెరాకీ'కి మంచి స్పందన లభించింది. 'మెరాకీ' అనేది గ్రీకు పదం. దీని అర్థం మనసుతో చేయడం. ఈ ఎగ్జిబిషన్‌లోని 27 బ్రాంజ్, హైడ్రో రెసిన్ స్కల్ప్చర్‌లు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. మన పౌరాణికాల నుంచి సాల్వడార్ డాలీ, లియోనార్డో డావిన్సీ, లియోనోరా కారింగ్టన్, ఎంఎఫ్ హుసేన్‌లాంటి మాస్టర్‌ల కళాఖండాల వరకు స్ఫూర్తి పొంది ఈ శిల్పాలకు రూపకల్పన చేసింది మెహతా. బీథోవెన్ సంగీతం, లార్డ్ బైరన్ పదాల ప్రభావం మెహతా శిల్పకళపై కనిపిస్తుంది. లండన్ నుంచి రోమ్ వరకు తాను చూసిన, పరవశించిన ఎన్నో ఆర్ట్ షోల ప్రభావం ఆమె కళాత్మక ప్రయాణాన్ని ప్రకాశవంతం చేశాయి. ఒక చిన్న శిల్పం తయారుచేయడానికి నెల అంతకు మించి సమయం తీసుకుంటుంది. ఎగ్జిబిషన్‌లో అత్యంత ఆకర్షణీయమైన 'మిస్టర్ సినాత్రా' శిల్పం రూపొందించడానికి ఆమెకు ఎనిమిది వారాలు పట్టింది. ఎరుపు రంగు జాకెట్‌తో కనిపించే ఈ శిల్పం పాత కాలం బ్రిటిష్ పబ్ నుంచి ఇప్పుడిప్పుడే బయటికి వచ్చిన వ్యక్తిలా కనిపిస్తుంది. 'మన దేశంలో శిల్పకళకు అత్యంత ఆదరణ ఉంది' అంటున్న నియమత్ శిల్పకళపై ఆసక్తి ఉన్నవారికి సలహాల రూపంలో తనవంతుగా సహాయం చేస్తోంది.






నియమత్ మెహతా



షార్ట్ ఫ్యూజ్

త్వరగా కోపం వచ్చే, త్వరగా సహనం కోల్పోయేవారి విషయంలో వాడే మాట...షార్ట్ ఫ్యూజ్. **ఉదా:** హీ హ్యాజ్ ఏ షార్ట్ ఫ్యూజ్
మూలం: ఈ ఎక్స్‌ప్రెషన్ 1961లో వచ్చిన 'ది స్టెయిన్లెస్ స్టీల్ రాట్' అనే నవలలో మొదటిసారి కనిపించింది.

● సక్సెస్ స్టోరీ

సౌర రెక్కలతో...

ఐఐటీ బాంబే గ్రాడ్యుయేట్స్ నీరాజ్ జైన్, శ్రేయా మిశ్రా.. పుణె యూనివర్శిటీ గ్రాడ్యుయేట్ నిఖిల్ నహర్‌తో కలిసి 'సోలార్ స్క్వేర్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి విజయపథంలో దూసుకుపోతున్నారు. సోలార్ ప్యానల్స్ గురించి వేలాది మంది కన్స్యూమర్స్‌కు అవగాహన కలిగిస్తున్నారు. రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లో సోలార్ ఇన్‌స్టాలేషన్‌లతో 'సోలార్ స్క్వేర్' తనదైన ప్రత్యేకత సాధించింది....



'సోలార్ స్క్వేర్' బృందం

కరెంట్ బిల్లును చూసి 'అమ్మో' అనుకునేవాళ్లు దేశవ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారు. భారంతో కూడిన ఈ నిట్టూర్పు నుంచి నీరాజ్–శ్రేయా–నిఖిల్‌లకు ఒక అవకాశం కనిపించింది. మరోవైపు కన్స్యూమర్స్‌కు ప్రత్యామ్నాయం దొరికింది. గృహ యజమానులు, రెసిడెన్షియల్ సొసైటీలు రూఫ్‌టాప్ సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్‌ను ఎడాప్ట్ చేసుకోవడంలో, కరెంట్ ఖర్చులు తగ్గించుకోవడంలో 'సోలార్ స్క్వేర్' ఎంతో శ్రమించింది.

మూడున్నర సంవత్సరాల తరువాత... 'సోలార్ స్క్వేర్' ప్రముఖ సోలార్ బ్రాండ్‌గా అవతరించింది. మన దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లోని పదహారు నగరాలలో ఈ కంపెనీ తమ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 'సోలార్ స్క్వేర్'లో 20 శాతం వాణిజ్య, పారిశ్రామిక సోలార్ విభాగంలో ఉన్నప్పటికీ 80 శాతం రెసిడెన్షియల్ సెగ్మెంట్‌పై వైపు కేంద్రీకరించారు.

రెసిడెన్షియల్ సొసైటీలలో లిఫ్ట్, వాటర్ పంప్‌లు, స్ట్రీట్ లైట్స్...మొదలైన వాటికి సంబంధించి సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు.

'సోలార్ స్క్వేర్ ద్వారా రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లో కొన్ని ప్రమాణాలను నెలకొల్పాం. ప్రతి ఇంటికి సోలార్ ఇన్‌స్టాలేషన్ అనేది జటిలమైన వ్యవహారం. సంక్లిష్టతను పక్కకు నెడుతూ సులువైన పద్ధతిని తీసుకువచ్చాం. రెడీ–టు–ఇన్‌స్టాల్ సోలార్ కిట్స్ ద్వారా ఆరు గంటల్లోనే పని పూర్తయ్యేలా చేశాం' అంటుంది 'సోలార్ స్క్వేర్' ఫౌండర్‌లలో ఒకరైన శ్రేయా మిశ్ర.

'సోలార్ స్క్వేర్' ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. చాలామందికి సౌరశక్తి ఉపయోగం గురించి అవగాహన లేకపోవడాన్ని, విద్యావంతులు అయినప్పటికీ సౌరశక్తికి సంబంధించి ప్రాథమిక విషయాలు తెలియని వారిని 'సోలార్ స్క్వేర్' బృందం గమనించింది. దీనికి తోడు సోలార్ ప్యానెల్స్‌పై గృహ యజమానులలో ఎన్నో అపోహలు ఉన్నాయి.

జటిలంగా ఉన్న ప్రదేశాన్ని చదును చేసి కొత్త దారి ఏర్పాటు చేసింది 'సోలార్ స్క్వేర్' బృందం.

అవగాహన సదస్సులు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. సోలార్ పవర్‌కు సంబంధించి సంపూర్ణ అవగాహన కోసం పుస్తకాలు ప్రచురించి ఉచితంగా పంపిణీ చేశారు. ఇన్‌స్టాలింగ్‌కు ముందు సోలార్ పవర్ అనేది ఎందుకు అవసరమో, తమ ఇంటికి ఎలాంటి సోలార్ ఇన్‌స్టాలేషన్ అవసరమో ఇంటి యజమానులకు ఓపిగ్గా చెప్పేవారు.

'మన ప్రాజెక్ట్ పట్టాలకెక్కడం కష్టం' అని మొదట్లో 'సోలార్ స్క్వేర్' బృందం అనుకొని ఉంటే కథ ఎప్పుడో కంచికి వెళ్లి ఉండేది. అడుగులు ముందుకు పడడానికి అడ్డుపడే ప్రతికూల పరిస్థితులను తొలగించుకున్న తరువాతే ఆ కంపెనీకి రెక్కలు వచ్చాయి.

● అవును... ఇది నిజమే!



● చాప్లిన్ (1992)లో అనే చిత్రంలో ఒక విశేషం ఉంది. రిచర్డ్ అటెన్ బరో నిర్మించి, దర్శకత్వం వహించిన ఈ బయోగ్రాఫికల్ కామెడీ–డ్రామా మూవీలో చార్లీ చాప్లిన్ తల్లిగా ఆయన కూతురు గెరాల్డిన్ చాప్లిన్ నటించింది
● లియోనార్డ్ డావిన్సీ ఒకే సమయంలో ఒక చేతితో రాస్తూ, మరో చేతితో బొమ్మలు గీయగలడు.
● 'కరగుల్' అని పిలవబడే నల్ల గులాబీలు టర్కీలోని హాఫ్టెటీ పట్టణంలో మాత్రమే పెరుగుతాయి.
● తరాలకు అతీతంగా ప్రతి తరం సర్వసాధారణంగా ఉపయోగించే మాట ఓకే. దీని మూలం ఏమిటీ అనే దాని గురించి రకరకాల వాదాలు ఉన్నాయి. వాటి సంగతి ఎలా ఉన్నా ఒక వెర్షన్ ప్రకారం... గ్రీకు పదం 'హోల్ కొరెక్ట్' (ఆల్ కరెక్ట్) నుంచి వచ్చింది. 'ఓకే'కు చెప్పబడుతున్న ఫుల్‌ఫామ్‌లలో 'అబ్జెక్షన్ కిల్డ్' కూడా ఒకటి.

● గేమింగ్



శత కథానాయకుల ఆట

రోల్ ప్లేయింగ్ వీడియో గేమ్ ఎయుడెన్ క్రానికల్: హండ్రెడ్ హీరోస్ ఏప్రిల్ నెలలో విడుదల కానుంది. త్రీడీ బ్యాక్‌గ్రౌండ్స్‌తో సాగే ఆట ఇది. యుద్ధంతో దెబ్బతిన్న అల్రాన్ ఖండంలో పయనించడానికి, వందకు పైగా యూనిక్ హీరోలలో నుంచి ఐడియల్ 6–క్యారెక్టర్ పార్టీని క్రియేట్ చేసుకోవాలి. వ్యూహాత్మక యుద్ధాలలో శత్రువులను ఎదుర్కోవాలనే తపన ఉంటే ఈ గేమ్ మీ కోసమే. **జానర్:** రోల్–ప్లేయింగ్ ; **మోడ్స్:** సింగిల్: ప్లేయర్ ; **ప్లాట్‌ఫామ్స్:** నిన్టెండో స్విచ్, ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్


సినిమా

ఆ రోజే టైటిల్


● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమా టైటిల్ రిలీజ్ టీజర్‌ను ఏప్రిల్ 22న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. జూన్‌లో చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని కోలీవుడ్ సమాచారం. ఇక ప్రస్తుతం 'వేట్టయాన్' సినిమాతో బిజీగా ఉన్నారు రజనీకాంత్. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.

గుర్తుండే ఫ్యామిలీ స్టార్


● విజయ్ దేవరకొండ

"ఇరవైఒకటేళ్ల కింద ఏప్రిల్ 5న 'దిల్' సినిమా నిర్మాతగా 'దిల్ రాజు'గా మారాను. 21 ఏళ్ల తర్వాత ఇదే తేదీన మా 'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ అవుతోంది. మాస్, క్లాస్, యూత్, ఫ్యామిలీ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే కథతో ఈ చిత్రం రూపొందింది" అని 'దిల్' రాజు అన్నారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' వచ్చే నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో 'దిల్' రాజు ఇంకా మాట్లాడుతూ – "తన కుటుంబాన్ని పైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తి ఫ్యామిలీ స్టార్ అని చెప్పడమే ఈ సినిమా కథాంశం. మీలోనూ (ప్రేక్షకులు) ఫ్యామిలీ స్టార్స్ ఉంటారు. లేకపోతే ఈ సినిమా చూశాక ఫ్యామిలీ స్టార్ అవ్వాలని కోరుకుంటారు. 'గీత గోవిందం' తర్వాత పరశురామ్, విజయ్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ చిత్రం ఈ సమ్మర్‌లో అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది" అన్నారు. "ఈ చిత్రాన్ని, విజయ్ దేవరకొండను, మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు, ప్రతి తెలుగు కుటుంబం కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటారు" అని పరశురామ్ అన్నారు.

ప్రేమ... నవ్వు... యుద్ధం


● కార్తీక్ సుబ్బరాజు, సూర్య

'లవ్... లాఫ్టర్... వార్...' అంటూ సూర్య కొత్త చిత్రం అధికారిక ప్రకటన గురువారం వెలువడింది. 'పిజ్జా, పేటా, జిగర్ తండా, జిగర్ తండా డబుల్ ఎక్స్' వంటి హిట్ చిత్రాల దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. హీరో సూర్యకి ఇది 44వ చిత్రం. అయితే ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. సినిమా ప్రకటించిన సందర్భంగా 'లవ్... లాఫ్టర్... వార్...' (ప్రేమ.. నవ్వు.. యుద్ధం) అని ఉన్న పోస్టర్‌ని ఎక్స్‌లో షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజు. త్వరలోనే పూర్తి వివరాలను ప్రకటిస్తారు. ఈ చిత్రాన్ని సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కార్తీక్ సుబ్బరాజు స్టోన్ బెంచ్ క్రియేషన్స్ నిర్మించనున్నాయి. ఇక ప్రస్తుతం శివ దర్శకత్వంలో 'కంగువ' చిత్రంలో నటిస్తున్న సూర్య తనకు 'ఆకాశం నీ హద్దు రా' వంటి సూపర్ హిట్ ఇచ్చిన సుధ కొంగర దర్శకత్వంలో ఓ సినిమాకి పచ్చ జెండా ఊపిన సంగతి తెలిసిందే.

ఇక నా మాటే...


● శర్వానంద్

లండన్‌లో 'ఇక నా మాటే...' అంటూ ఆడి పాడారు శర్వానంద్. ఈ పాటకు జోష్‌గా స్టయిలిష్ స్టెప్స్ వేసి ఎంజాయ్ చేశారు. ఇదంతా 'మనమే' చిత్రం కోసమే. శర్వానంద్ హీరోగా కృతీ శెట్టి హీరోయిన్‌గా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఇక నా మాటే..' పాటను గురువారం విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు కృష్ణ చైతన్య సాహిత్యం అందించారు. "ఈ పాటకు మంచి ట్యూన్ ఇవ్వడంతో పాటు హేషమ్ అద్భుతంగా పాడారు. లండన్‌లోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ పాటకు బ్రాస్తీ వర్మ కొరియోగ్రఫీ చేశారు. విష్ణు శర్మ, జ్ఞాన శేఖర్‌ల కెమెరా వర్క్ కనువిందుగా ఉంటుంది. ఇక శర్వానంద్ స్టయిలిష్ డ్రెస్సింగ్, స్టైలిష్ మూవ్స్ ఆకట్టుకునేలా ఉంటాయి. కాలేజ్ స్టూడెంట్స్‌ని అలరించే పాట ఇది. యునిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఎస్..చెప్పుకున్నారు


● అదితి, సిద్దార్థ్

సిద్దార్థ్, అదితీరావ్ హైదరీల వివాహం తెలంగాణలోని వనపర్తి జిల్లా రంగనాయక స్వామి దేవాలయంలో జరిగిందనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే సిద్దార్థ్, అదితీల పెళ్లి ఇంకా జరగలేదని, వనపర్తిలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగిందని తెలుస్తోంది. అదితీతో తాను కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసి...'ఆమె ఎస్ చెప్పింది... ఎంగేజ్డ్' అని క్యాప్షన్ ఇచ్చారు సిద్దార్థ్. ఇదే ఫొటోను షేర్ చేసి.. 'అతను ఎస్ చెప్పాడు... ఎంగేజ్డ్' అని పేర్కొన్నారు అదితీరావ్ హైదరీ. కాగా వీరి పెళ్లి తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

టిల్లు నవ్వడు... ప్రేక్షకులను నవ్విస్తాడు



- సిద్ధు జొన్నలగడ్డ

"'డీజే టిల్లు' సినిమా రిలీజ్ సమయంలో ఆ సినిమాపై అంచనాలు లేవు. టిల్లు పాత్ర ఎలా ఉంటుందో తెలియదు. కానీ థియేటర్స్‌లో టిల్లు క్యారెక్టరైజేషన్‌ను చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యారు. అయితే ఇప్పుడు పరిస్థితి వేరు. తెలిసిన డీజే టిల్లు పాత్రతోనే మరోసారి మ్యాజిక్ చేసి, ఆడియన్స్‌ను మెప్పించాలంటే కాస్త ఒత్తిడి ఉంటుంది. అయితే ఈ ఒత్తిడిని జయించి మెరుగైన అవుట్‌పుట్‌ని ప్రేక్షకులకు ఇచ్చేందుకు యూనిట్ అంతా కష్టపడ్డాం" అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. 2022లో విజయం సాధించిన 'డీజే టిల్లు' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమాను సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– "సీక్వెల్‌లో టిల్లు పాత్ర ఇంకా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. అయితే సీక్వెల్‌లో టిల్లు మరో పెద్ద సమస్యలో చిక్కుకుంటాడు. ఆ సమస్య ఏంటి? అనేది ఆడియన్స్ థియేటర్స్‌లోనే చూడాలి. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు, షాక్‌లు ఉన్నాయి. సినిమాలో టిల్లు ఎక్కడా నవ్వడు... కానీ ఆడియన్స్‌ను నవ్విస్తాడు. అంటే టిల్లు ట్రాజెడీ.. ఆడియన్స్‌కు కామెడీ అన్నమాట. ఇక హీరోయిన్‌గా అనుపమగారి పాత్ర బలంగానే ఉంటుంది. 'టిల్లు' టైటిల్ సాంగ్ ఉండొచ్చు. త్రివిక్రమ్‌గారి సలహాలు 'టిల్లు స్క్వేర్'కు ఉపయోగపడ్డాయి. 'డీజే టిల్లు'కు తమన్‌గారి నేపథ్య సంగీతం ఎలా వర్కౌట్ అయ్యిందో, సీక్వెల్‌కు భీమ్స్ మ్యూజిక్ అలానే వర్కౌట్ అవుతుంది. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్'కు రైటర్‌గా చేశాను. వెంటనే 'టిల్లు 3' రాయాలనుకోవడం లేదు. మరో కథ రాయాలని ఉంది. నా తర్వాతి చిత్రం 'జాక్' చిత్రీకరణ 30 శాతం పూర్తయింది. నీరజ కోనగారి దర్శకత్వంలోని సినిమాకు స్క్రీన్ ప్లే వర్క్ జరుగుతోంది" అని చెప్పుకొచ్చారు.


నవీన్‌కు గాయాలు?


● నవీన్ పొలిశెట్టి

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతిరత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రాల్లో హీరోగా నటించిన నవీన్ పొలిశెట్టి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. కాగా అమెరికాలో నవీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని, చేతికి గాయమైందనే వార్తలు వస్తున్నాయి. దాదాపు రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సినదిగా వైద్యులు సూచించారట. వెకేషన్‌లో భాగంగా నవీన్ అమెరికా వెళ్లారని భోగట్టా.


● మృణాల్ ఠాకూర్

కొత్త జోడీ కుదిరేనా?


● వరుణ్ ధావన్

బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. 'మై తేరా హీరో', 'జుడ్వా 2', 'కూలీ నెం.1' వంటి సినిమాల తర్వాత హీరో వరుణ్ ధావన్, దర్శకుడు డేవిడ్ ధావన్ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా తెరకెక్కనుందని బీ టౌన్ సమాచారం. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందని, ఓ కథనాయికగా మృణాల్ ఠాకూర్‌ను యూనిట్ ఎంపిక చేసుకుందని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరి.. వరుణ్, మృణాల్‌ల జోడీ కుదురుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్


● ఎమ్మా స్టోన్

ఆస్కార్ విన్నింగ్ యాక్ట్రస్ ఎమ్మా స్టోన్ మెయిన్ లీడ్ రోల్‌లో నటించిన తాజా హాలీవుడ్ ఆంథాలజీ ఫిల్మ్ 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్'. 'పూర్ థింగ్స్' సినిమా తర్వాత దర్శకుడు యోర్గోస్ లాంటిమోస్‌తో కలిసి ఎమ్మా స్టోన్ చేసిన చిత్రం ఇది. జెస్సీ ప్లెమోన్స్, విల్లెం డాఫో, మార్గరెట్ క్వాలీ, హాంగ్ చౌ, జో ఆల్విన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. విభిన్న భాగాలు ఉండే ఆంథాలజీగా 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' ఉంటుందని హాలీవుడ్ సమాచారం. స్వీయ నియంత్రణ కోల్పోయిన ఓ వ్యక్తి, భార్య ప్రవర్తనలో అనూహ్య మార్పులు గమనించిన ఓ పోలీసాఫీసర్, ఆధ్యాత్మిక గురువు కావాలనుకునే ఓ మహిళ.. ఇలా విభిన్నమైన విభాగాలను దర్శకుడు ఈ సినిమాలో చెబుతున్నారని టాక్. ఇక ఈ చిత్రం అమెరికాలో జూన్ 21న, యూకేలో జూన్ 28న విడుదల కానుంది.



రాజస్తాన్ రాయల్స్ జట్టులో కేశవ్ మహరాజ్

దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌కు ఐపీఎల్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. గాయంతో ఐపీఎల్ టోర్నీకి దూరమైన బౌలర్ ప్రసిధ్ కృష్ణ స్థానంలో రాజస్తాన్ రాయల్స్ జట్టు కేశవ్‌ను అతని కనీస ధర రూ. 50 లక్షలకు జట్టులోకి తీసు కుంది. 34 ఏళ్ల కేశవ్ దక్షిణాఫ్రికా తరఫున 27 టి20లు, 44 వన్డేలు, 50 టెస్టులు ఆడి మొత్తం 237 వికెట్లు తీశాడు. మరోవైపు గాయపడ్డ ముజీబ్ ఉర్ రెహ్మాన్ స్థానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ అఫ్గానిస్తాన్‌కు చెందిన 16 ఏళ్ల స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను జట్టులోకి తీసుకుంది.

సూర్య... ఇంకొన్ని మ్యాచ్‌ల తర్వాతే!

ప్రపంచ నంబర్‌వన్ టి20 బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున బరిలోకి దిగేందుకు ఇంకొంత సమయం పడుతుందని బీసీసీఐ తెలిపింది. జూన్‌లో టి20 ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో తొందరపడి సూర్యను ఐపీఎల్‌లో వెంటనే బరిలోకి దించాలని బోర్డు భావించడం లేదు. జనవరిలో సూర్యకు 'స్పోర్ట్స్ హెర్నియా' ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం అతను జాతీయ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్నాడు.





రియాన్ పరాగ్

పరాగ్ ప్రతాపం

రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్ మెరుపు ఇన్నింగ్స్

- 45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 84 నాటౌట్
- రాయల్స్‌కు రెండో గెలుపు
- 12 పరుగులతో ఓడిన ఢిల్లీ

జైపూర్: సొంతగడ్డపై రాజస్తాన్ రాయల్స్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. టాపార్డర్ చేతులెత్తేసిన వేళ రియాన్ పరాగ్ (45 బంతుల్లో 84 నాటౌట్; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లందరినీ చితగ్గొట్టాడు. దీంతో ఐపీఎల్ 17వ సీజన్‌లో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. టాస్ గెలిచిన ఢిల్లీ బౌలింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రియాన్ పరాగ్ ఒంటిచేత్తో స్కోరు బోర్డును హోరెత్తించాడు. ఖలీల్, ముకేశ్, నోర్జే, అక్షర్, కుల్దీప్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి ఓడింది. డేవిడ్ వార్నర్ (34 బంతుల్లో 49; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (23 బంతుల్లో 44 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. బర్గర్, చహల్ చెరో 2 వికెట్లు తీశారు.

పరాగ్ మెరుపులతో....

రాజస్తాన్ ఆదిలోనే కష్టాల్లో పడింది. 7.2 ఓవర్లలో జట్టు స్కోరు 36/3. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (5) రెండో ఓవర్లో, కెప్టెన్ సంజూ సామ్సన్ (15) ఆరో ఓవర్లో పెవిలియన్ చేరారు. పవర్‌ప్లేలో వీళ్లిద్దరి వికెట్లు కోల్పోయిన రాయల్స్ 31 పరుగులే చేసింది. కాసేపటికే బట్లర్ (11)కు కుల్దీప్ ముగింపు పలికాడు. ఈ దశలో రియాన్ పరాగ్ ఇన్నింగ్స్‌కు అంత తానై నడిపించాడు. చెత్తబంతుల్ని బౌండరీలతో శిక్షించాడు. సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బ్యాటింగ్ ప్రమోషన్‌లో వచ్చిన అశ్విన్ (19 బంతుల్లో 29; 3 సిక్స్‌లు) చూడచక్కని సిక్స్‌లతో అలరించాడు. నాలుగో వికెట్‌కు 54 పరుగులు జతచేసిన అశ్విన్, పరాగ్ జోడీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. అశ్విన్ అవుటయ్యాక 15వ ఓవర్లో రాజస్తాన్ వంద పరుగుల మైలురాయిని చేరుకుంది. ఆ ఓవర్ ముగిసేసరికి రాజస్తాన్ జట్టు స్కోరు 108/4. ఇలాంటి స్థితి నుంచి 180 పైచిలుకు స్కోరు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. 34 బంతుల్లో పరాగ్ అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. ఆ తర్వాత పరాగ్ బ్యాట్ విధ్వంసమే చేసింది. దీంతో ధ్రువ్ జురెల్ (12 బంతుల్లో 20; 3 ఫోర్లు)తో పరాగ్ ఐదో వికెట్‌కు 23 బంతుల్లోనే 52 పరుగులు చకచకా జోడించాడు. ఆ తర్వాత హెట్‌మైర్‌తో కలిసి ఆరో వికెట్‌కు 16 బంతుల్లోనే 43 పరుగులు జతచేశాడు. నోర్జే వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో పరాగ్ వరుసగా 4, 4, 6, 4, 6, 1లతో 25 పరుగులు దంచుకున్నాడు. దీంతో చివరి 5 ఓవర్లలో రాజస్తాన్ 77 పరుగుల్ని అవలీలగా సాధించింది.

బర్గర్ దెబ్బ...

వార్నర్‌తో ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన మిచెల్ మార్ష్ (12 బంతుల్లో 23; 5 ఫోర్లు) బౌండరీలతో రెచ్చిపోయాడు. కానీ అంతలోనే ఇంపాక్ట్ బౌలర్ నాంద్రె బర్గర్... మార్ష్‌తో పాటు రికీ భుయ్ (0)ని మూడు బంతుల వ్యవధిలో అవుట్ చేసి ఢిల్లీని కష్టాల్లో పడేశాడు. ఈ దశలో వార్నర్ సిక్స్‌లు, ఫోర్లతో లక్ష్యానికి తగ్గ రన్‌రేట్‌తో క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను ధాటిగా నడిపించాడు. 11 ఓవర్లదాకా 93/2 స్కోరుతో ఢిల్లీ పటిష్టస్థితిలో ఉంది. కానీ తర్వాతి ఓవర్లో ఫిఫ్టీకి పరుగు దూరంలో ఉన్న వార్నర్... సందీప్ శర్మ కళ్లు చెదిరే క్యాచ్‌కు నిష్క్రమించాడు. కాసేపటికే కెప్టెన్ రిషభ్ పంత్ (26 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్)ను స్పిన్నర్ చహల్ వెనక్కి పంపాడు. ఇంపాక్ట్‌గా వచ్చిన పొరెల్ (9) కూడా చహల్ బౌలింగ్‌లో బోల్తా పడ్డాడు. బౌల్ట్ క్యాచ్ వదిలేయడంతో 14 పరుగుల స్కోరువద్ద బతికిపోయిన స్టబ్స్ తర్వాత వరుస రెండు బంతుల్లో భారీ సిక్స్‌లు కొట్టాడు. అక్షర్ (13 బంతుల్లో 15 నాటౌట్; 1 ఫోర్) పరిస్థితులకు తగ్గట్లు ఆడలేకపోయాడు. దీంతోపాటు డెత్ ఓవర్లలో సందీప్, అవేశ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఈ సీజన్‌లో జరిగిన 9 మ్యాచ్‌ల్లోనూ హోమ్ టీమ్ నెగ్గడం విశేషం.



వార్నర్

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (బి) ముకేశ్ 5; బట్లర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 11; సామ్సన్ (సి) పంత్ (బి) ఖలీల్ 15; పరాగ్ (నాటౌట్) 84; అశ్విన్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 29; జురెల్ (బి) నోర్జే 20; హెట్‌మైర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 185. వికెట్ల పతనం:** 1-9, 2-30, 3-36, 4-90, 5-142.
బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-24-1, ముకేశ్ 4-0-49-1, నోర్జే 4-0-48-1, అక్షర్ పటేల్ 4-0-21-1, కుల్దీప్ 4-0-41-1

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) సందీప్ (బి) అవేశ్ ఖాన్ 49; మార్ష్ (బి) బర్గర్ 23; రికీ భుయ్ (సి) సామ్సన్ (బి) బర్గర్ 0; పంత్ (సి) సామ్సన్ (బి) చహల్ 28; స్టబ్స్ (నాటౌట్) 44; అభిషేక్ పొరెల్ (సి) బట్లర్ (బి) చహల్ 9; అక్షర్ పటేల్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 175. వికెట్ల పతనం:** 1-30, 2-30, 3-97, 4-105, 5-122.
బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 3-0-29-0, బర్గర్ 3-0-29-2, అశ్విన్ 3-0-30-0, అవేశ్ ఖాన్ 4-0-29-1, చహల్ 3-0-19-2, సందీప్ 4-0-36-0.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X కోల్‌కతా
వేదిక: బెంగళూరు
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
చెన్నై	2	2	0	4	1.979
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
కోల్‌కతా	1	1	0	2	0.200
పంజాబ్	2	1	1	2	0.025
బెంగళూరు	2	1	1	2	-0.180
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925
లక్నో	1	0	1	0	-1.000

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఫైనల్లో బోపన్న జోడీ



ఫ్లోరిడా: ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ రోహన్ బోపన్న డబుల్స్ విభాగంలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-1, 6-4తో నాలుగో సీడ్ మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా) జంటపై విజయం సాధించింది. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 3-6, 7-6 (7/3), 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా)-సెమ్ వెర్‌బీక్ (నెదర్లాండ్స్) జోడీపై గెలిచింది. భారత్‌కే చెందిన మహేశ్ భూపతితో కలిసి బోపన్న చివరిసారి 2012లో మయామి ఓపెన్ టోర్నీ డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించి ఓడిపోయాడు.

పోరాడి ఓడిన మనిక



ఇంచియోన్ (దక్షిణ కొరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మనిక 12-10, 9-11, 6-11, 11-8, 8-11తో ప్రపంచ ఆరో ర్యాంకర్ హినా హయాటా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక ఐదో సెట్‌లో కీలక తరుణంలో మనిక తప్పిదాలు చేసి ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో ఓడిన మనిక బత్రాకు 3,500 డాలర్ల (రూ. 2 లక్షల 91 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో సింధు

మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి-సుమీత్ రెడ్డి జోడీ ముందంజ



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో సీడ్, భారత స్టార్ పీవీ సింధు జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో విజయంతో ఈ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21-14, 21-12తో హువాంగ్ యు సున్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్ ఆరంభంలో కాస్త పోటీ ఎదురైంది. స్కోరు 11-12 వద్ద సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా తొమ్మిది పాయింట్లు గెలిచి 20-12తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు దూకుడు కొనసాగింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో థాయ్‌లాండ్ ప్లేయర్ సుపనిదతో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 5-3తో ఆధిక్యంలో ఉంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ ద్వయం 22-20, 21-18తో ప్రెస్లీ స్మిత్-అలీసన్ లీ (అమెరికా) జంటపై గెలిచింది.

అశ్విని-తనీషా జోడీ గెలుపు

మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జంట 21-14, 21-8తో టిఫానీ హో-గ్రోన్యా సోమర్‌విల్లె (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్ కపిల-అర్జున్ (భారత్) ద్వయం 21-17, 21-19తో క్రిస్టోఫర్-మాథ్యూ గ్రిమ్లె (స్కాట్లాండ్) జంటపై నెగ్గగా... గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ (భారత్) జోడీ 16-21, 21-15, 16-21తో క్రిస్టో పొపోవ్-తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.



లాటిన్ అమెరికా క్లబ్ ఫుట్‌బాల్‌లో తొలి భారతీయ ప్లేయర్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాలర్ బిజయ్ ఛెత్రి అరుదైన ఘనత సాధించాడు. లాటిన్ అమెరికా క్లబ్ ఫుట్‌బాల్‌లో బరిలోకి దిగనున్న తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందనున్నాడు. మణిపూర్‌కు చెందిన 22 ఏళ్ల బిజయ్‌తో ఉరుగ్వేకు చెందిన కొలోన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఒప్పందం చేసుకుంది. ఇంకా భారత సీనియర్ జట్టుకు ఆడని బిజయ్ 2016లో షిల్లాంగ్ లాజోంగ్ క్లబ్ తరఫున అరంగేట్రం చేశాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్‌లో చెన్నైయిన్ ఎఫ్‌సీ తరఫున ఆడుతున్న బిజయ్ గతంలో ఇండియన్ యారోస్, చెన్నై సిటీ, రియల్ కశ్మీర్, శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ తరఫున బరిలోకి దిగాడు.

నితిన్ మీనన్ కొనసాగింపు

ఐసీసీ ఎలైట్ అంపైర్ల జాబితా ప్రకటన



దుబాయ్: భారత అంపైర్ నితిన్ మీనన్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎలైట్ అంపైర్ల ప్యానెల్‌లో వరుసగా ఐదో ఏడాది తన స్థానం పదిలం చేసుకున్నారు. ఇండోర్‌కు చెందిన నితిన్ తొలిసారి 2020లో ఐసీసీ ఎలైట్ అంపైర్ల జాబితాలో చోటు దక్కించుకున్నారు. గత నాలుగేళ్లుగా ఐసీసీ ఆయన సేవల్ని గుర్తించి ఎలైట్ ప్యానెల్‌లో కొనసాగిస్తూ వచ్చింది. తాజాగా ఈ ఏడాది కూడా మరోసారి పొడిగింపు లభించింది. ఓవరాల్‌గా అత్యున్నత అంపైర్ల ప్యానెల్‌కు ఎంపికైన మూడో భారత అంపైర్ మీనన్. గతంలో ఎస్. రవి, మాజీ స్పిన్నర్ ఎస్. వెంకటరాఘవన్‌లు ఎలైట్ క్లబ్‌లో ఉండేవారు. రవి 33 టెస్టు మ్యాచ్‌లకు ఫీల్డ్ అంపైర్‌గా సేవలందించగా, వెంకటరాఘవన్ ఏకంగా 73 టెస్టులకు (అన్ని ఫార్మాట్లలో 125 మ్యాచ్‌లు) అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం 12 మంది సభ్యులు గల ఈ ఎలైట్ క్లబ్‌లో భారత్ నుంచి 40 ఏళ్ల నితిన్ మీనన్ ఒక్కరే ఉన్నారు. కేవలం నాలుగేళ్ల కాలంలోనే ఆయన 122 అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశారు. ఇక ఈ ఏడాది బంగ్లాదేశ్‌కు చెందిన షర్ఫుద్దౌలా షాహిద్‌కు కొత్తగా ఎలైట్ అంపైర్ల జాబితాలో చోటు దక్కింది. బంగ్లా తరఫున ఈ అర్హత సాధించిన తొలి అంపైర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఐసీసీ ఎలైట్ మ్యాచ్ రిఫరీల జాబితా నుంచి సీనియర్ రిఫరీ క్రిస్ బ్రాడ్‌ను తొలగించారు. 2003 నుంచి సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన 123 టెస్టులు, 361 వన్డేలు, 135 టి20లు, 15 మహిళల టి20లకు రిఫరీగా బాధ్యతలు నిర్వర్తించారు. పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగానే ఆయన్ని తప్పించామని, ఇతరత్రా కారణాల్లేవని ఐసీసీ తెలిపింది.

అనిరుధ్-విజయ్ జోడీకి నిరాశ



కోస్టా బ్రావా (స్పెయిన్): జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ తన భాగస్వామి విజయ్ సుందర్ ప్రశాంత్‌తో కలిసి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. మూడో సీడ్ సాండెర్ అరెండ్స్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీతో జరిగిన మొదటి రౌండ్ మ్యాచ్‌లో అనిరుధ్-విజయ్ ద్వయం 4-6, 4-6తో ఓటమి పాలైంది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట మూడు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఆంద్రీ బెగెమాన్ (జర్మనీ) ద్వయం 4-6, 3-6తో ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-హెన్రీ పాటెన్ (బ్రిటన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. తొలి రౌండ్‌లో ఓడిన అనిరుధ్-విజయ్; బాలాజీ-బెగెమాన్ జోడీలకు 800 యూరోలు (రూ. 72 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్

మహిళల ఆసియా కప్ టి20 టోర్నీ షెడ్యూల్ విడుదల



దుబాయ్: ఈ ఏడాది మహిళల ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుంది. జూలై 19 నుంచి 28 వరకు దంబుల్లాలో ఈ టోర్నీ జరుగుతుందని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. చివరిసారి 2022లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఏడోసారి విజేతగా నిలిచింది. క్రితంసారి ఏడు జట్లు పాల్గొనగా... ఈసారి ఎనిమిది జట్లు పోటీపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, నేపాల్... గ్రూప్ 'బి'లో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్ జట్లున్నాయి. భారత్ తమ మూడు లీగ్ మ్యాచ్‌లను వరుసగా యూఏఈ (జూలై 19న), పాకిస్తాన్ (జూలై 21న), నేపాల్ (జూలై 23న) జట్లతో ఆడుతుంది. జూలై 26న సెమీఫైనల్స్... జూలై 28న ఫైనల్ జరుగుతాయి.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

వేములవాడకు తరలి వచ్చిన లక్షలాది మంది భక్తులు


పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని జరిపిస్తున్న రుత్వికులు

వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.50 గంటలకు వేదమూర్తుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం జరిగింది. ఐదు రోజులపాటు నిర్వహించుకునే ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు కల్యాణం సందర్భంగా వేములవాడ మునిసిపాలిటీ తరఫున కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్ పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సమర్పించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. ఈసారి కల్యాణ వేదిక ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేయడంతో సౌకర్యవంతంగా ఉందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 5 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కన్యాదాతలుగా అప్పాల భీమాశంకర్–ఇందిర దంపతులు, వ్యాఖ్యాతగా చంద్రగిరి శరత్ వ్యవహరించారు. చేతిలో త్రిశూలం – బాసింగం, నెత్తిన జీలకర్రతో ఉన్న రాజన్నను శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు పెళ్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, ఏఈవోలు బి.శ్రీనివాస్, జయకుమారి, నవీన్, హరికిషన్, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో రూ.12 కోట్ల రుణం

- రూ.70 లక్షల జప్తు.. ఈడీ కొరడా

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలతో యూనియన్ బ్యాంకు నుంచి రూ.12 కోట్ల రుణం తీసుకుని.. తిరిగి చెల్లించకుండా మోసగించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన జస్లీన్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన రూ.70 లక్షల విలువైన స్థిరాస్తులను ఈడీ అధికారులు గురువారం జప్తు చేశారు. చెన్నైలోని సీబీఐ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. జస్లీన్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట తప్పుడు పత్రాలు సమర్పించి రూ.12 కోట్లను సదరు కంపెనీ నిర్వాహకులు పొందినట్టు ఈడీ అధికారులు తెలిపారు. ఈ సొమ్మును సదరు కంపెనీ భాగస్వామి, అమ్రిక్ ఫర్నిచర్స్ లిమిటెడ్ ఎండీ రణ్‌బీర్ సింగ్ గాంధీ, తనకు చెందిన ఇతర కంపెనీల్లోకి, కుటుంబ సభ్యులు, బంధువుల వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించినట్టు ఈడీ అధికారులు గుర్తించారు.

పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్ కేసులో ఈడీ దూకుడు

580 బ్యాంకు ఖాతాల్లోని రూ. 32.34 కోట్లు జప్తు

సాక్షి, హైదరాబాద్: పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా రూ.వందల కోట్లు కొల్లగొట్టిన కేసు దర్యాప్తులో ఈడీ అధికారులు దూకుడు పెంచారు. హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి 580 బ్యాంకు ఖాతాల్లోని రూ.32.34 కోట్లు జప్తు చేశారు. ఈ మేరకు ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం..తాము సూచించే వెబ్‌సైట్లు, హోటళ్లు, రిసార్ట్‌లకు రేటింగ్, రివ్యూలు ఇస్తే మీ ఖాతాల్లో డబ్బులు వేస్తామని.. ఇలా ఇంట్లో కూర్చునే రోజుకు రూ.1,000 నుంచి రూ.1,500 సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్‌లకు పలువురికి మెసేజీలు పంపారు. సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నమ్మి, వారి ఉచ్చుకు చిక్కిన అమాయకులతో బోగస్ ఈ–వ్యాలెట్లు, నకిలీ యాప్‌లు డౌన్‌లోడ్ చేయించేవారు. వారికి లాభాలు ఇస్తామంటూ వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించేవారు. ఆ తర్వాత మీ ఈ–వ్యాలెట్‌లో ఉన్న డబ్బు ఫ్రీజ్ అయ్యిందని, తిరిగి పొందాలంటే ముందుగా కొంత డబ్బు మేంచెప్పే బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని నమ్మబలికేవారు. ఇలా కేవలం 15 రోజుల్లోనే దేశవ్యాప్తంగా 175 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.524 కోట్లు కొల్లగొట్టినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని సైబర్ నేరగాళ్లు యూఏఈ కేంద్రంగా చేసినట్టు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇలా అమాయకుల నుంచి సేకరించిన డబ్బులు, తప్పుడు ధ్రువపత్రాలు ఉపయోగించి తెరిచిన పలు బ్యాంకు ఖాతాల్లోకి మార్చినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ తరహా పార్ట్‌టైం జాబ్‌ల మోసాలపై దేశవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 50 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం రూ.32.34 కోట్లు నగదు జప్తు చేశామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

2న తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 9న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 2వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 2న ఉదయం 6 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉపాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేస్తారు.

అక్రమ నగదు, నగల రవాణాపై ఐటీ నిఘా

ఫిర్యాదుల కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు

వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని సూచించిన ఐటీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో నగదు, ఆభరణాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఆదాయపన్నుశాఖ(ఐటీ) చర్యలు ప్రారంభించింది. అక్రమ రవాణా సమాచారం అదించేందుకు పౌరుల కోసం ఐటీ శాఖ హైదరాబాద్ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఐటీ శాఖ అధికారులు గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో తెలంగాణలో నిఘా పెంచినట్లు తెలిపారు. నగదు, నగల అక్రమ రవాణాపై సమాచారం అందించేందుకు పౌరులు తమ ఫిర్యాదులను ఫోన్ కాల్ లేదా వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లా నుంచైనా సమాచారాన్ని అందించవచ్చని తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్ : 1800–425–1788
ల్యాండ్‌లైన్ నంబర్ : 040–23426201/ 23426202
వాట్సాప్ నంబర్ : 91–8688701400
ఈ– మెయిల్ ఐడీ: cleantelanganaelections@incometax.gov. in.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.